




ఉగాది శుభాకాంక్షలు


SAPTHAGIRI
1983
TIRUMALA TIRUPATI DEVASTHANAMS







నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభము లొసఁగెను.

సందించి వైశాఖ శుద్ధ చతుర్దశి శనివార
మందు సంధ్యాకాలమున నౌభలేశుడు
పొందుగాఁ గంభములోనఁ బొడమి కడపమీఁద
కందువ గోళ్ళఁ జించెఁ గనక కశిపుని.

నర మృగరూపము నానాహస్తముల
అరిది శంఖ చక్రాది ఆయుధాలతో
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచి రక్షించి నిలిచె
గురుతర బ్రహ్మాండ గుహలోనను.

కాంచనపు గద్దెమీఁద గక్కనఁ గొలువై యుండి
మించుగ నిందిరఁదొడ మీఁదఁ బెట్టుక
అంచె శ్రీ వేంకటగిరి నాదిమపురుషుండై
వంచన సేయక మంచివరాలిచ్చీ నదివో.

— అన్నమాచార్య అధ్యాత్మసంకీర్తన.

(మే 14, శ్రీ నృసింహ జయంతి సందర్భంగా)

మీమాట

ధన్యవాదాలు

ఏప్రిల్ సప్తగిరి ఒక విశిష్టస్థానం ఆక్రమించుకుంది. శ్రీయుతులు మైనంపాటి వారి 'చెన్నకేశవశతకం' శ్రీ రావుల తాత్పర్యసహిత 'భగవద్గీత'; రామాయణంలో తారవ్యక్తిత్వము; గుహుని భక్తి ప్రపత్తులు, లక్ష్మణుని మనోనిగ్రహము; ఉదాత్తమైన రచనలు. గ్రంథసమీక్షలు ఎంతోబాగున్నాయి. రచయితలందరికి ధన్యవాదాలు. ఈవిధమైన భక్తిజ్ఞానప్రబోధములకు ఆస్పదంగా ఉండు మీ సప్తగిరి అభ్యుదయ పరంపరాభివృద్ధి నొందుగాక

వెల్లాం మఖ్బయ్య — మోచంపేట.
గార్ల ఆనంద్ — హైద్రాబాద్.

శ్రీ వేంకటేశ్వర లీలలు

మార్చినెల సంచికలో శ్రీ వేంకటేశ్వర లీలలు చాలబాగుంది. ఇటువంటి సంఘటనలు చదవడంవలన మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. ముఖచిత్రం చాలబాగున్నది.

కె. వి. రమణ — కళింగపట్నం.
పీలంరాజు వేంకట సుబ్బారావు ... ఒంగోలు.

బాలప్రబోధం

ఏప్రిల్ సంచికలో "పరీక్ష" చాల బాగుంది. 'లక్ష్మణునిమనోనిగ్రహము' అను శీర్షికలో మానవజన్మమెత్తిన ప్రతిమనుజుడూ మనోనిగ్రహం కల్గివుండాలి. అప్పుడే మనిషిజన్మకు సార్థకత అని కథారూపంలో మనసుకు హత్తుకపోయేటట్లు ప్రచురించారు. రచయితలకు అభినందనలు. మార్చి సంచికలోని కుబేరవృత్తాంతం చాలబాగుంది.

చావా వేంకట చక్రపాణి — ఒంగోలు.
ఏ. రాంబాబు — హన్మకొండ.
పోలిశెట్టి బాలకృష్ణయ్య — వనపర్తి.

సంపాదకీయం

'సుదతి మెచ్చుల ఇల్లు సురలకు పుట్టిల్లు' ఏప్రిల్ సంచిక సంపాదకీయం సమస్త పురుషలోకానికే కనువిప్పు. శ్రీ సీతారామ లక్ష్మణుల ముఖచిత్రం మనోజ్ఞంగావుంది. 'తెలుగు వెలుగుల ఉగాది' హర్షదాయకము. సంపాదకులకు కృతజ్ఞతాంజలి.

జ్వాలా గోపినాథ్ — కడప.

గృహలక్ష్మి

"రామకథలో తారవ్యక్తిత్వము" చక్కగా వివరించారు రచయిత. అట్లే "భద్రాచలం రామాలయం" "పరీక్ష" ఉగాది వైశిష్ట్యము వ్యాసాల రచయితలకు ధన్యవాదాలు.

భీమా ప్రభాకర్‌శెట్టి — కనిమొట్ట.

అచ్చుపొరపాటు

ఏప్రిల్ 84 సంచికలో ముద్రితమైన "పరీక్ష" కథా రచయిత శ్రీ యం. ఉమామహేశ్వరరావు. కాని బి. ఉమామహేశ్వరరావుగా ముద్రణమైన అచ్చుపొరపాటును పాఠకులు సవరించి చదువుకోగలరు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం సం॥

గ్రంథసమీక్ష

ఏప్రిల్ సంచికలో "శ్రీరామమంత్రానుష్ఠానము" గ్రంథం సమీక్షింపబడింది. గ్రంథరచయిత: శ్రీ రామశరణ్, నామ ప్రయాగ్,బుద్దాం(పోస్టు),గుంటూరు జిల్లా. వెల: రు. 15/-.

రైళ్ళ విజ్ఞాపన!

అయ్యా!

కొండనాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడిందట. అలావుంది. గుంటూరు ప్రాంతంవారి పరిస్థితి. లోగడ 'సప్తగిరి'లో ప్రయాణీకుల సౌకర్యాలను గూర్చి ఓ పెద్ద ఉత్తరం రాయటం జరిగింది. అందులో సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి–వాల్తేరు ఎక్స్‌ప్రెస్‌గా మార్చమని తిరుమల–గోల్కొండ కలిపి తిరుపతి హైదరాబాద్ నడుమ ఏర్పాటు చేయవలసిందిగాను విన్నపాలు చేయటం జరిగింది. అవి జరగటం ఎలావున్నా ఇన్నాళ్ళుగా తిరుపతి-గుంటూరు మధ్య సౌకర్యం కలిగిస్తున్న కాకినాడ తిరుపతి పెట్టెలను విజయవాడలో సర్కారుకు తిరుమలకు తగిలించటంవల్ల గుంటూరు నుండి వినుకొండ అంటె సుమారు 100 కి. మీ ప్రాంతాలవారికి చాలా నేరుగా ప్రయాణము చేసే సౌకర్యం తగ్గింది. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి వరకు నడుపుతున్నందున అది గుంటూరువాళ్ళకు దాదాపు రద్దయినట్లే. అందుకే క్షిణక్షణముల్ అధికార్ల చిత్తముల్ అని ఎవరో అన్నమాట ఇప్పుడు జ్ఞాపకానికి వస్తుంది.

అసలు మంచైనా చెడైనా మొఖాన చెప్పుకోవాలి మరి. రైల్వేశాఖవారు ఈ 'సప్తగిరి' లో సూచించిన వాటిలో కొన్ని అమలు జరిపి మంచిపనే చేశారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి దాకా నడపటం, ఢిల్లీకి వెళ్ళేందుకు ఒక పెట్టె పూరి ఎక్స్‌ప్రెస్‌కు జోడించటం, ఒంగోలు తిరుపతి ప్యాసింజరును పేరుమార్చకుండా విజయవాడదాకా పొడిగించటం, మద్రాసు చీరాల ప్యాసింజరును విజయవాడదాకా పొడిగించటం లాంటివి నిజానికి అభినందనీయమైన మార్పులే. యాత్రికులకు ఉపయోగకరమైనవి కూడా కాని కాలానుగుణంగా పెరిగే యాత్రికుల సంఖ్య దృష్ట్యా అవసరాలు కూడా పెరుగుతూనే వున్నాయి. కనుక సూచనలుగా కొన్ని మార్పులు కూర్పులు అవసరమనిపిస్తున్నాయి.

లోగడనే విన్నవించినట్లు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి వాల్తేరుల మధ్య ఇప్పటి మార్గంలోనే నడపవచ్చు. తిరుపతికి ఎక్కువ సౌకర్యాలు కలుగుతున్నవి కనుక పెట్టెల సంఖ్యను తగ్గించవచ్చు. ఇది చుట్టు తిరిగి రావాలనుకుంటే గుంటూరు ప్రాంతంవారిని తెనాలిలో జోడించే విధంగా రెండు మూడు పెట్టెలు వేయవచ్చు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కూడా విజయవాడలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌తో హైదరాబాద్ దాకా నడపవచ్చు. కృష్ణా ఎక్స్‌ప్రెస్ వల్ల కొంత రద్దీతగ్గే అవకాశం వుంది గనుక కొన్ని పెట్టెలను మాత్రమే హైదరాబాద్ దాకా నడపవచ్చు. వేళ వేగం పెంచవచ్చు.

పై రెండు పద్ధతులలోను మిగులు పెట్టెలతో ఎక్కడికైనా ఇంకొక బండివేసే అవకాశం కలుగుతుంది.

ఇక పాసింజర్ల విషయంలో కొద్ది మార్పులు అవసరమౌతున్నై. తిరుపతి – విజయవాడల మధ్య కాకినాడ పాసింజరు 13 గం॥ ప్రయాణంచేస్తే మద్రాసు విజయవాడల మధ్య పాసింజరు 18 గంటలు ప్రయాణం చేస్తుంది. ఇది మధ్యతరగతి ప్రయాణీకులకు మామూలు శిక్ష. పొగ బండ్లున్న రోజుల్లోనే సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడలో బయల్దేరి తెల్ల

[46వ పేజీలో]

సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థాన సచిత్ర మాస పత్రిక...

గౌరవసంపాదకులు :
శ్రీ జి. కుమారస్వామిరెడ్డి,
ఐ. ఏ. ఎస్.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

*

ప్రచురణకర్త - సంపాదకుడు :
కాట్రపాటి సుబ్బారావు,
ఎమ్. ఏ.

*

ముద్రాపకుడు :
ఎమ్. విజయకుమార్ రెడ్డి

*

విడిప్రతి - రు. 1-00
సం॥ చందా - రు. 12-00

*

ప్రతులకు :
వెల్ ఫేర్ ఆఫీసర్,
టి. టి. డి., తిరుపతి.

ఈ సంచికలో ....

మే 1984
సంపుటి 14 సంచిక 12

ముఖచిత్రం మరియు 2, 3, 4 కవరుపేజీలు : స్వర్ణోత్సవ వైభవము.

సంపాదకీయం

నాలుగువేదాలు తెలిసినవాడు, తర్కవ్యాకరణ శాస్త్రాలు అధ్యయనం చేసినవాడు తప్ప ఇలా మృదుమధురంగా మాట్లాడలేడు. ఇవి శ్రీరాముడు లక్ష్మణునితో అన్నమాటలు. కాని, శ్రీరాముడు రాజవంశములోనివాడు గనుక, మైత్రి కోరివచ్చిన సుగ్రీవ మంత్రి ఆంజనేయుణ్ణి గూర్చి ఇలా అనుకోవడంలో ఆశ్చర్యం లేదు.

'అహో! ఏమి అతని తేజం. ఇతడు నాపై విరోధంతో వచ్చిన శ్రీహరి, లేదా నన్ను శపించిన నందీశ్వరుడే ఈ రూపంలో వచ్చివుండవచ్చు'. ఇవి తన సభలోకి ఇంద్రజిత్తు బంధించి తీసుకొచ్చిన ఆంజనేయుణ్ణి గురించి రావణుడు అన్న మాటలు. తన ఉద్యానవనాల్ని ధ్వంసంచేసి, గారాలపుత్రుడు అక్షకుమారుణ్ణి కనికరం లేకుండా చంపివేసిన వ్యక్తి తన ముందున్నప్పుడు కలుగవలసిన రోషక్రోధాలకు బదులు ఆంజనేయునిలోని దైవీశక్తి, భగవదంశ, తేజస్సు, అంతేగాదు భగవదవతారమే అన్న నమ్మకం, విభ్రాంతి రావణునికి కలిగాయి. రావణుడు కూడా ఆధ్యాత్మిక విదుడు గనుక, శివభక్తుడు గనుక ఆంజనేయునిలోని దైవీతత్వాన్ని సందర్శించగలిగాడు. ఈ రెండూ రాయబారఘట్టాలు కావటం విశేషం. ఒక ఘట్టంలో రాముని ప్రాపుకోరే సుగ్రీవుని మంత్రిగా మిత్రలాభం చేకూర్చాడు. రెండవదాంట్లో రావణునకు హితవు బోధించినా, ఎదిరిపక్షం విషయంలో రావణునిహృదయంలో భయం కల్గించి, విభీషణునిలో మానసికంగా రావణునిపట్ల వైముఖ్యపునారు పోసి మిత్రభేదతంత్రాన్ని సఫలం చేశాడు. భారతంలో కౌరవసభలో శ్రీకృష్ణపరమాత్మ కూడా తన అనంతశక్తి యుక్తులను ప్రదర్శించాడు, అయితే అటు రావణుడు, ఇటు దుర్యోధనుడు కూడా రాయబారాలను, రాయబారులను అవమానించి తమకు తామే ముప్పు తెచ్చుకున్నారు.

స్వామిభక్తి విషయంలో రామాయణంలో విలక్షణత కన్పిస్తుంది. లక్ష్మణుడు, ఇంద్రజిత్తు ఒక విధమైన మనస్తత్వం కలవారు. శస్త్రధారణ ప్రభుసేవకోసమే అన్నది వీరి వాదన. స్వామిపట్ల అచంచలవిశ్వాసం కర్తవ్యనిష్ఠరత వీరి ప్రధానధ్యేయాలు. రెండవకోవ భరత విభీషణులు. అకార్యకారకులెంతటి పూజ్యస్థానీయులైనా త్యాజ్యులే అని వీరి నమ్మకం. అందుకే అకార్యాచరణద్వారా తనకు రాజ్యాన్ని కట్టబెట్టి సంకల్పించిన మాతృశ్రీ కైకేయిని భరతుడు, సీతాపహరణం ద్వారా రాక్షసలోక వినాశనానికి నాంది పలికిన రావణుని వదిలేసిన విభీషణుడు ఈ కోవకు చెందినవారు. ప్రభువుకు హితాన్ని నిష్పాక్షికంగా బోధించినా వినక ఆత్మనాశాన్ని కొని తెచ్చుకొన్నప్పుడు కూడా, త్యజించక, వీరస్వర్గం అలంకరించిన కుంభకర్ణుడు స్వామిభక్తికి మరొక క్రొత్తసాక్షి.

కాని, ఆంజనేయుని స్వామిభక్తి అతివిచిత్రమైనది. వినూత్నమైనది. విశిష్టమైనదీకూడా. నిజానికి వాలికి మంత్రి హనుమంతుడు. అన్న వెడల గొట్టగా ఋష్యమూకం చేరిన సుగ్రీవునితోపాటు. విడవకుండ సుగ్రీవుని సేవించాడు. స్వామిభక్తి ప్రబోధితుడై రామమైత్రితో వాలివధకూడా సాధించినా వాలికిగాని, తారకుగాని హనుమంతునిమీది గౌరవభావం తగ్గకపోవడం రామాయణంలో కన్పిస్తుంది. దాసోఽహం కోసలేంద్రస్య అని చెప్పకొన్నా సుగ్రీవానుచరుడుగానే పనిచేసినట్లు కన్పిస్తుంది. ఆ అసిధారావ్రతాన్ని రామాయణం కడదాకా నిర్వహించాడు. ప్రతి కష్టతర కార్యసాధనకు మారుతి ప్రధానపాత్ర వహించాడంటే అది అతని ధైర్య, స్థైర్య సమయజ్ఞతలకు నిదర్శనాలు. అందువల్లనే హనుమద్దౌత్యం కల సుందరకాండ నూతనమైన ఆధ్యాత్మికనిర్వచనాలను పొంది, ఆంజనేయుని ఆచార్యపీఠాన నిలబెట్టింది.

హనుమంతుడు ఎంతటి రణపండితుడో, అంతటి సహృదయుడు కూడా. బాలుడు రణప్రచండుడైన అక్షకుమారుని సంహారంపట్ల అతని తాపం, కొలువుదీరిన రావణునిచూచి అధర్మ లేశం బలవత్తరం కాకపోతే; దేవేంద్రునితో కలిసి ముల్లోకాలేలకలవాడని మెచ్చుకోవటం, యుద్ధకాండలో నా చేతిదెబ్బలకి నీ వింకా బ్రతికి ఉండటం నా బలానికే మచ్చ అని రావణుని రణసహిష్ణుతను ప్రశంసించటం మానవులమైన మనకు అబ్బవలసిన, ఆంజనేయస్వామికి అబ్బిన విద్య. [48 వ పేజీలో]

సర్వజ్ఞుడు

ఒకసారి రావణుడు విశ్రాంతి మందిరంలో కూర్చున్నాడు. "నారాయణ, నారాయణ" అని హరినామస్మరణ చేస్తూ నారదుడు అక్కడకు వచ్చాడు. రావణుడు నారదుని పలుకరించాడు. "తాతయ్యా! నేను నవవ్యాకరణ పండితుడిని. నాకు తెలియని శాస్త్రం లేదు. నేనెరుగని క్రొత్త విషయం కూడా ఉండదని అనుకుంటున్నాను. ఏమంటావు?" గర్వంగా అన్నాడు రావణుడు. రావణుని అహంకారాన్ని గమనించి నారదుడు, "మనుమడా! నీవు సర్వజ్ఞుడివి" అన్నాడు.

"తాతయ్యా, నీవు త్రిలోక సంచారివి కదా, ఏదైనా క్రొత్త విషయం చెప్పగలవా?" అని రావణుడు ప్రశ్నించాడు. నారదుడు నవ్వుతూ, "రావణా, సర్వజ్ఞుడవైన నీకు నేను ఏమి చెప్పగలను" అన్నాడు.

"నారదా, ఎందుకు నీకు ఈ త్రిలోక సంచారం, నాలాంటి సర్వజ్ఞుడికి ఏదో క్రొత్త విషయం. లేదా ఏదో వింత చెప్పాలి. లేకుంటే ఎందుకు ప్రయాసపడుతూ తిరగడం" అంటూ తేలికగా మాట్లాడడం ప్రారంభించాడు రావణుడు. సరేనంటూ, నారదుడు మొలనుండి ఒక తాళపత్రం తీసి రావణునికి అందించాడు. "రావణా, ఈ తాళపత్రం తీసికో. నేను లంకాపట్టణం దాటేవరకు, దీనిని చదువ ప్రయత్నించకు, కాదని చదివినా నీకు ఏమీ కనిపించదు. మరో గంటలో ఈ లంకా పట్టణాన్ని విడువగలను. నేను రేపు ఇదే సమయానికి వస్తాను. నేను వచ్చే లోపల పత్రం చదివితే విషయం కనిపిస్తుంది. అది చదివి గ్రహించు. లేదని రేపు నేను వచ్చిన తరువాత చదువ ప్రయత్నించినా ఫలితం దక్కదు. ఇందులో ఏమీ కనిపించదు. గుర్తుంచుకో" అని హెచ్చరిస్తూ కదిలాడు నారదుడు.



రావణుడు గర్వపడుతూ ఆ తాళపత్రం ప్రక్కన పెట్టాడు.

మరుసటి రోజు మాటప్రకారం, నారదుడు రావణుని మందిరానికి వచ్చాడు. రావణుడు నారదుని చూసి తాళపత్రం గుర్తుకు తెచ్చుకున్నాడు. గాభరాపడుతు ప్రక్కనే ఉన్న తాళపత్రం తీసి చూసాడు. అందులో ఏమీ కనిపించలేదు. సిగ్గుతో తలదించుకుని, "నారదా, రాజకార్యాలలో పడి, తాళపత్రం చదవడం మరచాను. అందులో విషయం చెప్పు" అంటూ నారదుని అడిగాడు. ఆ మాటలు వింటూనే నారదుడు ఫకాలుననవ్వి ఊరుకున్నాడు.



రావణుడు, "నారదా, ఆ తాళపత్రంలో గల విషయం చెప్పు" అంటూ ప్రాధేయపడ్డాడు. అపుడు నారదుడు "రావణా! ఈ ఒక్క తాళపత్రం చదవడానికి నీకు తీరిక చిక్కలేదు కదా! ఎందరో శాస్త్రజ్ఞులు, ఎన్నో క్రొత్త విషయాలు, విజ్ఞానం, తాళపత్రాలలో పొందు పరుస్తున్నారు. అనుక్షణం విజ్ఞాన విషయాలు, వింతలు, విశ్వంలో పెంపొందుతున్నాయి. అన్నీ తెలుసునని గర్వపడడం ఎవరికిని తగదు. మరి నీకు, నీవే సర్వజ్ఞుడివని స్తుతించుకున్నావు. ఇకనైనా సర్వజ్ఞుడిననే గర్వం విడిచిపెట్టు" అన్నాడు. తన తప్పును తెలుసుకున్న రావణుడు ఎంతో సిగ్గుపడ్డాడు.

బాలలూ, ఎంతటి వారికైనా, అన్నీ వాకే తెలుసును అన్న అహంకారం తగదు. మనం నేర్చుకోవలసిన విషయాలు ఎప్పుడు ప్రపంచంలో ఉంటూనే ఉంటాయి. తెలిసింది కదా, మరి.

—బెహరా ఉమామహేశ్వరరావు

నవనారసింహక్షేత్రం - అహోబిలం


శ్రీకి నిరంతరంబు కడుచెన్న సలారెడు రాగలీల న
శ్పీకము బొంది యొప్పు తనచిత్తము జూపెడు మాడ్కి నిత్య ర
మ్యాకృతియైన కౌస్తుభము, నక్కపయించరించు నుత్తమ
శ్లోకుడహోబలేశు డతిలోకుడు లోకముగాచు గావుతన్

క్రీ. శ. 14 వ శతాబ్దానికి చెందిన ఎఱ్ఱా ప్రెగ్గడ తాను రచించిన 'నృసింహ పురాణము'లో అహోబిల నరసింహుని పై విధముగా స్తుతించెను. నవనారసింహస్వామి దేవాలయములు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా; ఆళ్ళగడ్డ తాలూకాలో నున్నవి. అహోబిలం చేరుటకు మద్రాసు బొంబాయి రైలు మార్గంలో కడపవద్ద దిగి, అచ్చటనుండి 85 కి. మీ. దూరంలో ఉన్న ఆళ్ళగడ్డకు బస్సులలో చేరుకోవచ్చును. ఆళ్ళగడ్డనుండి అహోబిలానికి బస్సు సదుపాయము కలదు.

దశావతారాలలో నాల్గవదైన నరసింహ స్వామిని ప్రధానదైవంగా పూజించే ఆలయాలు చాలగలవు. శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి యాదగిరి యందు ఉండగా నవనారసింహులకు ఆలయాలు ఒకే చోట ఉండటంచేత, అహోబిలం ప్రత్యేకతను సంతరించుకొన్నవి. అహోబిలం సముద్ర మట్టానికి 2,800 అడుగుల ఎత్తున గలదు. కొన్ని ఆలయాలు దిగువ అహోబిలంలోను, కొన్ని కొండకు వెళ్లే మార్గమధ్యంలోను మరి కొన్ని కొండ ఎగువ భాగంలో నున్నవి. అందుచే దిగువ అహోబిలం ఎగువ అహోబిలం అనిఅంటారు. ఈ తొమ్మిది నరసింహ ఆలయాలు ఐదు క్రోసుల విస్తీర్ణంలో ఉండుట వలన యీ క్షేత్రం 'పంచతీర్థ' మని కూడ పిలువబడుచున్నది. ఈ క్షేత్రానికి 'అహోబిలం' అను నామ మేర్పడుటకు పురాణగాథ యీ విధంగా ఉంది. ఉగ్ర రూపుడైన నరసింహుడు హిరణ్యకశిపుని సంహరించు సమయమున దేవతలు, నరసింహుని ఉగ్రరూపాన్ని "నరసింహః పరం దైవం. అహోబల మహోబల" మని స్తుతించుటవల్ల ఈ క్షేత్రానికి "అహోబలం" అను నామ మేర్పడెను. మూలవిరాట్టు ఒక పెద్ద గుహలో నుండుట కూడ 'అహోబిల' నామ కరణమునకు మూలమైనది.

భారతావనిలో నవనారసింహస్వామి ఆలయాలు అహోబిలంవద్ద ఉండడం విశేషం. ఆ ఆలయాలు యివి. 1. ఛత్రవట నరసింహస్వామి 2. కారంజ నరసింహస్వామి. 3. యోగానంద నరసింహస్వామి 4. భార్గవ నరసింహస్వామి 5. అహోబల నరసింహస్వామి 6. మాలోల(లక్ష్మీ)నరసింహస్వామి 7. క్రోడ నరసింహస్వామి 8. జ్వాలా నరసింహస్వామి 9. పావన నరసింహస్వామి.

కొండదిగువ ప్రహ్లాదవరదనరసింహ స్వామి ఆలయము గలదు. ఈ ఆలయశిల్ప సంపద, మండపములు విజయనగర శిల్ప సౌందర్యాన్ని గుర్తుకుతెస్తాయి. ఈ ఆలయమునకు 4 కి. మీ. దూరంలో ఛత్రవట నరసింహస్వామి ఆలయముకలదు. ఈ మూర్తి పద్మాసనుడై శంఖ చక్రధారుడై దక్షిణ హస్తము అభయ ముద్రను సూచించగా, వామహస్తము కటి భాగమందుంచబడినది. కొండపైకివెళ్ళే మార్గం సుందరమైన ప్రకృతి దృశ్యాలలో, దట్టమైన వృక్షసంపదతో, జలపాతములతో మనస్సుకు ఆహ్లాదమును ఆధ్యాత్మికచింతనను కల్గుగజేయును. ఈ మార్గమధ్యంలో కారంజ నరసింహస్వామి ఆలయము గలదు. ఈ మూర్తి యోగ ముద్రలో ఆసీనుడై, హస్తమున విల్లును ధరించినట్లు మలచబడెను. స్వామిశిరస్సుపై పడగ విప్పిన నాగు కలదు. ఈ ఆలయమునకు చేరువగా యోగానంద నరసింహస్వామి ఆలయము గలదు. ఈ విగ్రహము శంఖచక్రధారుడైన చతుర్భుజమూర్తి క్రింది రెండు హస్తములు యోగపట్టముపై నున్నవి. ఇచ్చటనే హిరణ్యకశిపుని సంహరించిన పిదప నరసింహస్వామి ప్రహ్లాదునకు యోగాసనములు నేర్పినట్లు పురాణకథనము గలదు. ఈ ప్రాంతముననే గోభిల, భరద్వాజ మహర్షులు తమ పాపములు పోగొట్టుకొనుటకు తపస్సు చేసిరి. ఈ ఆలయమునకు కొద్దిదూరములో భార్గవ నరసింహస్వామి ఆలయముగలదు. ఈ విగ్రహము చతుర్భుజమూర్తి శంఖచక్రధారియై హిరణ్యకశిపుని సంహరించుచున్నట్లుగా మలచబడినది. అంజలి ఘటించు ప్రహ్లాద విగ్రహము గలదు. భార్గవ నరసింహస్వామి తోరణమున దశావతార విగ్రహములు చెక్కబడినవి.



యోగానంద నరసింహస్వామి ఆలయము నుండి వేదాద్రి, గరుడాద్రి శిఖరములు కనబడుచుండును. భవనాశినది యీ శిఖరముల మధ్యనుండి ప్రవహిస్తోంది. నది రెండుపాయలై ఒకటి కుముదవతి, రెండవది పెన్నానదులలో కలియుచున్నది. స్వయంభువయిన అహోబలనరసింహస్వామి గరుడాద్రీపై వెలసియున్నాడు. ఎగువ అహోబిలమున సహజ సిద్ధముగ ఏర్పడిన గుహయందు మూలవిరాట్టు దర్శన

మిచ్చును. ఈ విగ్రహము సాలగ్రామశిలతో చేయబడెను. సుఖాసనమూర్తియైన ఉగ్రనరసింహస్వామి హిరణ్యకశిపుని సంహరించుచున్నట్లుగా విగ్రహము మలచబడినది. ఇచ్చటనే గరుడునకు స్వామి సాక్షాత్కరించెను. ఈ ఆలయమువద్ద పెద్దస్తంభము నుండే ఉగ్రనరసింహుడు వెలువడి హిరణ్యకశిపుని చంపెనని భక్తులు విశ్వసింతురు. తిరుమంగైఆళ్వారు, శ్రీరామానుజాచార్యులవారు, తాళ్ళపాక అన్నమాచార్యులవారు నరసింహస్వామిని తమ గానామృతముతో అర్చించారు.

ఉగ్రనరసింహస్వామి ఆలయమునకు ఒక మైలు దూరంలో మాలోల (లక్ష్మీ) నరసింహస్వామి ఆలయం ఉంది. చతుర్భుజుడై, శంఖచక్రధారుడై, శాంతమూర్తియైయున్న స్వామి అభయముద్రతో, వామహస్తముతో తన అంకముపై నున్న శ్రీదేవిని కౌగలించుకొని యున్నాడు. వేదాద్రి శిఖరముపైయున్న యీ ఆలయ ప్రాంతాన్ని లక్ష్మీక్షేత్రం అని కూడా పిలుస్తారు. అహోబల నరసింహస్వామి ఆలయానికి 3 కి. మీ. దూరంలో క్రోడ నరసింహస్వామి ఆలయముకలదు. ఈ ప్రదేశమందు మూడు రోజులు శతాక్షరి మంత్రము పారాయణ చేసిన ముక్తిని పొందెదరు. క్రోడ (వరాహ) నరసింహమూర్తి స్థానిక మూర్తిగా యున్నాడు. వామభుజముపై నున్న భూదేవి వరాహముఖమును కౌగలించుకొనియున్నది. విజయనగర శిల్పకళా వైభవం ఒప్పారుచున్న 16 స్తంభముల మండపము యిచ్చట గలదు. పై భాగాన జ్వాలా నరసింహస్వామి ఆలయమున్నది. ఉగ్రనరసింహస్వామి కోపము పరాకాష్ఠను చేరుకొన్న రూపమే యీ జ్వాలా నరసింహస్వామి విగ్రహ స్వరూపము. గరుడ పీఠముపై దశహస్తములు గలిగి హిరణ్యకశిపుని సంహరించునట్లుగా విగ్రహము మలచబడెను. హస్తములలో శంఖము చక్రము, అంకుశము, గద ఉన్నవి. చెంతలో అంజలి ఘటించియున్న ప్రహ్లాద విగ్రహము కలదు. గరుడాద్రికి 4 కి.మీ. దూరమున పావననదీతీరమున పావన నరసింహస్వామి ఆలయమున్నది. సుఖాసీనుడైన లక్ష్మీనరసింహస్వామి శంఖచక్రధారుడై, దక్షిణ హస్తముతో అభయముద్రను సూచించుచూ వామ హస్తమున లక్ష్మీదేవిని సమాదరించుచున్నాడు. వెనుక సప్తశిరస్సులుగల సర్పము గొడుగై యున్నది.

అహోబలపుణ్యక్షేత్రము చారిత్రాత్మకముగా ప్రాముఖ్యతను పొందినది. అహోబలదేవాలయములలో లభించే శాసనాధారములబట్టి రెడ్డిరాజుల కాలమున యీ ఆలయములు ప్రసిద్ధికెక్కినవిగా తెలియుచున్నది. కొండవీటిప్రభువైన ప్రోలయ వేమారెడ్డి (క్రీ. శ. 1325-1353) అహోబిలమునకు సోపాన మార్గమును కట్టించినట్లు తెలియుచున్నది. శా. శ. 1317 (క్రీ. శ. 1385-86) లో విజయనగర ప్రభువైన హరిహరరాయలు ఎగువ అహోబలమందు మండపము కట్టించెను. హంపీ విజయనగర ప్రభువైన శ్రీకృష్ణదేవరాయలు కళింగ దిగ్విజయానంతరము (శా.శ 1438-క్రీ.శ. 1516) అహోబల నరసింహస్వామిని దర్శించి, స్వామికి వజ్రమాణిక్యాల పతకం మాణిక్యాలతో పొదిగిన మణికట్టు, బంగారు పళ్ళెం, వెయ్యిబంగారు వరహాలు సమర్పించెనని శాసనముల ద్వారా తెలియుచున్నది. సదాశివరాయని రాజ్యకాలముతో కూడ అహోబలానికి ఆదరణ లభించెను. కాకతీయ రాజైన ప్రతాపరుద్రమహాదేవుడు యీ ఆలయమును పునరుద్ధరించెను. శాసనాధారములు లేకపోయినప్పటికి, కాకతీయశిల్ప కళా నైపుణ్యము అహోబలముఖమండప స్తంభములలో కానవచ్చుచున్నది. మొదటి అహోబలమఠాధిపతికి ప్రతాపరుద్రుడు బంగారునరసింహవిగ్రహమును బహూకరించెనని అనుశ్రుతముగా తెలియుచున్నది. ప్రస్తుతము నరసింహస్వామి స్వర్ణ ప్రతిమకు అహోబల మఠాధిపతులు ధూప, దీప, నైవేద్యములు జరిపించుచున్నారు. వైష్ణవభక్తుడు, గాయకుడైన శ్రీతాళ్ళపాక అన్నమాచార్యులవారు అహోబలాన్ని సందర్శించి యీ విధంగా కీర్తించారు. సప్తగిరివాసియైన శ్రీనివాసునే నృసింహస్వామిగా కొనియాడెను.

ఈవల నహోబిలాన నిరవై యున్నవాడు
శ్రీవేంకటాద్రిమీద సిద్ధమూర్తి యీతడు

నల్లమల కొండలు కర్నూలు జిల్లాలో ప్రారంభమై, చిత్తూరుజిల్లా వరకు వ్యాపించి ఉన్నవి. వీనిని ఆదిశేషుని ప్రతిరూపముగా పురాణములలో అభివర్ణించి ఉన్నారు. ఆది శేషుని శిరము తిరుపతిగా, అహోబిలము నడుముగా, శ్రీశైలము సర్పవాలముగా నలరారుచున్నవి. *

— వాగాభట్ల మార్కండేయశర్మ

ధర్మరక్షణ కార్యక్రమాలు

శంకరజయంతి

ఈ మే నెల 6 నుండి 10వ తేదీ వరకు గల 5 రోజులు కావలిలోని శ్రీ శంకర మఠంలో శ్రీ శంకర భగవత్పాదుల జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించబడినాయి. ప్రతిరోజు ఉదయం శ్రీ గొట్టిముక్కల రామకృష్ణగారిచే శంకరభాష్య ప్రవచనం జరుపబడింది. శ్రీ అక్కపెద్ది శ్రీరామశర్మ భాగవతార్‌గారి హరికథ, శ్రీ బోలూరు హనుమజ్జానకీరామశర్మ, శ్రీ ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి, డా॥ ధారా రామనాథశాస్త్రి మున్నగు వక్తలు ఉపన్యసించారు. ఈ ఉత్సవాలన్నీ శ్రీ ధారా నరసింహశాస్త్రిగారి పర్యవేక్షణలో నిర్వహింపబడ్డాయి.

శివరాత్రి-ఉగాది ఉత్సవాలు

హిందూ ధర్మరక్షణ సంస్థ మెదకు జిల్లా శాఖ, సంగారెడ్డిలో ఈ శివరాత్రి మొదలు ఉగాదివరకు 4 భజనకార్యక్రమాలు, 4 ధార్మికోపన్యాసాలు, రెండు చక్రభజనలు, 2హరికథలు జయప్రదంగా నిర్వహించారు. హరిజనవాడల్లో కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ జిల్లాశాఖ కార్యదర్శి ముడుంబై రంగకృష్ణమాచార్యులు నిర్వహించారు.

గీతాయజ్ఞం

శ్రీ రమా సత్యనారాయణస్వామి దేవస్థానం గుంటూరులో గత జనవరి 17 నుండి ఫిబ్రవరి 3 వరకు గల 18 దినాలు భగవద్గీతా జ్ఞానయజ్ఞం నిర్వహింపబడింది. యజ్ఞకర్త శ్రీమాన్ దిట్టకవి రామానుజాచార్యులు. ఈ యజ్ఞ ప్రారంభకులు డా॥ ప్రసాదరాయ కులపతి. చివరిరోజు ముగింపు సభలో శ్రీ జంధ్యాల జయకృష్ణ బాపూజీ, భగవద్గీతా శ్రోతలు ఎంతో పుణ్యాత్ములని వివరించగా, దేవాలయ ధర్మకర్త శ్రీ దశిక రామారావు పై వారిని ఘనంగా సన్మానించారు.

బ్రహ్మోత్సవాలు

ఈ మే నెల 10 నుండి 20 వరకు గల 11 రోజులు ప్రకాశంజిల్లా లింగసముద్రంలో వేంచేసివున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహింపబడుతున్నవి. 16వ తేదీ శ్రీవారికి గరుడవాహనం, 17వ తేదీ కల్యాణం, 18వ తేదీ రథోత్సవం.

ఉగాది

హిందూ ధర్మరక్షణ సంస్థ నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో, స్థానిక తి. తి. దే. కల్యాణ మండపంలో ఉగాది ఉత్సవాలు నిర్వహింపబడ్డాయి. శ్రీ చింతలపాటి పూర్ణానంద శాస్త్రిగారు పంచాంగ శ్రవణం చేయగా, శ్రీ కె. యస్. రామానుజాచార్యులు, శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డి, శ్రీ యస్. శ్రీనివాసులు, రామాయణ ఉపన్యాసాలిచ్చారు. కు॥ ఆర్. అనూరాధ, అన్నమయ్య పాటలను, శ్రీ వై. దుర్గాప్రసాద్ హరికథను గానం చేశారు.

కల్యాణమండపంలో, శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం స్థానిక వేంకటేశ్వర భక్తసంఘం వారిచే నిర్వహింపబడింది.

గుంటూరు

అలాగే, గుంటూరు హిందూధర్మరక్షణ సంస్థశాఖ స్థానిక సంజీవయ్య నగరు, హరిజనవాడలో రామాలయంలో ఉగాది కార్యక్రమాలు నిర్వహించారు. పురాణ పండితులు శ్రీ సోమాశి బాలగంగాధరశర్మగారు పంచాంగ శ్రవణము చేయగా, శ్రీ యం. వి. యల్. నరసింహారావు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. శ్రీ రాధాకృష్ణ భజన సంఘం వారిచే భజనలు నిర్వహింపబడ్డాయి. ఈ కార్యక్రమాలను జిల్లా ఆర్గనైజరు శ్రీ దుర్గా ప్రసాద్‌గారు పర్యవేక్షించారు. గుంటూరు తి. తి. దే. కల్యాణ మండపంలో నిత్యమూ సాయంత్రం శ్రీ సోమాశి బాలగంగాధరశర్మగారిచే పురాణ శ్రవణం నిర్వహింపబడుతున్నది.

హరిజనవాడలో

గత ఏప్రిల్ 7వ తేదీ ప్రొద్దుటూరు మోడంపల్లి హరిజనవాడలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యానందగిరి స్వాములు సందేశమిచ్చారు. ప్రతి హరిజన కుటుంబంవారు శ్రీ స్వామికి పాదపూజచేశారు. స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమస్థాపకులు శ్రీనామాఏరుకలయ్య ప్రతి హరిజన కుటుంబానికి తీర్థప్రసాదాలు, వంటపాత్రలు పంచారు. హిందూధర్మరక్షణ శాఖ ఆర్గనైజరు శ్రీ కె. కృష్ణాజి, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి.

శ్రీరామనవమి

ఉగాది సందర్భంగా ప్రకాశంజిల్లా వీరన్నపాలెం గ్రామంలో ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. స్థానిక వేంకటేశ్వర భక్తబృందం సహకారంతో, ప్రకాశంజిల్లా ధర్మరక్షణశాఖ ఈ కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించింది.

ప్రకాశంజిల్లా సంతమాగులూరుగ్రామం హరిజన, యానాదికాలనీల్లో స్థానిక వేంకటేశ్వర భక్తబృందంచే శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహింపబడ్డాయి. అచ్చట ప్రకాశంజిల్లా హిందూధర్మరక్షణశాఖ వారిచే శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహింపబడింది. తదనంతరం శ్రీ ఎం. వి. ఎల్. నరసింహారావు శ్రీరామతత్త్వాన్ని వివరించారు. పలువురువక్తలు ఉపన్యసించారు. జిల్లా ఆర్గనైజరు శ్రీ నాగేశ్వరరావుగారి ముగింపు ఉపన్యాసంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

పన్నెండవ అధ్యాయం

భక్తియోగం

అర్జున ఉవాచ:

ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే।
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః॥

అర్జునుడు: ఇలా నిరంతరం మనసు నీమీదే నిలిపి నిన్ను భజించే భక్తులు ఉత్తములా? ఇంద్రియాలకు గోచరించని ఆత్మస్వరూపాన్ని ఆరాధించే వాళ్లు ఉత్తములా?

శ్రీభగవానువాచ:

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే।
శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః॥

శ్రీ భగవానుడు: నా మీదే మనసు నిలిపి నిత్యనిష్ఠతో, పరమ శ్రద్ధతో, నన్ను ఉపాసించేవాళ్లే ఉత్తమయోగులని నా వుద్దేశం.

యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే॥
తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్।
భవామి న చిరాత్పార్థ! మయ్యావేశితచేతసామ్॥

పార్థా! సమస్త కర్మలూ నాకే సమర్పించి, నన్నే పరమగతిగా భావించి, ఏకాగ్రతతో నన్ను ధ్యానిస్తూ సేవించే నా భక్తులను – మనసు నామీదే నిలిపే వాళ్ళను – మృత్యుముఖమైన సంసార సాగరం నుంచి అచిరకాలంలోనే నేను ఉద్ధరిస్తాను.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః॥

నా మీదే మనసునూ, బుద్ధినీ నిలుపు. ఆ తర్వాత తప్పకుండా నీవు నాలోనే నివసిస్తావు.



శ్రీమద్భగవద్గీత

(సీరియల్)

వ్యాఖ్యాత:

శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి

యే త్వక్షరమనిర్దేశ్యం అవ్యక్తం పర్యుపాసతే।
సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్॥
సన్నియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః॥

ఇంద్రియాలన్నిటినీ బాగా వశపరచుకొని సర్వత్ర సమభావం కలిగి, సమస్త భూతాలకూ మేలు చేయడంలోనే సంతోషం పొందుతూ, నాశరహితమూ, అనిర్వచనీయమూ, అవ్యక్తమూ, సర్వవ్యాప్తమూ, ఊహాతీతమూ, నిర్వికారమూ, నిశ్చలమూ, నిత్యమూ అయిన ఆత్మస్వరూపాన్ని ఉపాసించే వాళ్లు నన్నే పొందుతారు.

క్లేశోఽధికతరస్తేషాం అవ్యక్తాసక్తచేతసామ్।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే॥

అవ్యక్తమైన ఆత్మస్వరూపాన్ని ఆరాధించేవాళ్ల శ్రమ ఎంతో ఎక్కువ. ఎందువల్లనంటే శరీరంమీద అభిమానం కల వాళ్ళకు అవ్యక్తబ్రహ్మం మీద నిష్ఠ కుదరడం కష్టసాధ్యం.

అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్।
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ॥

ధనంజయా! అలా మనసు నామీద నిశ్చలంగా నీవు నిలపలేకపోతే అభ్యాసయోగంలో నన్ను పొందడానికి ప్రయత్నించు.

అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ।
మదర్థమపి కర్మాణి కుర్వన్సిద్ధిమవాప్స్యసి॥

అభ్యాసం చేయడంలోనూ అసమర్థుడవైతే నా కోసం కర్మలు ఆచరించు. నాకు ప్రీతి కలిగించే కర్మలు చేయడం వల్ల కూడా నీవు మోక్షం పొందగలుగుతావు.

అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః।
సర్వకర్మపలత్యాగం తతః కురు యతాత్మవాన్॥

ఇక అదీ చేయలేకపోతే నన్ను ఆశ్రయించి, మనోనిగ్రహంతో నీవు చేసే సమస్త కర్మల ఫలాలను త్యాగం చెయ్యి.

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే।
ధ్యానాత్కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్॥

అవివేకంతో కూడిన అభ్యాసంకంటె జ్ఞానం మేలు; జ్ఞానంకంటే ధ్యానం ఉత్తమం; ధ్యానంకంటే కర్మఫలత్యాగం మంచిది. ఆ త్యాగంవల్ల మనశ్శాంతి కలుగుతుంది.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ॥
సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।
మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః॥

సమస్త ప్రాణులపట్ల ద్వేషం లేకుండా స్నేహభావం, దయకలిగి, అహంకార మమకారాలు విడిచి పెట్టి సుఖదుఃఖాలను సమానంగాచూస్తూ, ఓర్పుతో వ్యవహరిస్తూ నిత్యం సంతృప్తితో యోగసాధనతో, ఆత్మనిగ్రహంతో, దృఢసంకల్పంతో మనసూ, బుద్ధీ, నాకు అర్పించిన నా భక్తుడు నాకు ఇష్టుడు.

యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః।
హర్షామర్షభయోద్వేగైః ముక్తో యస్స చ మే ప్రియః॥

తనవల్ల లోకమూ, లోకంవల్ల తానూ భయపడకుండా సంతోషం, కోపం, భయం, ఆవేశాలకు వశంకాకుండా వుండే వాడు నాకు ఇష్టుడు.

అనపేక్షశ్శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః।
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్సమే ప్రియః॥

దేనిమీదా కోరికలు లేనివాడు, పవిత్రుడు, కార్యదక్షుడు, పక్షపాతం లేనివాడు, చీకూ చింతా లేనివాడు, ఆడంబర కర్మ లన్నిటినీ విడిచిపెట్టినవాడు అయిన నా భక్తుడు నాకు ఇష్టుడు.

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి।
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్య స్స మే ప్రియః॥

సంతోషం, ద్వేషం లేకుండా దుఃఖం, కోరికలూ, శుభాశుభాలు వదలిపెట్టిన నా భక్తుడంటే నాకు ఇష్టం.

సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః।
శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః॥
తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్।
అనికేతస్థిరమతిః భక్తిమాన్మే ప్రియో నరః॥

శత్రువులపట్ల, మిత్రులపట్ల, అలాగే మానావమానాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలు దూషణభూషణలపట్ల సమభావం కలిగినవాడు, దేనిమీదా ఆసక్తిలేనివాడు, మౌనంగా వుండే వాడు, ఏ కొద్దిపాటి దొరికినా సంతృప్తిచెందేవాడు, స్థిరనివాసం లేనివాడు అయిన నా భక్తుడు నాకు ఇష్టుడు.

యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే।
శ్రద్ధధానా మత్పరమాః భక్తాస్తేఽతీవ మే ప్రియాః॥

శ్రద్ధతో నన్నే పరమ గతిగా నమ్మి అమృతంలాంటి ఈ ధర్మాన్ని నేను చెప్పినట్లు పాటించే నా భక్తులు నాకు చాలా ఇష్టులు.

ఇలా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం శ్రీ కృష్ణార్జున సంవాదం అయిన శ్రీమద్భగవద్గీతలోని 'భక్తి యోగం' అనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

★

గృహలక్ష్మి

తరిగొండ వెంగమాంబ

— కుమారి మునిగోటి రాధిక

ఆంధ్ర కవితామతల్లిని కృతికుసుమాలతో అలంకరించి అర్చించిన కవయిత్రులలో మొల్ల, మధురవాణి, రంగాజమ్మ, తరిగొండ వెంగమాంబ మొదలగు వారు పేరెన్నిక గన్నవారు. ప్రముఖ వాగ్గేయకారుడు సారంగపాణి, భక్తకవి ధూర్జటి, కన్నడకవిరత్నము పంపడు మున్నగు మహనీయుల జననముచే పునీతమైన ప్రదేశం చిత్తూరు మండలం. అట్టి ఈ మండలంలో జన్మించి, మూఢాచారాల నెదిర్చి, తన కవితా శక్తిచే భగవన్నామ పారాయణ మొనరించుచు తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నము గావించిన భక్త కవయిత్రీమతల్లి తరిగొండ వెంగమాంబ!

వెంగమాంబ జన్మస్థలం చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకాలోని తరిగొండ. ఈ గ్రామం భక్తవత్సలుడగు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి ప్రీతి పాత్రమైన పవిత్రభూమి. రాయలసీమప్రాంతాన్ని పురాణకాలంలో ప్రహ్లాదుడు పరిపాలించిన దేశం అని అంటారు. బహుశ అందుకే కాబోలు ఈ ప్రాంతంలో నృసింహ స్వామి వారి ఆలయాలు అధికంగా వెలసి ఉన్నాయి.

పూర్వమీ ప్రాంత మంతా చెట్టుచేమలతో నిండి పచ్చని పచ్చిక బయళ్ళతో కనుల పండువుగా కళ కళ లాడుతూ వుండేది. సంపదలో కెల్ల శ్రేష్ఠమైనది పశుసంపద. అట్టి పశుసంపద సమృద్ధిగా గలిగిన "చిట్టి చెర్ల" నాయని వారైన రామనాయుడు తమప్రాంతములో కఱవు కాటకాదుల వల్ల బాధలుపడి, పశుగ్రాసంకోసమై తిరుగాడుతూ తన పరివారంతో తరిగొండ ప్రాంతానికి తరలివచ్చి శోభాయమానమైన అచ్చటి ప్రకృతి సౌందర్యాన్ని చూచి, ఆనందించి, అచ్చట కొన్నాళ్లు ఉండదలచి, గుడారాలు వేసికొన్నారు.

ఒకనాడు ప్రభాత వేళ రామానాయని వారి సతీమణి చల్ల చిలుకుతూ వుండగా ఉన్నట్టుండి కుండలో ఒక రాయి కవ్వానికి అడ్డు తగిలింది. ఆరాతిని రెండు మూడు పర్యాయాలు తీసివేసినా మరల మరల ఆ రాయి అదే విధముగానే అడ్డురాసాగింది. అందుకు ఆమె ఆశ్చర్యపడి ఆ వింతను తన పతికి తెలియజేసింది. అతడును అందుకు కారణం నిశ్చయింప జాలక ఆలోచనా పరవశుడయ్యాడు. వారి ఇలవేల్పైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి నాటి రాత్రి స్వప్నంలో సాక్షాత్కరించి తాను వాళ్లను వీడక ఇంత దూరం వచ్చినాననియు, ఇక ఈ తపోభూమి యందే నెలకొని భక్తుల అభీష్టాదులుతీరుస్తూవుంటాన నీపల్కినాడట. శ్రీ స్వామి వారి ఆనతి మేరకు ఆ రామానాయుడు ఆ నల్లని రాతిని స్వామితో బాటు ఒక పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠగావించాడు. ఆ స్థలంలో అంతకు పూర్వం ఎన్నో యేళ్ల క్రితం దూర్వాస మహర్షి లక్ష్మీనృసింహ స్వామిని ప్రతిష్ఠించి వుండినారట! అంతే గాక ఆ మహర్షి మరింత మహిమ సంతరింపజేసే ఉద్దేశంతో ఆ ఆలయంలో అసత్యమాడితే అట్టివారు అన్నివిధాల అడుగంటిపోతారని నిర్దేశించాడట! ఆ మహనీయుని దివ్యవాక్కు ప్రత్యక్షర సత్యం అనటానికి నేటికీ అనేక తార్కాణాలు అగపడుతూనే వున్నాయి.

మజ్జిగ కుండ (తరికుండ) లో స్వామి ఉద్భవం కావడంచేత "తరికుండ" అను పేరుతో ఈ గ్రామం ప్రసిద్ధమై, రానురాను ప్రజల ఉచ్చారణలో "తరిగొండ" గా



స్థిరపడింది. నాడు కుండలో అగుపించిన నల్లని రాయి నేటికీ స్వామివారి సన్నిధిలో పూజలందుకొంటూ సాక్షిభూతంగా విల సిల్లుతూ వున్నది.

అట్టి మహాపుణ్య క్షేత్రంలో జన్మించడం వల్లనే ఈ కవయిత్రీమతల్లి తరిగొండ వెంగమాంబగా ప్రశస్తిగాంచింది. ఈమె పదు నెనిమిదవ శతాబ్దపు ఉత్తరార్ధంలో జీవించి వుండినట్లు పరిశోధకుల అభిప్రాయం. వీరిది పండిత వంశం. ఇందుకు నిదర్శనంగా వీరి తాతగారైన శ్రీకానాల నరసింహ కవిగారు (క్రీ. శ. 1750 ప్రాంతం) "శేషధర్మములు" అనే గ్రంథం రచించి తరిగొండ లక్ష్మీనృ సింహునికి అంకితంచేసి వుండడమే. పుణ్య దంపతులైన మంగమాంబా, కృష్ణయ్యల పూజాఫలమీమె! "పువ్వుపుట్టగానే పరిమళి స్తుంది" అనే సామెతగా ఈమె బాల్యం నుండీ భగవంతునికి సంబంధించిన ఆట పాటల్లో అమితాసక్తి చూపుతూ, పార మార్థిక చింతనతో నిత్యం కాలక్షేపం చేస్తూ వుండింది. ఎనిమిదేళ్ల యీడున నిజగురు వైన సుబ్రహ్మణ్య యోగిచే తారకోపదేశం పొందింది. పండ్రెండేండ్ల ప్రాయంలో లోకరీతిని అనుసరించి వివాహ మాడవలసి వచ్చినప్పటికీ, రమానాథుడే తన మనో నాథుడన్న భక్తమీరావలె, సాంసారికచింతన విడిచి తపస్విని వలె మెలగుతూ వుండింది.

అనతికాలంలోనే వైధవ్యం సంప్రా ప్తింపగా కుల మర్యాదల ప్రకారంగా వైధ వ్యరీతిని అంగీకరింపకుండింది. వేంకట నాథుడే తన నాథుడనే విశ్వాసంతో తనకు వైధవ్యం రాలేదనీ శిరోముండనం వంటి మూఢాచారాలను ససేమిరా అంగీకరింపక ఎదురు నిలిచింది. ఈ విప్లవాత్మక భావన విప్రకులంలో కలకలం రేపింది. వారెట్లైనా ఆమె చేత వైధవ్య లక్షణాలను ఆచరింప జేయవలెననే పట్టుదలతో శతథా ప్రయ త్నింపసాగారు.


ఈ విధంగా బ్రాహ్మణ సంఘానికీ వెంగ మాంబకూ నడుమ వైరుధ్యం కొనసాగుతూ వుండగా ఒక పర్యాయం పుష్పగిరి పీఠాధి పతి సపరివారంగా తరిగొండకేతెంచారు. బ్రాహ్మణులంతా కలసి కట్టుగా స్వాముల వారికి వెంగమాంబ వృత్తాంతాన్ని నివే దించారు. ఆమె కారణ జన్మురాలని తమ దివ్య దృష్టితో తెలిసికొన్న స్వాములవారు ఆమె మహిమను అందరూ గ్రహించేటట్లు చేయదలచినవారై ఆమెతో పలు విధాల వాదోపవాదాలను కొనసాగించినారు. చిట్ట చివరకు ఆమె శిరోజాలు తొలగించి నట్లైతే అటుపిమ్మట వాటిని మొలవకుండా చేయ గల్గితే తానందుకు సిద్ధమే అని పలికింది. స్వాములవారు చిఱునవ్వుతో చూస్తూవుండి నారు. శిరోముండనం యథావిధిగా ముగిసిన పిదప ఆమె కోనేట్లో మునిగి లేచింది. చూపరులందరు దిగ్భ్రాంతి చెందగా ఆమె శిరోజాలు ఎప్పటి రీతిని శిరస్సుపై గోచరించాయి. బ్రాహ్మణులు ఆమె మహిమను గుర్తించినవారై వెనకకు మరలినారు, వెంగమాంబ నరహరిని కీర్తిస్తూ స్వామి దర్శనానికి సాగిపోయింది.

"చేరి తరిగొండపురి నారసింహ దేవుఁ
డాన తిచ్చిన రీతిగ నే నిమిత్త
మాత్రమునఁ బల్కుదును స్వసామర్థ్య మిప్పు
డరయ నించుక యేని నాయందు లేదు"


అని నుడివిన

వెంగమాంబ మురాషావలీ- అను మహమ్మదీయునకు శ్రీకృష్ణమాచార్యుడను జిజ్ఞాసువుకూ, తన తలి దండ్రులకూ తత్త్వోప దేశంకావించి తానిక ఆ గ్రామంలో నిలవక తనమనోనాథుడైన జగన్నాథుని చేరదల చినదై సొరంగమార్గం గుండా పుణ్యక్షేత్ర మైన తిరుమల చేరుకొన్నది.

తిరుమలలో శ్రీవారిని సేవిస్తూ కొంత కాలం వుండిన అనంతరం ఆ మహనీయు రాలు తుంబురుకోనచేరి అచ్చట ఒక గుహలో కొన్నిసంవత్సరాలు తీవ్రంగా తపస్సాధన గావించి మహాయోగిని అయింది. అటుపిమ్మట భక్తుల కోరికపై తిరుమలకు మరలివచ్చి, తాళ్లపాక వారి యింటి ప్రక్కనున్న తన మఠంలో నివ సిస్తూ గ్రంథరచన కొనసాగించింది. ఈ రీతిగా శ్రీనివాసుని దివ్యలీలలను అభి వర్ణించుకొంటూ జీవిత పర్యంతం ఆ దేవుని పదసన్నిధిగా గడిపి మోక్షాన్ని చూఱ గొన్నది ఈ పరమ భాగవతోత్తమురాలు!



రాగలహరి



సప్తగిరి ప్రారంభించిన గ్రంథసమీక్ష బహుళ జనాదరణ పొందిన విషయము అందరకూ తెలిసినదే. కాని ఈ సమీక్షాకార్యక్రమము నిజానికి ఏ ఒక్క కళకిపరిమితము కాదు. అయితే కళలు తరచినకొద్దీ అమృత స్పందిని అవుతుంది. సప్తగిరి జన్మ సంచిక నుండి 'రాగలహరి' శీర్షికన భక్తిప్రబోధకమైన క్యాసెట్ల సమీక్ష కార్యక్రమము ప్రారంభించబోతున్నాము. దీనివలన మహాకవుల లలిత భావతరంగాలు దేశమంతటా వ్యాప్తికలిగించే అవకాశం ఏర్పడుతుందని ఒక భావన.

తమ క్యాసెట్లను సమీక్ష చేయించదలచుకొన్నవారు రెండు క్యాసెట్లు ఈ క్రింది చిరునామాకు పంపవలసివుంటుంది.

చిరునామా :

'రాగలహరి' శీర్షికకు,
సంపాదకుడు,
సప్తగిరి, తిరుపతి.

మహనీయుల చరితము నర్థము చేసి కొనజాలని లోకులు కాకులు గదా! తిరుమల యందును ఈమె తిరస్కారముల సహింప వలసి వచ్చింది. రామకృష్ణుని వలె నీమెయు పిచ్చిదిగా పరిగణింపబడి, బావాజీవలె బాధలనందినది. ఈమె మహిమలెన్నింటినో దెల్పు దృష్టాంతములు గలవు. శ్రీ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవ సమయమున స్వామి వారి రథము ఈమె బసచేసిన ఇంటి ముంగిటి వరకు వచ్చి ఆగి పోయినదట! ఇదమిత్థంగా కారణమేమో గ్రహించలేని గుడి పూజారులు, తదితరులు ఏనుగులతో లాగించినా ఒక్క అంగుళమైనా కదల్లేదు. ఏమీ చేయడానికి తోచని పూజారులు తమలోతాము తర్జన భర్జనలు చేయసాగారు. అప్పుడు అచ్చట చేరియున్న భక్తాదులలో ఒకడు "ఇది వెంగమాంబ గారిని నిర్లక్ష్య మొనరించి నందుకు శ్రీస్వామివారికి ఆగ్రహము వచ్చియుండవచ్చు" అని పల్కాడు. అది నిజమే ఐ యుంటుందని వాళ్లామెను సమీపించారు. "వెంగమ్మ తల్లీ! మా తప్పిదాన్ని మన్నించి మా యెడ ప్రసన్నురాలవు" కమ్మని ప్రాధేయ పడినారు. దయామయురాలైన ఆమె మఠంలో నుండి రథంవద్దకు వచ్చి శ్రీస్వామి వారికి కర్పూర హారతి ఇచ్చింది. వెంటనే జగన్నాథుని రథచక్రాలు కదలినాయి. వెంగమాంబ కీర్తి కర్పూర పరిమళం వలె వ్యాపించింది!

ఇట్టి మహిమ లెన్నో కనబఱచిన దివ్య శక్తి సంపన్నురాలగు మహనీయురాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. ఇట్లు శ్రీస్వామివారి కృపకు పాత్రురాలై, స్వామి కైంకర్యంలోనే తన బ్రతుకును చరితార్థం చేసికొని ఆ స్వామిలోనే ఆమె లీనమైంది, నేటికీ శ్రీవేంకటేశ్వరుని అనుదిన ఆరాధనలో పవళింపుసేవ వేళలో ఆమె పేరిట 'ముత్యాలహారతి' ఇవ్వబడుతూ వుండడమే ఆమె నిర్మల భక్తికొక నిదర్శనం!

ఈ కవితా తపస్విని శ్రీవేంకటాచల మాహాత్మ్యము, ద్విపద భాగవతము (పన్నెండుస్కంధములు), రాజయోగ సారము, ముక్తికాంతావిలాసము, విష్ణు పారిజాతము, శివవిలాసము, వాసిష్ఠ రామాయణము, శ్రీకృష్ణమంజరి మొదలగు అనేక రచనలను గావించింది. తన కావ్యాలన్నింటినీ నరాంకితం కాకుండ నరహరికి అంకితమొనరించింది! భాగవతము, శివ విలాసము తప్ప తక్కిన వన్నియు ముద్రితాలు. ఈమె రచనల్లో ప్రక్రియా వైవిధ్యమేగాక, శివకేశవాభేదభావనకూడా గమనింప దగ్గది.

అట్టి జగన్మాన్య యొక్క దివ్యచరిత్ర ఎందరోకవులను అలరింప జేసి అనేక రచనల్లో అక్షరాకృతితో సాక్షాత్కరిస్తూ వుంది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు కూడ ఈమెపై రచించిన సిద్ధాంత వ్యాసానికి ఇటీవలే డాక్టరేటు పట్టాన్ని ప్రసాదించారు. దేవస్థానంవారి ఆర్థిక సహాయముతో ఈ గ్రంథము ప్రచురింపబడింది. వివిధ తరగతుల పాఠ్య గ్రంథాల్లోనూ సాక్షాత్కరిస్తూవున్న ఈమె కవితా వైశిష్ట్యాన్ని బట్టి "ముదితల్ నేర్వగ రాని విద్యగలదె ముద్దార నేర్పింపగన్" అను లోకోక్తి ప్రత్యక్షర సత్యంగా సార్థకమౌతున్నది.

ఈమె వలెనే ఇదే నామధేయంకల ఇంకో భక్తురాలు సద్గురు మాణిక్యప్రభువులవారి శిష్యురాలై కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ గుల్బర్గా ప్రాంతములందు ప్రసిద్ధురాలైంది. ఈ విధంగా వెంగమాంబ జీవితం పోతన, మీరాబాయి, బావాజీ, త్యాగయ్య, రామకృష్ణపరమహంస మొదలైన మహనీయుల ధన్యజీవితాలను బోలి పవిత్ర చరిత్రగా భాసిల్లుతున్నది. శ్రీ వేంకటేశ్వర భక్తులకు ఆదర్శమూర్తియై మహిళాలోకంలో మణిపూసయై ఆంధ్ర కవయిత్రీ లోకంలో శిఖరాయమాణంగా ప్రకాశిస్తూవున్న తరిగొండ వెంగమాంబ ప్రాతస్స్మరణీయురాలు. ఆమె రచనలు ఆంధ్రజాతికి ప్రతిదిన పారాయణార్హాలు.

ఎవడం వైష్ణవు డనగ?

తన నైజ ధర్మమ్ము
నెవడు విడనాడడో!
శత్రు మిత్రాదులన్
సమదృష్టి యుతు డెవడో!!
ఒకరి సొత్తు హరింప
ఎవ డుద్యమింపడో!
అన్యహింసాయత్త
చిత్త మెవనికి లేదో!!
ఎవని మానస ముచ్చ
గతి నుద్గమించునో!
అతడె పో వైష్ణవుడు
అతి గౌరవార్హుండు!!
మాత్సర్య రహితుండు
అతి శాంత చిత్తుండు
అకలంక చరితుండు
సకల భూత ప్రియుండు॥
నిష్కపట వర్తనుడు
ప్రియ సత్య హిత వాగ్మి:
అతని హృదయము వాసు
దేవుని నివాసమ్ము॥
భూసార చిహ్నమౌ
సాలవృక్షము పగిది
హృదయగత పరమాత్మ
సూచితోజ్జ్వల మూర్తి॥
యమ నియమ విధి నిషే
ధానుగత శీలుండు:
మద లోభ మాత్సర్య
విదళి విదూరుండు॥
అట్టి వైష్ణవుగాంచి
అతి దూర మేగుడని
యముడు తన భటుల కా
దేశించె తీవ్రముగ॥
ఏవం విధానేక
వైష్ణవ విలక్షణుని
సేవింప చేకూరు
శ్రీ వైష్ణవత్వమ్ము॥

(శ్రీ విష్ణు పురాణ మాధారంగా)

— బొడ్డుపల్లి పురుషోత్తం

యువ వాణి

"శాస్త్రిగారూ! కాపాడాలి! మీరే మా సుగుణని కాపాడాలి! ఒక్కసారి మీరు రావాలి శాస్త్రిగారూ"

శాస్త్రిగారి ముఖంలో అహంభావ పూరిత మైన దరహాస రేఖ విరిసింది. "ఊఁ—" గంభీరమైనశబ్దం వెలువడింది ఆయన స్వరం నుంచి. ప్రెసిడెంటుగారు కళ్ళలో ఆత్రుత, ఆవేదన కనబరస్తూ ఎదురుగా నుంచున్నారు. ఆయనను శాస్త్రిగారు కనీసం కూర్చోమనైనా అనకపోవడం ఆయ నకు ఇబ్బందిగానే తోచింది, కాని అవసరాన్ని బట్టి ఆ బాధని లోపలే అణచుకున్నారు. ఆయన వెనకే వెంకడు చేతులు కట్టుకొని శాస్త్రిగారి కేసి చూస్తున్నాడు ఆదుర్దాగా!

"లక్షణాలేవిటో చెప్పారుగాదు! శాస్త్రిగా రడిగారు, ఏం చెప్ప మంటారు. ఒక్కగా నొక్క ఆడపిల్ల. పెళ్ళీడుకెదిగిన మా సుగుణ గురించి ఆలోచిస్తే నాకడుపు తరుక్షు పోతుంది. వారం రోజులనుంచి పట్టెడన్నం కూడా తినడం లేదు. పచ్చి మంచినీళ్ళు ముట్టుటలేదు. అర్థరాత్రివేళ లేచి ఏడుపులు పిచ్చికేకలు, నన్ను వాళ్ళమ్మని, ఇంట్లో వాళ్ళని కొట్టడం, రక్కడం, సామాన్లు అందిందల్లా విసిరైడం ఏమిటి!? ఒకటి కాదు! నానా హడావిడి చేసేస్తోంది. ఇదేదో గ్రహ సంబంధమేనని మాకు రూఢిగా అని పిస్తోంది. తమరు దయ చెయ్యాలి!"

వస్తాను! కాని—స్వామి పూజ జరిపి రావాలి! ఖర్చుకాస్తఎక్కువ! — ఎంతవు తుందో సెలవివ్వండి!

"ఆ ఎంతోనా! ఐదువందలైతే సరిపెడ తాను!"

"ఊ పంపుతాను మా వెంకడిచేత! మా సుగుణని మాత్రం తిరిగి మామూలు మనిషిని చెయ్యాలి శాస్త్రిగారూ! అదే నే కోరేది!"

"అలాగే త్వరగా లెక్క పంపించండి; పూజ ప్రారంభించాలి! ఆ గ్రహచేష్టలు అర్థరాత్రినుంచి కదూ ప్రారంభమౌతూంట. సరే! అదే వేళకి వస్తాను. తలుపులు తీసి వుంచండి."

"అలాగే! మరి సెలవిప్పించండి! లెక్క వెంటనే పంపిస్తాను. నమస్తే! ప్రెసిడెంట్ గారు వెళ్ళిపోయారు! వెంకడు వెనుకనే అనుసరించాడు. శాస్త్రిగారు లోనికి వెళ్ళారు. అంతా విన్న శాస్త్రిగారి భార్య పద్మకి యిదంతా ఏవగింపుగా వుంది. ఆమె ఆలోచనలు వేరు! నిజానికి శాస్త్రికి వచ్చిన లోటేమి లేదు. ఆయన ప్రభుత్వోద్యోగి. ఇద్దరే పిల్లలు! ముచ్చటైన సంసారం! కాని శాస్త్రిగారికి తృప్తి అనేది కనబడదు. పద్మకదే బాధ! ఆంజనేయస్వామిని ఉపాసిస్తారు శాస్త్రిగారు. దక్షిణ పుచ్చుకుంటే ఆ భక్తికి సత్ఫలితం వుండదంటుంది పద్మ! అవేమీలెక్కపెట్టక ధనార్జనేముఖ్యమంటారు శాస్త్రిగారు. నిజంగా ఆంజనేయస్వామినే సర్వస్వంగా నమ్ముకొంటే ఈ తాపత్రయం దేనికి? తృప్తి అనేది ఉంటే చాలదా? కోరికలు కొల్లలుగా వుంటే వాటిని అదుపులో


ఉపదేశం

పెట్టలేని భక్తి దేనికి? నిజమైన భక్తుడు ఆడంబరాలకు, కోరికలకు దాసుడుకాగలడా? ఇవన్నీ పద్మ మస్తిష్కాన్ని మథించే ఆలోచనలు! వాటికి పరిష్కారం ఎప్పుడు దేవా అని ఆ స్వామి మందిరం ముందు నిలబడి ప్రార్థించింది పద్మ; సమయం రావాలి తల్లీ! అన్నట్లున్నాయి పటంలోని భక్తాంజనేయుని చూపులు!

శాస్త్రిగారు బయల్దేరారు బయటికి! ఆయన అడుగులు ముందుకి, ఆలోచనలు వెనక్కి నడుస్తున్నాయి. ఈనాడు ఈ గ్రామంలో తన మాట వేదం! ఆంజనేయుడు భక్తుడుగా, ఉపాసకుడుగా తన పేరు దశదిశలా వరిఢవిల్లుతోంది. ఇదంతా తన గురువు చలవ! తన ఇరవయ్యో ఏట తనకు ఆంజనేయ ఉపదేశం చేశారాయన! "భక్తికి నీతినీ,



న్యాయాన్నీ, ధర్మాన్నీ జోడించి నీ జీవితం పదిమందికీ ఉపయోగపడేలా జీవించు నాయనా! అన్నారు ఆరోజు! అదే తనకు ఎప్పట్టుగా తోచింది. ధన సంపాదన భక్తి పేరుతో చేస్తే పాపం అనే వారు మూర్ఖులనీ శాస్త్రిగారి ఉద్దేశం! మళ్ళీ ఆ గురువుగారి దర్శనం కోసం ప్రయత్నించ లేదు శాస్త్రిగారు. ఆయనే అప్పుడప్పుడు తన శిష్యుని చూడడానికి వచ్చి పోతుంటారు. ధర్మోపదేశం చెయ్యడం, శాస్త్రిగారు "ఊ" అనడం మామూలే! ఇన్ని తెలిసిన తన గురువు గారికి "ధనమూల మిదం జగత్" అని తెలియక పోవడం ఆశ్చర్యమే! ఆలోచిస్తూనే శాస్త్రిగారు ప్రెసిడెంటుగారిల్లు చేరుకున్నారు. సాదరంగా వినయంతో ఆహ్వానించారు ప్రెసిడెంటుగారు, అక్కడున్న పెద్దలు "ఆమె ఎక్కడ?" గంభీరంగా అడిగారు శాస్త్రి! ఆ గది చూపించారు ప్రెసిడెంటుగారు. ఘోషా పాటించే ఆడవాళ్ళు చాటునుంచి ఆత్రంగా చూస్తూ, చేతులు జోడించారు శాస్త్రిగారి నుద్దేశించి. శాస్త్రిగారు గదిలోకిచేరి తలుపులు మూసారు. సుగుణ జుట్టు విరబోసుకుంది. ఆశ్చర్యం! వారం నుంచీ ఆహారం తీసుకోకున్న ఆమె ఏ మాత్రం నీరస పడలేదు! నిగారింపుతో ఆమె పాతికేళ్ళ పరువం క్షణం పాటు శాస్త్రిగారి చూపుల్ని నిలేసింది! "ఏమే దుష్ట గ్రహ పిశాచీ! నేనెవరను కున్నావ్! నా ఎదుట నిలబడే ధైర్యమే నీకు? ఫో! తక్షణం పో!" అరిచారు శాస్త్రి! సుగుణ ప్రవర్తన మితి మీరింది. పిచ్చి గంతులు వేస్తోంది.! జాకెట్ చింపేసుకుంది. ఒళ్ళు విరుచుకుంటూ ముందుకీ వెనక్కి ఊగుతోంది. శాస్త్రి కళ్ళు ఒక్కసారి ఆమె అనాచ్ఛాదితపీన వక్షస్థలంమీదనిలచిపోయాయి. పాలపొంగుల వక్షోకుంభాలు ఆయన నాలుకను స్తంభింపచేశాయి. మంత్రం మరిచారు మత్తులో పడ్డ శాస్త్రిగారు! అదే అదనులో సుగుణ ఆయనకు దగ్గరగా వచ్చింది. మతిపోయిన శాస్త్రిగారు ఆమెను దగ్గరగా తీసుకోవాలని ప్రయత్నించారు! అంతే సుగుణ రెండు చేతులూ శాస్త్రిగారి శరీరం



మీద స్వైర విహారం చేశాయి. ఆ బలిష్ఠమైన శరీరం సుగుణముందు మత్తులో ఎదురు తిరగలేక పోయింది. దెబ్బమీద దెబ్బగా శాస్త్రిగారి శరీరం అలసిపోయింది. మంచానికి గోడకు మధ్యగా ఆయన శరీరం వాలిపోయింది! వికటాట్టహాసం చేసుకుంటూ సుగుణ తలుపులు తెరచుకొని బయటికి వచ్చింది. బయటి వారు లోపలి కెళ్ళి ఆ దృశ్యాన్ని చూసి స్తంభించి పోయారు. ప్రెసిడెంటు గారికి మతిపోయినంత పనయింది!

"బాబూ! ప్రసాదూ! ఈ వార్త విన్నావా! శాస్త్రిగారుకూడా సుగుణకి పట్టిన గ్రహాన్ని వదిలించలేక పోయారట!"

"అమ్మా! నన్ను ప్రయత్నించమంటావామ్మా!"

"అంత పెద్ద నిష్ఠావరుడు! ఆయన వల్లే కాలేదు. మనవల్లేమౌతుందిరా!"

"అమ్మా! ఏమిటమ్మా నీ పిచ్చి! భక్తి అనేది మనస్సుని బట్టి వుంటుంది! అచంచలమైన భక్తి నమ్మకానికి నాందిపలుకుతుంది. కోరికలకు దూరంగా, భక్తికి విశ్వాసానికి దగ్గరగా వుంటే భగవంతునికి దగ్గరగా వున్నట్లే! ఒక మేలును ప్రతిఫలాపేక్ష రహితంగా కోరాలి! అప్పుడే దైవం సహకరిస్తాడు. మనకున్నదానితో తృప్తి పడక దైవం పేరు చెప్పుకుని ధనార్జన చెయ్యాలనుకుంటే అది భక్తి అనిపించుకుంటుందా!" సుభద్రమ్మ తనకొడుక్కేసి హర్షదాయకంగా చూసింది. ఎంత ఎదిగిపోయాడు తనబిడ్డ!

బాధ్యత లేని భర్తకు తాను భార్య అనిపించుకుంది పాతికేళ్ళనాడు! బిడ్డ పుట్టిన ఐదో సంవత్సరం అతను తామిద్దరినీ వదలి దేశాలు పట్టి పోయాడు. కష్టాలకోర్చి బిడ్డను పెంచుకుంటూ వచ్చింది సుభద్రమ్మ. అన్నిటికీ ఆంజనేయస్వామినే నమ్ముకుంటూ కాలం గడిపింది. పిల్లవాడికి ఆంజనేయ వరప్రసాదని తానే పేరు పెట్టుకుంది. చిన్నతనం నుంచీ ఆంజనేయనామాలు, చాలీసా నేర్పింది. భక్తి కలిగించింది. నీతి, న్యాయం ధర్మం, ఈ భక్తికి తోడుగా ఎప్పుడూ జీవితంలో నిలబెట్టుకోవాలని నేర్పింది. ఈ రోజు ఆ స్వామే తల్లీకొడుకుల సర్వస్వం! ఆయన దయవల్ల ప్రభుత్వోద్యోగం కూడా వచ్చింది ప్రసాదుకి! లేదన్నవారికి తమకు తోచినంతలో సహాయం చెయ్యడం వారికితృప్తి.

ప్రయిత్నించు బాబూ! నువ్వు గెలిస్తే ఆంజనేయ స్వామి భక్తిని గురించి ప్రచారం చేసిన వాడవౌతావు. కామ క్రోధాలను జయించిన వారికి స్వామి సులభ సాధ్యుడు బాబూ!"

"నన్ను దీవించమ్మా!"

"ఆంజనేయ కటాక్ష ప్రాప్తిరస్తు!" మండలదీక్ష పూర్తి గావించిన తాలూకు సిందూరాన్ని పొట్లం గట్టి తీసు కెళ్ళాడు ప్రసాదు.

"బాబూ! నువ్వు మనిషివి కాదు బాబూ సాక్షాత్తూ ఆ ఆంజనేయస్వామివే బాబూ! నా బిడ్డను నాకు దక్కించావు!" ప్రసాద్ చేతులు పట్టుకుంటూ ఆనందబాష్పాలతో అన్నారు ప్రెసిడెంటు గారు!

"నాదేముంది ప్రెసిడెంటు గారూ! అంతా ఆ స్వామి దయ!"

"చెప్పు బాబూ! ఎంత డబ్బు కావాలి! పూజకి ఎంతయింది!"

"ఎంత అమాయకులండీ మీరు! డబ్బు పుచ్చుకోవడం భక్తికి, నమ్మకానికితగదండీ! అదీగాక డబ్బుతో భక్తిని ఖర్చు పెట్టే ఉద్దేశం నాకు లేదు. ఏ ఆధారం లేనవ్వుడైతే చాలినంత తీసుకున్నా తప్పులేదేమో! కాని నేను ఉద్యోగం చేస్తున్న వాడినే! నా రెక్కల కష్టం నాకు చాలు! నా ఆంజనేయ పూజని, పదిమంది ఉపయోగం కోసం నిస్వార్థంగా వినియోగించాలన్నదే నా ఉద్దేశ్యం! వస్తానండి! నమస్కారం!" అంటూ ముందుకి నడిచాడు ప్రసాద్! శాస్త్రి భక్తి ఎలాంటిదో, అతను ఎందుకు నెగ్గలేక పోయాడో ప్రసాదు దారిలో నడుస్తూ ఆలోచించాడు. సుగుణ నగ్న వక్షస్థలాన్ని చూసిన శాస్త్రి కోరికతో బుసకొట్టి వుంటాడు. అందుకే స్వామి ఆగ్రహించాడు. శాస్త్రి పరాజయం పొందాడు. కాని తనకు మాత్రం ఆ వక్షస్థలాన్ని చూసినపుడు తన తల్లి వక్షస్థలమే కనులముందు గోచరించింది. ఏ తల్లి ప్రేమ క్షీరాన్ని గ్రోలి తానంతటి వాడయాడో ఆ తల్లి వక్షమే సుగుణనగ్న హృదయంలో తనకు సాక్షాత్కరించింది. మాతృభావంతో ఆమెను స్పర్శించి కూర్చోబెట్టి, బెదరని భక్తి విశ్వాసాలతో, స్వార్థ రహిత హృదయంతో, ఆంజనేయ నామాలను, కవచాన్ని, చాలీసాను, రాత్రంతా పద్మాసనంమీదే వుండి, పదే పదే పఠించాడు. గ్రహ పీడ వదిలించాడు. స్వామి అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. కటాక్షం లభించింది. స్త్రీ మూర్తి మీద గౌరవం, స్త్రీ శక్తి మీద నమ్మకం తనకున్నాయి. తన ఆదిగురువు తన తల్లి, ఆమెమాట తనకు వేదం! ఆంజనేయుని కన్న తల్లి అంజన! ఆమె వాక్కు అతనికి శిరోధార్యమై, చిరంజీవిగా, శ్రీరామ దాసునిగా నిలబెట్టింది. ఆలోచిస్తూ ఇంటికి చేరాడు.

"శాస్త్రీ!," శాస్త్రి కళ్ళు తెరిచాడు. ఒళ్ళు నొప్పులు తగ్గలేదు. నాలుగు రోజుల్నుంచి లేవటంలేదు. పద్మ నిద్రాహారాలు మాని అతని సేవలోనే గడుపుతోంది. గురువు గారు వచ్చారు. విషయం గ్రహించి బాధపడ్డారు. గంభీర కంఠంతో జీవనోపదేశం చేశారు! "శాస్త్రీ! ఇప్పటికైనా నీవిధానం మార్చుకో నాయనా! భక్తి, విశ్వాసం ఉచ్ఛ్వాసనిశ్వాసాల వంటివి. ఒకటి లేకుంటే మరొకటి నిలవదు. నీకు లోటులేని సందర్భములో కూడా ఒకరి ధనాన్ని ఆశించడం పాపం! దైవంపేరు చెప్పి నీవు వ్యాపారం నిర్వర్తించావంటే ఎంతగా దిగజారిపోయావో అర్థమైంది. కామ క్రోధాలను జయించిన వాడే భక్తిమార్గాన నిలువ గలడు. సుగుణ నగ్న వక్షాన్ని చూసే నీవుచలించి పోయావే! ఆనాడు లంకలో సీతాన్వేషణార్థం అంతఃపురాన్ని పరిశీలిస్తున్న ఆంజనేయుడు విశృంఖలంగా, నగ్నాతినగ్నంగా, నిద్రిస్తున్న స్త్రీల నెందరినో చూశాడు గదా! ఆయన అణుమాత్రమైనా చలించాడా! తన కార్యదీక్షకు భంగం కలిగించు కున్నాడా! మనం తలపెట్టిన పనిని పక్కకి నెట్టి కామానికి దాసులు కావటం నైచ్యం కాదా! అస్ఖలిత బ్రహ్మచారి, కార్య దీక్షా తత్పరుడు అయిన ఆంజనేయుని భక్తుడి నంటూ నీవు చేసే పని ఎంత అసహ్యకరమైనదో ఆలోచించావా! లేదు! ఆలోచిస్తే ఈ దశకి దిగజారే వాడివే కాదు. స్త్రీ పట్ల పవిత్ర భక్తి భావన, స్త్రీ శక్తిపట్ల ఆరాధన ముఖ్యం నాయనా! ఇంట్లో నిన్నే దైవంగా భావించి పూజించే నీ భార్యను ఏనాడైనా అర్థం చేసుకున్నావా! ఆమెను అనురాగంతో చూశావా! స్వామిని పూజించడమంటే అట్టహాసంతోనూ, ఆడంబరంతోనూ కాదు నాయనా! మన ప్రార్థన, పూజ, మన వారిని పై వారిని కూడా రక్షించ గలగాలి. మన ప్రవర్తన పదిమందికి ఆదర్శవంతము కాగలగాలి! అప్పుడే స్వామి అనుగ్రహం నీకు లభిస్తుంది! అహంకారం, అహంభావం స్వామి భక్తులకు పనికి రావు! నిర్మల భక్తి అచంచలవిశ్వాసం వాంఛనీయం నాయనా!" గురువుగారు శాస్త్రి జుట్టు నిముర్తూ అన్నారు. శాస్త్రి కళ్ళలో నీటితో గురువుగారిని చూస్తూ చేతులు జోడించాడు పశ్చాత్తాపంతో! *

— శ్రీ ద్వివేది ఉమామహేశ్వరరావు

శ్రీ శ్రద్ధానంద ఆశ్రమం, రాజపూర్

1983 అక్టోబరు 2 వ తేది నుండి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ జిల్లా రాజపూర్‌లోని శ్రీ శ్రద్ధానంద ఆశ్రమమును తిరుమల తిరుపతి దేవస్థానం విరాళంగా స్వీకరించడం జరిగింది. దీనికి దేవస్థాన కార్యనిర్వాహకమండలి తీర్మానం 433 తేదీ 31-10-83 ప్రకారం ఆమోదం తెలియజేయడం జరిగింది. పై ఆశ్రమంలో తి. తి. దేవస్థాన కార్యక్రమాలు ప్రచారం చెయ్యడం జరుగుతుంది.

కార్యనిర్వహణాధికారి.
తి. తి. దేవస్థానములు, తిరుపతి.

అతివినయం

"ముఖం పద్మదళాకారం;
వచశ్చందన శీతలం;
హృత్కర్తరీ సమం భాతి
వినయం ధూర్తలక్షణమ్॥"

"విద్య యొసగును వినయంబు"- అనేది సుప్రసిద్ధమైన సుభాషితం.

వినయమే విశ్వసంస్కృతికి విషయ సూచిక. ప్రాచీన గ్రీకుదేశంలో జంగమ విజ్ఞాన సర్వస్వంగా కీర్తికెక్కిన సోక్రటీసు ప్రవచనం.

(I know I know not)

"నాకు తెలియదు అని నాకు తెలుసు"-

భర్తృహరి మహాకవి, విద్యతోపాటు వినయం ఏ విధంగా విస్తరిస్తుందో మనోహరంగా వివరించాడు.

"తెలివి యొకింత లేనియెడ
దృప్తుడనై కరిభంగి సర్వమున్
తెలిసితినంచు గర్వితమతిన్
విహరించితి తొల్లి; ఇప్పుడు-
జ్జ్వల మతులైన పండితుల సన్నిధి
ఇంచుక బోధశాలినై
తెలియనివాడనై మెలగితిన్
గతమయ్యె నితాంత గర్వమున్."

తిక్కనమహాకవి, తొలుత నిర్వచనోత్తర రామాయణం వ్రాసినప్పుడు-తనను గూర్చి, "అమలోదాత్తమనీష, ఏ నుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పము నన్ పారగుడన్....కళావిదుడ .... తిక్కాఖ్యుండ సన్మాన్యుడన్" అని గర్వస్ఫూర్తితో చాటుకున్నాడు. అయితే - యజ్ఞంచేసి సోమయాజియై మహాభారతం ఆంధ్రీకరించినప్పుడు మాత్రం - వినయంతో,

"నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్" అని సహృదయులకు నివేదన చేశాడు. తిక్కన మహాకవి వ్యక్తిత్వంలో, ఉన్నత విద్య తెచ్చిన వినయం పేర్కొనదగింది.

ఖగోళ విజ్ఞానంలో విప్లవాత్మకమైన పరిశోధనలు ప్రపంచానికి అందించిన న్యూటను మనీషి, సవినయంగా చెప్పినమాట-"నేను విజ్ఞాన సముద్రతీరంలో గులకరాళ్లను ఏరుకొనే అర్భకుడను మాత్రమే."

అయితే - కొందరు కుహనా వినయం అభినయిస్తారు. అట్టివారిని గూర్చియే పై సంస్కృత శ్లోకం నిశితదృష్టితో విమర్శ చేస్తోంది. "వినయం అభినయించే వారి ముఖం వికసించిన పద్మదళాలవలె ఉంటుంది! వారి మాటలా తేనెవాకలు. అట్టివారు చల్లగా తియ్యగా మాటాడగలరు. వారి మాటలు చందన సౌరభం-సువాసనలు చిమ్ముతాయి. అయితే వారి గుండె మాత్రం పదనైన కత్తెరవంటిది.

వెలుగుబాట

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

"అతివినయం ధూర్తుల లక్షణం"- అని పై శ్లోక తాత్పర్యం.

వినయం అభినయించేవాడు "తేనెపూసిన కత్తి" - "గోముఖవ్యాఘ్రం."

వినయం వేరు! అతివినయం వేరు!

ఇక ఏది వినయం? ఏది అతివినయం? స్థూల దృష్టితో ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం కష్టం.

శ్రీ వైష్ణవ విశిష్టాద్వైతులు వినయాన్ని ఒక "లలితకళ" గా అభ్యసించారు. భగవద్రామానుజాచార్యులు, "వినయాన్ని" ప్రబోధించారు. వినయం వ్యష్టి నిష్ఠం. అయితే - ఆ వినయాన్ని వ్యవస్థానిష్ఠంచేసినప్పుడు - చిత్తశుద్ధి స్థానాన్ని అభినయాడంబరాలు ఆక్రమించే ప్రమాదం ఉంది. శ్రీ వైష్ణవుడు దాసానుదాస ప్రవృత్తిని అవలంబించుకోవాలని శ్రీమద్రామానుజాచార్యులవారి ఆదేశం. వేదవేదాంగ పారంగతుడైన శిష్యుని, రామానుజాచార్యులవారు-మరియొక శిష్యుని కూతురి అత్తవారింటిలో వంటవానిగ సేవచేయుటకు వినియోగించారు. ఆ పండితోత్తముడు అహంభావం చంపుకొని - వినయంతో గరిటె కైంకర్యం చేసి తరించాడు! అట్టి వినయానుసంధానం విధించిన వారు రామానుజులు. యథార్థమైన శ్రీ వైష్ణవ వినయానుసంధానం తమ జీవితాలలో అనువదించిన మహానుభావులు - విశిష్టాద్వైత వేదాంతులు వేనకువేలు యుగయుగాంతరాలుగా దక్షిణాపథంలో వర్ధిల్లారు.


ఇక - ఈ చర్చకు ముగింపుగా చెప్పదగినమాట "వినయం" మంచిది. "అతివినయం" చెడ్డది. అయితే - వినయాన్ని అసమర్థతగా కొందరు భావించే ప్రమాదం ఉంది. అంతేగాక, ఏ మనిషి వ్యక్తిత్వంలో అయినా, వినయంతోపాటుఆత్మప్రత్యయం కూడ మెచ్చుకోదగిన గుణమే.

కాళిదాస మహాకవి-"మందుడు కవియశస్సును కాంక్షించటం ఆజానుబాహువునకు అందే చెట్టుపండును వామనుడు (మరుగుజ్జు) కోరుకున్నట్లు అపహాస్యం పాలవుతాడు. ఆ విధంగా ఉన్నది నా కావ్యరచన" అని వినయంగా విన్నవించాడు. అయితే ఆ వినయంలోనే కాళిదాస మహాకవి ఆత్మప్రత్యయం అంతర్లీనంగా ఇమిడి ఉంది. తాను ప్రస్తుతం మరుగుజ్జు కవిగా కన్పించుచున్నప్పటికీ, కాలక్రమంలో వామనునివలె త్రివిక్రమావతారం ధరించగలననే ధ్వని అందులో ఉంది.

నిజమైన వినయం ఆత్మప్రత్యయం ధరించే సూక్ష్మరూపమే.

శ్రీవేంకటేశోదాహరణము

– శింగనమల్ల రాధాకృష్ణయ్య



(గతసంచిక తరువాయి)

(ఉత్కళిక)

భృగుమహర్షి గర్వమడచి భృతినొసంగువానిచేత
నిగమసంఘమెల్లఁగొల్చు నిర్వికారగుణముచేత
సిరినివీడి పురినివీడి సిరినిపొందు ఘనునిచేత
ధరను వేంకటాద్రిపైన దయను కురియువానిచేత
పవన సుతుని పూజలందు భక్తకల్ప తరువుచేత
సవన మంత్ర రూపియైన సరసిజాక్షు కరుణచేత
శ్రుతుల మంత్ర బీజమైన శ్రితజనార్తి హరునిచేత
వెతలు దూరమౌనుగాత! విష్ణుచేత జిష్ణుచేత

చతుర్థీ విభక్తి (తరళము)

పలువిధంబుల పూజలందు పరాత్పరుం డగువానికై
జలధి క్రుంగిన భూమినెత్తి జగంబు నిల్పినవానికై
బలినిఁ ద్రుంచఁగ దానమెత్తి బలంబుఁ జూపిన వానికై
తలపు లెల్లను నిల్పి కొల్తు తమోఘ్నుఁడౌ పరమాత్మకై

(ఉత్సాహ)

రాగ రహిత భోగ సహిత రాజమౌళి సఖునికై
నాగరాజ నుత పదాబ్జ జ్ఞానరూప మూర్తికై
యోగమార్గ ఘనవిచార యోగి బృంద వంద్యుకై
యాగవహ్ని కీలరూప యాగ రక్షణార్తికై

కళిక (ద్విరదగతిరగడ)

అరి వర్గములఁజెండు ఆనందరాముకై
గురువుగా బోధించు గోపాల బాలుకై
కరమిచ్చి కాపాడు కమలాధినాథుకై
వరమిచ్చి పరమిచ్చు వరదవేంకన్నకై
కరుణలొల్కెడు సుధాకాంతి వీక్షణునకై
కరువైన వైకుంఠ కమనీయ సుఖముకై
సురలోక ధనమైన సురనాథు తమ్ముకై
స్థిరముగా మదిఁగొల్తు తిరువేంకటేశుకై

(ఉత్కళిక)

సప్తాద్రి కేతెంచి
తృప్తిగా పూజించి
ఆనందమున మంచి
గానంబుఁ గావించి
నిలువెల్లఁ నర్పించి
జలజాక్షుఁ నాశించి
కొలిచేను ఈశుకై
ఇల వేంకటేశుకై

పంచమీ విభక్తి (ఉత్పలమాల)

ఎవ్వనివల్లఁ నీ జగము లింతలు పెంపును పొందుచున్నవో
ఎవ్వనివల్ల మేఘములు ఎంతయు నీటిని పొందుచున్నవో
ఎవ్వనివల్ల జీవతతికెల్ల శుభంబులు కల్గుచున్నవో
చివ్వనఁజేరుఁనా ఘనుఁడు శ్రీపతి వల్లనె సర్వసంపదల్

(కందము)

ధర్మము జ్ఞానము దయయును
నిర్మల తేజంబుఁ గల్గు నిత్యుని వలనన్
కర్మము లెల్లను తీరును
మర్మపు మోక్షంబుఁ నబ్బు మాధవు వల్లన్

కళిక (తురగవల్గనము)

నమ్మకొన్న వారికెల్ల జ్ఞానమిచ్చు వానివలన
అమ్మకన్న మిన్నగాను ఆదరించు వానివలన

తమ్మిచూలి చేయుపనికిఁ దలప మూలభూతువలన
సమ్మతిని సుషుమ్నయందు సంచరించువానివలన
భక్తితోడఁ గొల్చినట్టి వకుళ నోము ఫలము వలన
రక్తితోడఁ గొల్చినట్టి రమకుఁ గూర్చువాని వలన
ముక్తసంగ వందనీయ మోహనంపు రూపు వలన
ముక్తులౌదురెల్ల జనులు మోక్షదాత ప్రీతి వలన

(ఉత్కళిక)

అన్నమయ్య పాడినట్టి
మిన్నుఁ గాలఁ దన్నినట్టి
బలిని నేల ముంచినట్టి
కలిని జనులఁ బ్రోచునట్టి
దురితహరుని కరుణ వలన
ఖరునివైరి శరణు వలన
ధరణిజాధినాథు వలన
పరము కల్గు శ్రీశు వలన

షష్ఠీవిభక్తి (ఉత్పలమాల)

శ్రీసతి ప్రేమతోఁ గొలుచు శ్రీగిరినాథుని దివ్యమూర్తికిన్
చేసిన పాపసంఘముల చీఁకటిఁ ద్రుంచెడు చక్రధారికిన్
వేసములై దురెండులుగ వేసిన వానికి భక్తరక్షకున్
దాసుఁడ దాసదాసుఁడను దానవ భంజను శ్రీపదాంఘ్రికిన్.

(మత్తకోకిల)

శ్రీరమా భువి నీళసేవిత శ్రీగిరీంద్ర విహారికిన్
శౌరికిన్ సకలౌఘ నాశన శాలికిన్ శ్రితపాలకున్
సూరివంశ సుధాంశుకున్ సుర శోకనాశనకారకున్
కోరుకోర్కెలఁదీర్చ మ్రొక్కెద కోటిమన్మథ రూపకున్

కళిక (తురగవల్గనము)

పాలకడలిఁ నిల్లు చేసి పవ్వళించి యున్నహరికి
పాలనివ్వ వనితచేర ప్రాణములను గొన్నహరికి
వెన్నతిన్న నోటిలోన విశ్వరూపుఁ గల్గు హరికి
చిన్ననాటఁ నాలఁబ్రోవ చెలఁగి కొండనెత్తు హరికి
ఘోరసర్ప బాధఁ బాప కోరి యమునఁ జొచ్చుహరికి
చేరి పాము గర్వమడఁచి చెలుల మెప్పులందు హరికి
గొల్లభామప్రేమఁ జూప చల్లకుండ దోచుహరికి
అల్లయమున నీటమునిఁగి నల్లదనము నిచ్చుహరికి

(ఉత్కళిక)

ముజ్జగంబు నిండు నీకు
ఒజ్జయైన బాల నీకు
భక్తిచేతఁ జిక్కు నీకు
ముక్తినిచ్చు హరికి నీకు
జీవకోటియానమునకు
నావయైన దైవమునకు
వందిభక్త వినుత నీకు
వందనములు కృష్ణ నీకు

సప్తమీవిభక్తి (ఉపేంద్రవజ్ర)

ధరాతలంబందుఁ సధర్మ శక్తిన్
బిరానఁద్రుంచే రఘువీరస్వామీ!
నిరామయంబైన వినిర్మలాత్మా!
మురారి నీయందు సుమోహ భక్తిన్

(చంపకమాల)

కలిగిన వాఁడనయ్యు తొలి కర్మల చక్రము నందుఁజిక్కినే
ఖలమతినై తినయ్యొ! హరిఁ గాదనివేడను వేరుదైవమున్
తలఁచెదఁనెల్ల లోకములఁ దాల్చిన వేంకటనాథునందు నా
వలపుల భక్తి నిల్పెదను వైష్ణవ భక్తుల మార్గ గామినై

కళిక (ద్విరదగతి రగడ)

కరుణతో వెలుఁగొందు కమల కాంతుని యందు
ధరలోని శేషాద్రి ధాముఁడౌ విభునందు
నిరవధిక సుఖుఁడైన నిత్యోత్సవుని యందు
దురితములఁ నెడఁబాపు దొర శ్రీధరుని యందు
మది నిల్పి కొలుతు నే మధుసూదనుని యందు
ఎద పొంగు భక్తితో వేంకటేశ్వరునందు
భావంపు కవితచే భావించి నే పొందు
కావించఁ నాశించి కామింతు పతియందు

(ఉత్కళిక)

మునివెంట తనుకదలి
ఘన బాణముల వదలి
పెనురక్కసులఁద్రుంచి
ముని యజ్ఞమును పెంచి
చని యహల్యను బ్రోచి
మన జానకినిఁ జూచి
వలచు రామునియందు
వలపు నాకనియందు

సంబోధన ప్రథమావిభక్తి (ఉత్పలమాల)

నీరద నీలవర్ణ! ఇల నేరక చేసిన పాపసంఘముల్
దూరము లౌటఁ జూతురొకొ ధూర్తుల స్నేహము వీడకుండగన్

తిరుగ నిదు భక్తులను తేకువఁ గొల్వక యుండు వారలన్
నారద గానలోల ! ఎటు నాకసుఖంబు వరించు శ్రీహరీ !

(ఉత్పలమాల)

ఓ రఘువీర ! రార ! యని ఓర్వని బాధలఁ నేను పిల్చినన్
జీరవు ప్రేమతోడ నిను జీవితనాథుగ నమ్ముకొన్ననన్
చేరవదేమి కర్మమొకొ ? శేషగిరీశ్వర ! వేంకటేశ్వరా !
భీరుఁడనైతినింక మది భీతిలి సోలితి రార ! శ్రీధరా !

కళిక (ద్విరదగతిరగడ)

ఓ దీనమందార ! ఓ సుందరాకార !
ఓ దయామృతసార ! ఓ భక్తసంచార !
ఓ ధీర ! రణవీర ! ఓంకారసాకార !
శ్రీధామశృంగార ! శ్రీ రాధికాచోర !
ఓ సప్తగిరినాథ ! ఓ భూమిజానాథ !
ఓ సర్వభూతాత్మ ! ఓ భూతభావాత్మ !
నీవే జగద్రక్ష ! నీవే ప్రభూరక్ష !
ఓ వేంకటాద్రీశ ! ఓ రమా హృదయేశ !

(ఉత్కళిక)

వెలుగు నీవేయంటి
తలచి నిన్నేకంటి
బ్రతుకు నీవేయంటి
వెతలు బాపెదవంటి
నమ్మ్రోవ రావేల
కనలేను నీ లీల
నీవాడనేగాన
శ్రీ వేంకటరమణా !

(సార్వవిభక్తికము)

రాముడ నీవె కృష్ణయని ప్రార్థనఁజేసెద నిన్ను నమ్మి శ్రీ
ధాముని చేతనే కలుగు ధారుణి సంపదలంచు శ్రీలకై
నీమము కల్గఁగొల్చెదను నీవలనం పరమంద నీకునై
నామది యందు పీరమిడి నాడను వీడను వేంకటేశ్వరా !

అంకితాంకము (ఉత్పలమాల)

వేంకటశైలవాస ! నిను వేరుగఁ దల్చక నాదు భర్తగా
ఇంకను నమ్మిప్రాణసఖ ! ఎంతయు మేటి మగండవంచు నీ
కంకిత మీయుదాహరణ హారముఁజేసితి దీనిఁదాల్చి నా
వంకనుఁజేరి కౌగిలిడి వాంఛిత మొప్పగఁ దీర్చు శ్రీహరీ !

శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయం, శ్రీనివాసమంగాపురం.

శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయంలో జరుగు నిత్య కల్యాణోత్సవం. అభిషేకం, నిత్యఅర్చన వివరాలను యాత్రికుల సౌకర్యార్థం ప్రచురిస్తున్నాము.

నిత్యకల్యాణోత్సవం :


నిత్యకల్యాణోత్సవసేవ ప్రతిరోజూ ఉదయం 10-30 నుంచి 12-00 గంటలవరకూ జరుగుతుంది. ఈ సేవకు 150 రూ॥లు చెల్లించాలి. పదిమంది వ్యక్తులను ఈ సేవలో పాల్గొంటానికి అనుమతిస్తారు. గృహస్థుకు వస్త్రబహుమానం వుంటుంది

అభిషేకం

ప్రతి శుక్రవారం అభిషేకసేవ జరుగుతుంది. (ఉదయం 7-30 నుంచి 9 గంటలవరకు) అభిషేకం చేయించే వారు 100 రూ॥లు చెల్లించాలి. ఇద్దరు వ్యక్తుల్ని ఈ సేవలో పాల్గొనటానికి అనుమతిస్తారు.

నిత్యఅర్చన :


నిత్యఅర్చనసేవ సంవత్సర కాలమూ ప్రతిరోజూ వుంటుంది. ఈ సేవ చేయించదలచినవారు 42రూ॥లు చెల్లించాలి.




కల కనటం ఒక అవకాశం. అది నిజంకావటం ఒక అదృష్టం. ఎన్నో సంస్థలు ఎంతో ఉదాత్తమైన ఆశయాలతో ప్రారంభమౌతాయి. కొంతవరకు ఆ ఆదర్శాల పరిధిలోనే పయనిస్తాయి. కాని నిర్విరామంగా నిరంతరం దూరమౌతూ ఉండే లక్ష్యంపైపు పయనిస్తూ తరతరాల వారికి ఆ సంప్రదాయాన్ని అందిస్తూ, ఒకస్థాయిలో సింహావలోకనంచేస్తే, ఇన్ని మంచి పనులకు అంకితం కాగలిగామన్న తృప్తి కలిగే అదృష్టంమాత్రం ఏకొద్ది సంస్థలకో దక్కుతుంది. శ్రీ వేంకటాచలాధీశ్వరుని ఆలయవ్యవహారాలు, ఆస్తిపాస్తులు చూచే పరిపాలన వ్యవస్థ ఆ కొన్నిటి కోవలోకే వస్తుంది.

అనాదిగా రాజాధిరాజ ప్రాభవార్చితమై, నిరంతరవేద గానసుధాసంప్లావితమై, కవి గాయక సరసపదబంధురగీతికా సుమహారవాసనాపరిమళితమైన శేషగిరీశ సంస్థాన నిర్వహణ, దేశీయ,వైదేశిక పాలన నుండి, బాలాజీ భక్తులు మహంతుల నుండి, ఒక ప్రత్యేకపాలనావ్యవస్థకు మారి, ఆ వ్యవస్థ అర్ధశతాబ్దంపాటు అవిచ్ఛిన్నంగా శ్రీనివాస భక్తులకు యథాశక్తి సేవచేసి, స్వర్ణోత్సవాలు జరుపుకున్నదంటే, భక్తులకు వ్యవస్థపట్ల ఉన్న అచంచల ప్రగాఢవిశ్వాసము, ఇన్నేళ్ళుగా ఎన్నోవిధాల, యథాశక్తి, యథాభక్తి జనసేవ, జనార్దనసేవలో పాలుపంచుకొన్న ఉద్యోగుల అకుంఠిత కార్యదీక్ష, అన్నిటికిమించి శ్రీనివాసునికరుణాకటాక్షాలకు నిదర్శనమనే అనాలి. అందువల్లనే దేవస్థానవ్యవస్థ జరుపుకున్న స్వర్ణోత్సవాలు, కేవలం సంస్థకుమాత్రమే పరిమితం కాక, అఖిల ఆర్షధర్మావలంబకులకు, అశేష శ్రీనివాస భక్తకోటికి సంబంధించిన ఉత్సవాలుగా కనిపించాయి. ఈ స్వర్ణోత్సవాలతో వ్యవస్థప్రగతి భావిబంగారుబాటపైపు మలుపు తిరిగినట్లనిపించింది. ఈఉత్సవాలలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావు తన ఆరాధ్య దైవం శ్రీనివాసుని సేవకుగాను, తీసుకున్న నిర్ణయాలు తిరుమల తిరుపతిక్షేత్రాన్ని పుంజీభూతాధ్యాత్మిక తేజఃకేంద్రముగా, ఖండఖండాంతరాలలోకి ఆర్షధర్మావలంబకులకు ప్రబోధం కలిగించే ఆధ్యాత్మిక రోచిస్సుగా తీర్చాలనే ఆయన దృఢదీక్షను ప్రతిబింబించాయి. అందువల్లనే త్రయాహ్నికమైన ఈ స్వర్ణోత్సవము ఒక అద్భుత సంఘటన, చారిత్రక సన్నివేశముకూడ.

నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమలతోపాటు సాంస్కృతిక విద్యాకేంద్రం తిరుపతికూడా, మిరుమిట్లుగొలిపే వివిధవర్ణ విద్యుద్దీపాలంకరణలతో, వేదఘోషతో, హరికీర్తనసమాజకార్యక్రమాలతో, పుణ్యకథావిశేషాలతో, ధార్మికప్రవచనాలతో, మానవతాప్రబోధక సూక్తితోరణ ద్వారాలతో, సర్వతః, భక్తిరసామృతప్లావితమై ఇలలోని వైకుంఠం ఇదే ఇదే! ఇదే అనిపించింది.





ఉత్సవ సమారంభానికి తగినట్లు సువిశాలమైన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ క్రీడామైదానాన్ని (స్టేడియం) సభాస్థలిగా ఎన్నుకొని, చలువ పందిళ్ళు, కాంతిపుంజాలు, దూరదర్శన, శ్రవణయంత్రాలు, ఇతర అత్యవసర సౌకర్యాలు ఏర్పాటుచేయటం ప్రేక్షకులందరికి ఆనందం కలిగించింది. ఆహ్వానపత్రాలు ఇంటింటికి పంపటం, పట్టణంలోని వివిధకీలక ప్రాంతాలనుండి ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయటంతో అశక్తులుకూడ చాలా ఆసక్తితో రావటం కనిపించింది. అనుకోటానికి కూడా అవకాశంలేని భద్రతాచర్యల వల్ల ఈ త్రయాహ్నిక యజ్ఞములో అన్ని కార్యక్రమాలు అతి క్రమశిక్షణాయుతములూ, శోభాయమానమూ అయ్యాయి. దైవకార్యక్రమ సంకేతముగా, శ్రీనివాస దయాప్రాప్తికి, అనిష్ట నివారణద్వారా జగత్కల్యాణానికి వరుసగా మొదటి రెండురోజులు మహాశాంతి హోమం, మూడవరోజున మహారుద్రయాగం, ఉత్సవ స్థలములో దేవేరిసహితులైన శ్రీ గోవిందరాజస్వామి, శ్రీ కోదండ రామస్వామి, శ్రీ కపిలేశ్వరస్వామి వారి సన్నిధిన, వేద విహితంగా జరగటం, ఉత్సవాలకు ఉదాత్తతనేగాక, అధిక పావిత్ర్యాన్ని కూడా కలిగించాయి. సామాన్యుల కరుదనిపించే వేదనాదం మూడురోజులపాటువిని మురియని భక్తుడులేడన్నా ఆశ్చర్యంలేదు.

శ్రీ రక్తాక్షి సంవత్సర చైత్రబహుళ సప్తమి (22-4-84) ఆదివారం ఉదయారుణరాగ స్పర్శ పులకింతలలో స్వర్ణోత్సవ శుభోదయం అయింది. సభాప్రారంభానికి ముందే, సభాంగణం ఆహూతులతో క్రిక్కిరిసిపోయింది. ఉత్సవ ప్రారంభకులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దేవాదాయమంత్రి శ్రీ యన్. టి. రామారావు రాకకోసం, వేదనాద నాదస్వర వాద్య లహరులనడుమ సుసజ్జిత, సుందరవేదిక ఎదురుచూస్తూ ఉంటే అదొకరకమైన అనుభూతి, ఆత్రుత వ్యక్తమయ్యాయి. శ్రీవారి శంఖచక్రా లిరుప్రక్కన, నడుమ స్వర్ణోత్సవ సంకేతం 50 సంవత్సరాలు కలిగిన ఆనంద నిలయ విమానంతో వేదిక వెనుక భాగాన్ని అలంకరించటం జరిగింది.

ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావుకు ఉత్సవ ప్రాంగణం ముంగిట వేదాశీర్వచన యుక్త పూర్ణ కుంభముతో దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వి. కె. డి. వి. సత్యనారాయణరాజు, మండలిలోని ఇతరసభ్యులు,



కార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. యన్. జయసింహ ఇతర ఉద్యోగి బృందం స్వాగతం చెప్పారు.

దేవేరిసహితులైన శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవ మూర్తులను దర్శించి ముఖ్యమంత్రి, తమ శ్రీమతి బసవతారకమ్మతో యజ్ఞవేదికను చేరి, పూర్ణాహుతిగా వివిధఫలాలు, నారికేళాలు, వనమూలికలు పట్టు వస్త్రములు, నేతితో నిండిన రజతపాత్ర యాగాగ్నిలో సమర్పించారు. తరువాత ముఖ్యమంత్రి స్వర్ణోత్సవ నిర్వహణ సూచక ఫలకాన్ని ఆవిష్క



రించారు. పిదప ముఖ్యమంత్రి వేదికమీదకు విచ్చేసినపుడు అశేషసభాసదులు కరతాళ ధ్వనులతో అభినందించారు. దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వి. కె. డి. వి. సత్యనారాయణరాజు అధ్యక్షత వహించారు.



దేవస్థాన బాలమందిర బాలబాలికల గీతావరనం ఆ తరువాత వైదిక ప్రార్థనతో సభాప్రారంభం అయింది.


దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ పి. వేంకటేశ్వర్లు తమ సభాస్వాగతంలో, ఈ చారిత్రక సన్నివేశ ప్రాధాన్యాన్ని, ఈ స్వర్ణోత్సవ కార్యక్రమాలకు ముఖ్యమంత్రిగానే కాక దేవాదాయమంత్రిగా కూడా శ్రీ యన్.టి. రామారావు ప్రారంభోత్సవం జరపటంలో గల ఔచిత్యాన్ని వివరించి స్వాగతం చెప్పారు.

సభాధ్యక్షులు శ్రీ సత్యనారాయణరాజు తమ ప్రసంగంలో, ఉత్సవ ప్రాధాన్యాన్ని వివరించి, ఈ చరిత్రాత్మక సందర్భంలో పాలుపంచుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పారు.


దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ జి. కుమారస్వామి రెడ్డి తమ నివేదికలో, గత అర్ధశతాబ్దకాలములో యాత్రికులకు భోజన వసతి, రవాణా, దర్శనాది విషయాలలో దేవస్థానం చేసిన కృషిలోని ప్రధాన అంశాలను, మిగులు నిధులను దేవస్థానం ఆర్ష-ఆధునిక-సాంకేతిక విద్య, వైద్య, సంక్షేమకార్యక్రమాలకు ఎలా వినియోగిస్తున్నదీ వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శ్రీ బి. యస్. జయసింహ తమ ప్రసంగంలో, అనేకదేశాలు తమ తమ ప్రాంతాల్లో జరిగే హిందూదేవాలయ నిర్మాణానికి కావలసిన విగ్రహాదుల సరఫరాలాంటి విషయాలలో తిరుమల తిరుపతి దేవస్థానం వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు.

ఈస్వర్ణోత్సవ సందర్భంగా దేవస్థానం, ఆంగ్ల, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషావ్యాసాలతో, దేవస్థాన సంబంధం విషయాలతో వెలువరించిన 560 పేజీల స్వర్ణోత్సవ సంచికను ముఖ్యమంత్రి అర్ధాంగి శ్రీమతి బసవతారకమ్మ ఆవిష్కరించారు.



ఏబది సంవత్సరాలకు చిహ్నంగా, దేవస్థానం వివిధ భాషలలో ఆర్షధర్మంలోని వివిధవిషయాల మీద ప్రచురించిన 50 గ్రంథాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించి, సభకు విచ్చేసిన ఆ యా రచయితలకు తమ అభినందనలు తెలిపారు. దేవస్థాన ప్రజాసంబంధాధికారి శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి ఆ యా గ్రంథకర్తలను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు.



గ్రంథావిష్కరణ సందర్భంలో ఆ యా రచయితలను అభినందిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ నందమూరి తారక రామారావు (కుడినుంచి ఎడమవైపుకు) డా॥ ధూళిపాళ అర్కసోమయాజి, డా॥ విద్వాన్ విశ్వం, శ్రీ స్వామి కృష్ణదాస్, డా॥ కరుణశ్రీ, శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి, డా॥ ఇలపావులూరి పాండురంగారావు, డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు, డా॥ ముట్నూరి సంగమేశం, శ్రీమతి ఆర్. ఇందిరాదేవి, శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య, శ్రీ కె. అప్పణ్ణాచార్య, డా॥ ఎస్. బి. రఘునాథాచార్య.



'మతము-విజ్ఞానము' అన్న విషయంపై పోస్టుగ్రాడ్యుయేట్ తరగతి వారికి దేవస్థానం నిర్వహించిన అంతర్ విశ్వవిద్యాలయ వక్తృత్వపోటీవిజేతలు సర్వశ్రీ సుశీల్ సేఠ్- ప్రథమ(జాదవపూర్ విశ్వవిద్యాలయం), కుమారి రాధారామచంద్రన్- ద్వితీయ (ఉస్మానియా విశ్వవిద్యాలయం), కుమారి జ్యోతికలబాగ్- తృతీయ (కర్ణాటక విశ్వవిద్యాలయం, ధార్వార్), కుమారి లతా. వి. పండిట్- ప్రోత్సాహక బహుమతి (గుల్బర్గా విశ్వవిద్యాలయం), ఆర్. విజయనందన్‌రెడ్డి- ప్రోత్సాహక బహుమతి (ఉస్మానియా విశ్వవిద్యాలయం) లకు స్వర్ణరజతపతకాల బహుమతులను ముఖ్యమంత్రి అందజేశారు.



స్వర్ణోత్సవ సభలను ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి తమ ప్రసంగంలో, అనాదినుండి శ్రీ వేంకటేశ్వరస్వామి వరకు వివిధావతారతత్త్వాలను సోదాహరణముగా ప్రస్తుతించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి భక్తులకు దేవస్థానంచేస్తున్న సేవను అభినందించి, క్రైస్తవమతానికి వాటికన్‌వలె, తిరుమల తిరుపతి కూడా హిందూ ఆధ్యాత్మిక రోచిస్సులకు కేంద్రంగా రూపొందాలని, అందుకు తగిన కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. క్షతగాత్రులైన, ఇతర అవశ్యకత కలిగిన యాత్రికుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో రక్తనిధి ఏర్పాటు, తిరుపతిలో వాహనాల రద్దీ తద్వారా జరిగే ప్రమాదాల నిరోధానికిగాను, తిరుపతికి చుట్టు 'రింగురోడ్డు' నిర్మాణం, అత్యాధునిక విధానాలుగల ఆస్పత్రి, వికలాంగులకు, మూగ, బధిరాంధులకు సంక్షేమకేంద్రం ఏర్పాటు, దేవస్థానపు ముఖ్యప్రణాళికలుగా ముఖ్యమంత్రి వెల్లడి చేశారు.



ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని, ప్రోత్సాహకంగా అప్పర్ డివిజన్ గుమస్తా వరకు రెండునెలల మూలజీతాన్ని, అపై వారికి రు. 1000/-, పింఛనుదారులకు రు. 500/-ల నగదు బహుమతులను ప్రకటించారు.

దేవస్థాన ధర్మకర్తలమండలి సభ్యులు మరియు శాసనసభ్యులు శ్రీ తలారిరుద్రయ్య వందన సమర్పణానంతరం శ్రీ ఎన్. టి. రామారావు దేవస్థాన ఉద్యానవిభాగం తమ పేరిట ఏర్పాటు చేసిన క్రోటను మొక్కను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమం తరువాత ముఖ్యమంత్రి, తదితర ప్రముఖులు, దేవస్థానంలోని ఉద్యానం, పురావస్తు (మ్యూజియం), దాససాహిత్యం, సప్తగిరి పత్రికావిభాగాలు ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలను సందర్శించారు. సప్తగిరివిభాగంలో ముఖ్యమంత్రి తామ్రపత్రాలను శుద్ధిచేసే కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకించారు. దేవస్థాన ప్రచురణల విక్రయవిభాగంలో ముఖ్యమంత్రికి భగవద్గీత ప్రతులు, శ్రీవారి హుండీ పెట్టెలు బహూకరించటం జరిగింది.

దేవస్థాన అధికారులు చేసిన ఏర్పాట్లపట్ల ముఖ్యమంత్రి తమసంతృప్తిని వ్యక్తంచేశారు.

సాయం కార్యక్రమం దేశం వివిధప్రాంతాలనుండి వచ్చిన భజన సంఘాల కోలాటం, చెక్కభజన, పండరిభజన నామసంకీర్తనలతో ప్రారంభమైంది.

శ్రీమతి ఆర్. జి. శోభారాజు, అన్నమాచార్య ప్రాజక్టు వాద్యవిద్వాంసులసహకారంతో అన్నమాచార్య కీర్తనలు గానంచేసి ప్రేక్షకుల ప్రశంసలను పొందారు.



ధార్మికప్రబోధప్రారంభంగా, కుర్తాళం సిద్ధేశ్వర పీఠాధిపతులు శ్రీ త్రివిక్రమరామానంద భారతీస్వామివారు తమ ఉపన్యాసములో భక్తిప్రాధాన్యాన్ని వివరించారు.



శ్రీరామకృష్ణానందస్వామి (గండిక్షేత్రం) నైతిక మూల్యాల పరిరక్షణ, ఆధ్యాత్మికక్రమశిక్షణల ఆవశ్యకతను గూర్చి ప్రసంగించారు.


డాక్టరు ప్రసాదరాయ కులపతి (గుంటూరు) భాగవతంలోని గజేంద్రమోక్షణ ఘట్టప్రాశస్త్యాన్ని సరళమైనభాషలో వివరించారు.

డాక్టరు బోయి భీమన్న తమ సునిశిత ప్రసంగంలో, హిందూధార్మిక ప్రవంతిలో, వెనుకబడిన వారినికూడా భాగస్వాములుగా చేర్చవలసిన అవసరాన్ని విడమరచి తెలియచేశారు.

డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, ధర్మస్వరూపాన్నిగూర్చి, మహాభారతంలోని విషయములు ఆధారంగా వ్యాఖ్యానించారు.

శ్రీమతి ఆర్. దుర్గాంబ భాగవతారిణి హరికథతో మొదటి రోజు కార్యక్రమాలు ముగిశాయి.

రెండవరోజు కార్యక్రమాలు (23-4-84) శ్రీకోదండ రామాలయ ఉత్సవమూర్తులు లక్ష్మణ, మారుతీసహిత సీతారాములు సభాస్థలికి వేంచేయటంతో ప్రారంభమైనవి. ఋత్విక్కులుమహాశాంతి హోమాన్ని నిర్వహించారు.



గీతా పారాయణం తరువాత, 'సుందరదాసు' శ్రీ యం. యస్. రామారావు తాము రచించిగానంచేసే 'సుందర కాండ' గానపారాయణాన్ని ప్రారంభించారు.



పుష్పగిరి పీఠాధిపతులు తమ ప్రసంగంలో తిరుపతి క్షేత్రానికి ఆధ్యాత్మిక, విజ్ఞానఖనిగా దేశాలలోప్రశస్తి ఏర్పడిందని, "తిరు" అంటే "శ్రీ" అని- "మల" అంటే గిరి అని, తిరుమల అనగా "శ్రీగిరి" అనీ, ఇక్కడనే ఆధ్యాత్మికశక్తి పుంజీభూతమై ఉందని, ఈ సత్యం సాధారణంగా వివరించగల విషయంకాదన్నారు. ఈ 'శ్రీగిరి' కి ఒకప్రక్క హరి మరొక వంక హరుడు ఉన్నాడని కూడా అన్నారు. అంతేగాక "శ్రీ" అనగా వేదమాతరూపమని, ఈవేదాచలంపైన సర్వనియంతృకమైన దైవీశక్తిరూపొందిందని, అదే శ్రీవేంకటేశ్వరుడనీ అన్నారు. తిరుమలపై కొలువున్న ప్రభువే పరమాత్మ, పరబ్రహ్మ అనీ స్పష్టంచేశారు.

డాక్టరు ధూళిపాళ అర్కసోమయాజి తమ ప్రసంగంలో మానవుణ్ణి ధర్మమొక్కటే కాపాడగలదని పేర్కొన్నారు. శంకర భగవత్పాదులు తమ భజగోవిందంలో పేర్కొన్నట్లు జీవనకాలాన్ని గోవిందుని కొలుస్తూ సద్వినియోగం చేసుకోవాలని ప్రబోధించారు.

అఖిలాంధ్ర సాధుపరిషదధ్యక్షులు శ్రీ సర్వేశ్వరానంద స్వామి శ్రీ వేంకటేశ్వరుడు అర్థిజన కల్పకమని, ఆపన్న ప్రసన్నుడని వివరించారు. తిరుపతిని హిందూధర్మ ప్రచార కేంద్రంగా రూపొందించటం దేవస్థాన ఆశయమైనప్పటికీ, సాధువులు తమ సాధుపరిషత్తులద్వారాకూడా చేయవలసినది ఎంతోవున్నదని అన్నారు.

శ్రీ చిన్మయానందస్వామి (పాద్‌నగర్) కొన్నియుగాలుగా వేలాదిభక్తులు తిరుమల సందర్శిస్తున్నారనీ, ఇటీవల కాలంలో తరిగొండ వెంగమాంబ, మళయాళస్వామి వంటి తేజోనిధులు తిరుమలలోని తుంబురుకోన, గోగర్భంవంటి స్థలాలలో తపస్సుచేసి సిద్ధిని పొందారని, ఇది నిజంగా సిద్ధిక్షేత్రమని అన్నారు. విశ్వవ్యాప్తంగా హిందూధర్మసారాన్ని ప్రబోధిస్తూ తిరుపతి హిందూభావనకు ప్రతీకగా నెలకొనగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.




డాక్టరు దాశరథి తమ ప్రసంగంలో శ్రీవేంకటేశ్వరస్వామి కేవలం హిందూజనతకేగాక ఖండ ఖండాంతర సమైక్యభావానికే ప్రతిరూపమనీ, తిరుమల ఆధారంగా అనేక కవిశేఖరులు తమ కావ్యాలను, సంకీర్తనామృతాలను వెలువరించారనీ, కనుక తిరుమల ధార్మికసాహిత్యకేంద్రంకూడా నని అన్నారు. భద్రాద్రి రామదాసుకు, అయోధ్య తులసీదాసుకు ఉత్తేజాన్ని కలిగించినట్లుగానే తిరుమల వల్ల ఉత్తేజితుడై అన్నమాచార్యులు 32000 కీర్తనలను వేంకటేశ్వరస్వామివారిపై వ్రాశారని, సంకీర్తనసాహిత్యంలో పల్లవిని ప్రవేశపెట్టిన ఘనత అన్నమాచార్యునిదే అని అన్నారు. స్వర్గీయ వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వంటి ఉద్దండ పండితుల తరువాత, దేవస్థాన పక్షాన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ చేస్తున్న సంకీర్తన ప్రచురణ కార్యక్రమాన్ని వివరించారు.

డాక్టరు రత్నాకరబాలరాజు, ఆధ్యాత్మిక సంపన్నతకు మనశ్శాంతికి బ్రహ్మవిద్యమూలమని, దీన్నిసాధించటంలో భగవద్భక్తికి, పరమేశ్వరానురక్తికి గల ప్రాధాన్యాన్ని వివరించారు. అవిచ్ఛిన్నమైన భగవదనురక్తి నిజమైనభక్తిఅనీ, వాల్మీకి రామాయణం వ్రాసినా, వ్యాసుడు భాగవతం వ్రాసినా అది శ్రీమన్నారాయణ భక్తశ్రేష్ఠుడైన నారదప్రబోధన వల్లనే సాధ్యమైందని అన్నారు. ప్రతి భగవత్కైంకర్యమూ కూడా కర్తకు అధికశుభాలను సమకూరుస్తుందనీ, ప్రారబ్ధకర్మ దుష్ఫలాలు భక్తివల్ల నాశనమౌతా యని, అందరికీ సులభమైంది భక్తిమార్గమే ననీ అన్నారు.

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు తమ ప్రసంగంలో కలియుగంలోని జనులకు భగవన్నామస్మరణే సులభ తరుణోపాయం అన్నారు. భారతాంతర్భాగాలైన భగవద్గీత, విష్ణుసహస్రనామం నిత్యపారాయణ యోగ్యాలని, భగవద్గీతసాక్షాత్ భగవత్ప్రోక్తంకాగా, విష్ణుసహస్రనామం శ్రీకృష్ణభక్తాగ్రేసరుడైన భీష్మాచార్యులవారు పఠించిందని అన్నారు. ఈ రెండు ఆధ్యాత్మిక గ్రంథాల పారాయణవల్ల కలిగే బహుముఖ ప్రయోజనాలను శ్రీ ఆచార్య సోదాహరణంగా వివరించారు. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య వందనసమర్పణతో, ఉదయం కార్యక్రమాలు ముగిశాయి.

సాయం కార్యక్రమాలు, వివిధ భజన బృందాల భజన కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. తరువాత శ్రీ పి. ఎస్. రంగనాథ్, శ్రీ నాగేశ్వరనాయుడు, శ్రీమతి జానకీరమణల, అన్నమయ్య భక్తిగీత కార్యక్రమం జరిగింది.



సాయం సదస్సును ప్రారంభిస్తూ మాతృశ్రీ చింతల యోగినీమాత, మానవులు స్వార్థరహితంగా, నిష్కామమైన భక్తి సాధనకు కృషి చేయాలని, భగవదనుగ్రహంవల్ల సహజమైన తాపం ఉండాలనీ, రామదాసు, అన్నమాచార్య, తులసీదాస్‌లవంటి మహనీయులు భగవద్దర్శనం కోసం పరితపించారనీ, వారిఅనురక్తికి తృప్తిచెందిన పరమాత్మ దర్శనం ఇచ్చాడనీ అన్నారు. నిష్కామంగా పనులు చేస్తే అవి భగవత్సన్నిధికి చేరుస్తాయని, స్వర్ణోత్సవాలలో పాల్గొనటం కూడా

పూర్వజన్మ సుకృతం అని పేర్కొంటూ, ధర్మప్రచారానికి దేవస్థానం తమ అఖిలాంధ్ర సాధు పరిషత్తును కూడా వినియోగించు కోవలసిందిగా సూచించారు.

శ్రీ దయానందస్వామి (గాగిళ్ళపురం), భగవంతుని స్మరించగలదినమే సుదినమని, ఈ మూడురోజుల కార్యక్రమాలలో ఇది చేకూరుతున్నదనీ, శ్రీ వేంకటాచలపతి సన్నిధిన ధనం, ధర్మం, భక్తితోపాటు త్యాగంకూడా ఉండటం మన అదృష్టమని, ఆ స్వామికి శరణనటమే సర్వసంపదసిద్ధి అని అన్నారు. భక్తిజ్ఞానం, విషయత్యాగం మానవప్రయత్నసాధ్యాలని, ప్రాపంచిక సుఖాలన్నీ ప్రారబ్ధకర్మలవల్లనే కలుగుతున్నాయని, భక్తి జ్ఞాన వైరాగ్యాలపట్ల తపనబదులు విషయ తృష్ణ పెంచుకుని జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారని, ఏకాగ్రబుద్ధితో వేంకటేశ్వరుని సేవించినవారికి విజయం తప్పక సిద్ధిస్తుందని ఆయన తెలిపారు.

శ్రీ నిర్మలానంద స్వామి తమ ప్రసంగంలో సనాతన ధర్మం చాలా గొప్పదని, కాని మనం ధర్మాన్ని విస్మరిస్తున్నామని, దైవాన్ని మరవటం మరణంతో సమానమని, పంచభూతాలను యథాశక్తి వినియోగించుకునే వీలు కల్గించిన పరమేశ్వరునికి మనం సర్వదా కృతజ్ఞతతో ఉండాలనీ అన్నారు. బంధువులు నిజంగా బంధాలేనని, ధర్మం తప్ప మరేదీ మన వెంటరాదని బోధించారు.

శ్రీప్రసన్నానందస్వామి, మహాపురుషులనేకులు జన్మించిన మన దేశం చాలా పవిత్రమైందనీ, సనాతన ధర్మాన్ని ప్రవచించిన మతం మనదొక్కటే అనీ, సర్వే జనా సుఖినో భవంతు అనేది మనధర్మంలోని మూలసూత్రమనీ మన పెద్దలు మంచిపనులు చేయవలసిందిగా మనకు బోధించారని, అప్పుడే మన పిల్లలు మననుండి మంచి పనులు చేయటం నేర్చుకుంటారని, యువకులకు సదాచారం నేర్పాలనీ, ఆత్మనియమం ఆహారనియమం పాటించాలని, వృథా ప్రసంగాలు పనికిరావని స్వామీజీ సోదాహరణంగా వివరించారు.

శ్రీ భూమానందస్వామి కలియుగంలో భక్తిమాత్రమే మనకు రక్ష అని అన్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి తమప్రసంగంలో, దేవస్థాననిధులు, వైద్య, విద్య, ధర్మశాలల నిర్మాణాది కార్యక్రమాలకు ఎలా వినియోగమౌతున్నదీ వివరించి ముఖ్యమంత్రి ప్రకటించిన అధునాతన వైద్యశాల, రక్తనిధినిర్వహణ లాంటి పథకాలను వివరించారు.

మహిళలు రామాయణ, మహాభారత, భాగవతాలు, భగవద్గీత లాంటివి చదివి నేర్చుకోవలసినవి ఎన్నో వున్నా




యని, సమాజంలో స్త్రీలే తమ ఇక్కట్లకు కొంతవరకు కారణమనిపిస్తుందని పేర్కొంటు, సీత రామునివెంట అడవులకు రావటం, లక్ష్మణునిమాట వినకుండా నిందించటం, అలాగే మయసభలో ద్రౌపది అనాలోచితంగా నవ్వటం- వాటివల్ల ఎలాంటి అనర్థాలు కల్గాయో వివరించి, స్త్రీలుకూడా తమ ప్రవర్తనలో చాలాజాగ్రత్తగాఉండాలని హెచ్చరించారు. మానవుడికిస్వార్థత్యాగం అవసరమని ఈ సందర్భంలో త్యాగరాజస్వామివారి 'రూకలుపదివేలున్నా' అన్న కీర్తనను వివరణాత్మకంగా పేర్కొన్నారు.

శ్రీ కొండవీటి వేంకటకవి ప్రసంగిస్తూ యుగధర్మాన్ననుసరించి నిర్వచనం కూడా మారుతుందని, ఒకకాలంలో ధర్మంగాను, అధర్మంగాను అనిపించుకున్నవి తరువాతి కాలంలో వ్యత్యయం కావచ్చునని, అలాగే ఆచారాలు అలవాట్లు కూడా మారుతూ వుంటాయని పేర్కొన్నారు. కాలానుగుణంగా దేవస్థానం తన నిధులను సత్కార్యక్రమాలకు వినియోగించటం సరైన పద్ధతిగా ప్రశంసించారు.

శ్రీ మధునాపంతులసత్యనారాయణశాస్త్రి భగవన్నామోచ్చారణ మహిమను ప్రస్తావించి, భగవన్నామ సంకీర్తనవల్ల ఎన్నో సత్ఫలితాలు కలుగుతాయని, డబ్బుఖర్చు, విధినిషేధాలు లేకుండా సర్వకాల సర్వావస్థలలోను నామజపంచేయవచ్చునీ అన్నారు. గడచిన 5000 కలియుగ సంవత్సరాలలో దేవాలయం చరిత్ర 50 సంవత్సరాలు చాల శక్తిమంతమైనవని, ఇప్పుడు స్వామి కృపతో జరుగుతున్నంత ధార్మిక గ్రంథ ప్రచురణ కార్యక్రమం ఎప్పుడూ ఎక్కడా జరుగలేదని ప్రశంసించారు.

శ్రీ నరాల రామిరెడ్డి, మనం చేసే ప్రతి పనిలోను, ఏకాగ్రత, ఏకలక్ష్యం చాలా అవసరమని అన్నారు.

ఆనాటి కార్యక్రమాలు శ్రీ వంగల పట్టాభిభాగవతార్ గారి 'శ్రీనివాసకల్యాణం' హరికథాకాలక్షేపంతో పూర్తయ్యాయి.



మూడవనాటి కార్యక్రమాలు (24-4-84) శ్రీ కామాక్ష్యంబాసమేత శ్రీ కపిలేశ్వరస్వామివారు సభాస్థలికి విచ్చేయటంతో ప్రారంభమయ్యాయి. ఈ రోజున మహారుద్రయాగం జరిగింది.

గీతాపారాయణం తరువాత 'సుందరదాసు' శ్రీ ఎం. ఎస్. రామారావు సుందరకాండ పారాయణం జరిగింది. (తరువాత ఐదురోజులపాటు అన్నమాచార్య కళామందిరంలో జరిగింది.) ఆనాటి కార్యక్రమం సీతాదర్శనంతో పూర్తయింది. ఈ రోజు మంగళవారం అని, ఆంజనేయ స్వామివారు లంకలో సీతాదర్శనం చేసుకొన్న రోజుగూడ మంగళవారమేననీ, ఇది చాలా విశేషమనీ వారు పేర్కొన్నారు.


మాతా దయాబాయమ్మ (సాధుస్త్రీల మఠం, రాజమండ్రి) ప్రార్థనతో తుదినాటి ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.



శ్రీ జ్ఞానానందస్వామి (కైలాసకోన) తమ ప్రసంగంలో దేవుడు ధర్మస్వరూపమని, అందువల్ల ధర్మానికి ముఖ్య లక్షణాలైన సహనం, సానుభూతి లాంటి లక్షణాలను అలవర్చుకోవాలని, ఆగ్రహాన్ని నిగ్రహించాలని అన్నారు. గీతా పఠనంవల్ల మానవుని జీవనం మారిపోతుందని, దేవస్థానం ఇంటింటి కొక గీతా ప్రతి అందేలా చూడాలని అన్నారు.

స్వామిని శాంతిబాయమ్మ, భగవంతుడు సర్వవ్యాపి అని, నవవిధపద్ధతులు భగవద్దర్శనకు పేర్కొనబడ్డాయని అన్నారు. రోజుకొక్కటైనా గీతా శ్లోకం చదివితే మానవుడి జీవితం నిర్మలమౌతుందని, నిర్మలచిత్తంతో మాత్రమే దైవత్వాన్ని సాధించగలమని అన్నారు. హిందూధర్మరక్షణకుగాను తమ సేవలను ఉపయోగించుకోవలసిందిగా దేవస్థానాన్ని కోరారు.

'కరుణశ్రీ' డా॥ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు 'సాహిత్యంలో భక్తి' అన్న విషయంపై ప్రసంగిస్తూ కవి అన్నవాడు లేకుంటే రాముడు, కృష్ణుడు, రామాయణ భారతాలు ఉండేవి కావని అన్నారు. సత్యాన్ని సుందరంగా చెప్పగల్గినవాడే కవి అంటూ, లీలాశుకుడు, పోతన, తులసీదాస్, సూరదాస్, పురందరదాస్ రచనలను సోదాహరణంగా వివరించారు.



డాక్టరు మరుపూరు కోదండరామరెడ్డి, ఆంధ్రులకు రామచంద్రుడికి వీడని అనుబంధంవుందని, తెలుగులో చాలా రామాయణాలు వచ్చాయని, శ్రీరాముడు ఉత్తరభారత వాసి ఐనా, దక్షిణాదికే చెందిపోయాడని, అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో రామమందిరంలేని ఊరుగాని, పల్లెగాని లేవని అన్నారు. భగవంతుని చేరటానికి పూర్ణశరణాగతికి మించిన మార్గంలేదని ఆయన అన్నారు. ధార్మిక గ్రంథప్రచురణల ద్వారా, విస్తృతంగా భక్తిప్రచారం చేస్తున్నందుకు దేవస్థానాన్ని అభినందించారు.

శ్రీ సముద్రాల లక్ష్మణయ్య వందనసమర్పణతో ఉదయం కార్యక్రమం సమాప్తమైంది.

సాయంకాల కార్యక్రమం వివిధ భజనలతో ప్రారంభమైంది. శ్రీ సోము ఉమాపతి, శ్రీమతి రత్నకుమారి, భక్తిగాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

(43 వ పేజీలో)

రామకథా రమ్యరీతులు

- వి. సుబ్బరాయుడు

(గతసంచిక తరువాయి)

విభీషణుడు మాయారూపమున రావణసైన్య నివహమును దునిమెనని; యుద్ధరంగములో పలువురు రావణులు, పలువురు రామలక్ష్మణులు స్వశరీరముల నుండియే సృష్టించుకొనిరని; ఇంద్రుడంపిన రథమును రాముడు స్వీకరించుటకు నిరాకరించగా విభీషణుడు అది మాయా కల్పితమైనదిగాదని చెప్పెనని అభివర్ణింపబడినవి. సీత పాతివ్రత్యమును బ్రహ్మ, అగ్ని, వాయువు, వరుణుడు. దశరథుడు ప్రత్యక్షమై వివరించుట మూలమున; నలకూబరుని శాపకారణముగ రావణుడు సీతను స్పృశించలేదని బ్రహ్మచెప్పుట మూలమున రాముడు సీతను స్వీకరించినట్లిందులో గలదు.

వాయుపురాణంలో రావణునకు నాలుగు పాదములు, ఇరువది భుజములున్నట్లు లిఖించబడినది.

సీత పాతివ్రత్యమే రావణ వధకు హేతుభూతమని; మాయారావణుడు పర్ణశాలను సమీపించినపుడు సీత తన దివ్యశక్తిచే అగ్ని ద్వారా మాయా సీతను సృజింపజేసి పర్ణశాలలోనుంచి, స్వరక్షణ గావించుకొనినదని; రావణ వధానంతరము మాయా సీత అగ్ని ప్రవేశముజేయు, నిజసీతను రామునకు అగ్నిహోత్రుడు సమర్పించినట్లు చెప్పబడుఘట్టములు కూర్మపురాణములో గలవు.

అగ్ని బ్రాహ్మణరూపములో వచ్చి మాయా సీతను సృష్టించి, సీతను రావణుబారినుండి తప్పించినాడు, మాయా సీతయే మరుజన్మలో ద్రౌపది. అహల్య సౌందర్యము నపేక్షించిన దేవేంద్రుడు, ఆమె పుష్కరిణిలో స్నానమాడువేళ తన మనోగతాభిప్రాయమును వెల్లడించి నిరాశపడగా, గౌతముడింటలేని వేళ గౌతమ రూపధారియై వచ్చి తన కామ తృష్ణను తీర్చుకొనెను. ఇది గ్రహించిన గౌతముడు, భంగాంగుడగునట్లింద్రుని, శిలయగునట్లహల్యను శపించెను. హనుమంతుడు శివాంశ సంభూతుడు. అవాల్మీకములైన ఈ విషయములు బ్రహ్మవైవర్తపురాణంలోనివి.

సీతాన్వేషణా కాలములో శివపార్వతులు రామునకు ప్రత్యక్షమయినపుడు, శివుడు రామునకు నమస్కరించుట గాంచి, కినుక వహించిన పార్వతికి రాముని నిజవృత్తాంతమును శివుడెరుకపరచెను. రాముని ధర్మనిరతిని ప్రత్యక్షముగ చూడనెంచి, యామె సీత యాకృతిలో దండకారణ్యములో రామునకు కనిపించినది. ఆమెతో రాముడు "తల్లీ మహేశ్వరీ! నీ విట్లొంటరిగ నేల సంచరించుచుంటివి? యనెను. ధర్మ తత్పరత తెలిసికొన్న పార్వతి నిజరూపున అగపడి, ఆశీర్వదించి, అంతర్ధానమైనది. శివపురాణములో ఈ కల్పనలు గలవు.

స్కాంద పురాణాంతర్గత బ్రహ్మఖండంలోని విషయములు. రాముడు బ్రహ్మహత్యా పాతక నివృత్తి కొరకు లింగ ప్రతిష్ఠచేయనెంచి, లింగమును తెచ్చుటకు హనుమంతుని కైలాసగిరికంపెను. ఆయన రాకలోగల యాలస్యము నూహించి, సీత ఇసుకలింగమునుచేయు, రాముడాలింగమును ప్రతిష్ఠించెను. ఇంతలో తిరిగివచ్చిన హనుమంతుడు కనలి, తన తోకతో నా యిసుక లింగమును పెకలింప యత్నించి విఫలుడాయెను. రాముడాయనను అనునయించి, ఆయన దెచ్చిన లింగమునుగూడ ప్రతిష్ఠించి, ఆ లింగమునకు హనుమల్లింగమని, ఆప్రదేశమునకు హనుమత్కుండమని పేరిడెను. గోదావరీ తీరంలో లింగ ప్రతిష్ఠజేసి పూజసలిపిన రామునకు శివుడు ప్రత్యక్షమై, తుంగభద్రా తీరమున కిష్కింధ కలదని, అచటగల వాలి సుగ్రీవులలో, సుగ్రీవుని సహాయమున సీతను గాంచ గలవని రామునకు ఎరుక పరచెను.

బ్రహ్మహత్యా పాతకము నివృత్తియగు మార్గముదెలుపుమని రాము డగస్త్యుని వేడినట్లు, ఆయన సలహా మేరకు అశ్వమేధ యాగంచేసి దోష రహితుడైనట్లు పద్మపురాణములో నున్నది. వివాహాత్పూర్వము రామకథను గానం చేయుచున్న రెండు చిలుకలను సీత పట్టి తెప్పించుకొనినది. "ఈ కథ వాల్మీకి మహామున్యాశ్రమ పక్షులమగుటచే, వారిద్వారామాకుతెలిసిన" దనిరి. వానిలో ఆడు చిలుకనుంచుకొని, మగచిలుకను వదలివేసెను. భర్త వియోగము సహించలేని చూలాలుగనున్న యా చిలుక "నీవును గర్భవతివిగ నున్నపుడు భర్తచే విడువబడెదవు"గాక యని శపించి ప్రాణత్యాగం చేసెను. ఆ మగ చిలుకయే మరుజన్మలో రజకుడై, గర్భవతి యగు సీతపై నిందమోపి, రాముడు సీతను వదలుటకు హేతువైనది. పాతాళఖండము ననుసరించి దశరథునకు కౌసల్య, సుమిత్ర, సురూప, సువేషలను నల్వురు భార్యలని, వారికి క్రమముగా రామ, లక్ష్మణ, భరత శత్రుఘ్నులు పుత్రకామేష్టి యాగానంతరము ఉదయించిరని తెలియుచున్నది. మాయా గౌతమరూపంలో తన వాంఛను తీర్చుకొని ఆశ్రమము నుండి మార్జాలరూపమున బయటబడిన ఇంద్రుని, గౌతముడు దూరదృష్టిని జూచి గద్దింపగా నిజరూపు బహిర్గతమైనది. అతని శరీరము భంగాంగ మగునట్లు, అండములు ఖండములగునట్లు శపించెను. అహల్యను "మాంసము నఖములు లేక కేవలం చర్మముచే కప్పబడిన

అస్థిపంజరము వలెనుండు" మని శపించెను. ఇంద్రుడు ఇంద్రాక్షీదేవిని గురించి తప మాచరించగా, ఆమె యాతని శరీరముపై గల సహస్ర యోనులు సహస్రాక్షులు. అగునట్లు వరమిచ్చినది. మేషాండము లండములగునట్లు గూడ అనుగ్రహించి వెళ్ళెను.

ఈ పురాణంలోని సృష్టిఖండములో సంతు నాశించిన దశరథుడు వైష్ణవీ యజ్ఞం చేయగా, సంప్రీతి జెందిన విష్ణువే పాయసపాత్ర ననుగ్రహించ, అందులోని పాయసమును సమముగా దశరథుడు భార్యలకు పంచెను. విష్ణువే కౌసల్య గర్భమున రాముడై జన్మించెను.

ఒకనాడు కౌసల్య పొత్తిళ్ళలోని బాల రాముని శరీరమునుండి విశ్వరూపమును గాంచి భయకంపితయై, ముకుళిత హస్తములతో, "నా కండ్లకు బాలకుడవుగనే కనిపించు" మని వేడ, రాముడు అట్లే బాలుడుగ కనిపించెను. ఇదియును పద్మ పురాణ కల్పనయే.

సీతాపహరణానంతరం దుఃఖితుడైన రామునకు నారదుడు దుఃఖోపశమనార్థం దేవీనవరాత్ర పూజ నారంభించుమనిచెప్పుచు తాను జానకిని చూచివచ్చితినని, ఆమెకు ఇంద్రుడు కామధేను క్షీరమునాహారముగ నిచ్చుచున్నాడని పలికెను. ఇది దేవీభాగవత కథనము.

భాగవత పురాణంలో రాముడు రావణ వధానంతరం అశోకవనములో నున్న సీతను దర్శించ వెళ్ళినాడని; అయోధ్యచేరిన తరువాత సీతను గూర్చిన అపనిందను, గూఢచారిగ అర్ధరాత్రివరకు రాముడే విని నాడని యున్నది.

జానకీహరణమను నాటకమును సింహళ రాజు కుమారదాస క్రీ॥ శ॥ 7 వ శతాబ్దంలో వ్రాసెను. ఇందులో రామలక్ష్మణులువసిష్ఠుని వెంటబోయిరని యున్నది. సీత నపహరించి తీసుక వెళ్ళుచున్న రావణునకు జటాయువు గాక గరుడుడు కనిపించినట్లు, యుద్ధంచేసి గరుడుడే మరణించినట్లు కల్పించబడి యున్నది.

భాసకృత ప్రతిమా నాటకంలో స్వయముగ కైకయే సీతా రామలక్ష్మణులకు నార చీరలిచ్చినట్లున్నది. అయోధ్యలో ప్రవేశించిన భరతునకు తన రాకకు ముందు జరిగిన వేవియును తెలియవు. ప్రతిమా గృహంలో గల దశరథుని ప్రతిమను చూచిన తరువాతనే రామ వనవాస గమనాదులు తెలిసినవి.

విశ్వామిత్ర మహర్షి యాహ్వానమును మన్నించి జనకుడు తన తమ్ముడగు కుశధ్వజుని వెంట సీతా ఊర్మిళలను సిద్ధాశ్రమమునకు పంపెను. ఆ యాశ్రమంలోనే అహల్యా శాపవిమోచనం జరిగినది. రావణునాదేశానుసారము సర్వమాయుడను రాక్షసుడే సిద్ధాశ్రమంచేరి జానకీ రాములతో, రావణునిగుణగణాలను ప్రస్తుతించి, ఆయన సీతను వివాహమాడ గోరినాడను విషయము వివరించెను. మాల్యవంతుడను రాక్షసుడు శూర్పణఖ సహాయ మర్థించగా, ఆమె దశరథుని యంతఃపురానికి వెళ్ళి మంథరను ఆవహించి, మందర దుర్బోధకు కైక చెవియొగ్గునట్లుచేసి, తాను కోరిన రెండు వరాల నిచ్చుటకు దశరథుడంగీకరించినట్లు లేఖ వ్రాయించి, ఆ లేఖను శూర్పణఖయే మిథిలా నగరములోనున్న రామునకు అందజేసినది. ఈ వ్యూహప్రేరకుడు రావణుడు. వాలి వధకు ముందే విభీషణుడు సుగ్రీవుని యొద్దకు వచ్చెను. మాల్యవంతుని ప్రోద్బలముతో వాలి రాముని అస్త్రవిద్యా పటిమను పరీక్షించ ప్రయత్నించిన ఫలితంగా మరణించెను. వాలి సత్య సంధత, నిర్దోషిత్వములు శ్లాఘనీయములు. ఇవి మహావీరచరితంలోని కల్పనలు.

ఉత్తరరామ చరితము ఆధారముగ దిఙ్నాగుడను కవి కుందమాల నాటకమును రచించినాడు. సీతావియోగము ననుభవించు రామునకు గోమతీనది తీరాన కుంద మాల దొరకెను. అది సీతహస్త నైపుణ్యం వల్ల కట్టబడినదని విశ్వసించిన రాముడామె పాదముద్రలను అనుసరించి వెళ్ళి చివరకు వాల్మీకి ఆశ్రమము చేరి సీతను చూడ గలిగెను. ఈ నాటక ఇతివృత్త మిది.

అనర్ఘ రాఘవకృతికర్త, మురారి. శ్రవణ. యను నామె మంథర దేహంలో ప్రవేశించి, ఒక లేఖ వ్రాసి దశరథునకు అందజేసినది. తదుపరి సన్నివేశములు వాల్మీకి రామాయణంలో వలెనే యున్నవి. వాలియే రాముని యుద్ధమునకు ఆహ్వానించినాడు. రాముడు సప్తతాళ వృక్షముల భేదించి, వాలిని హతమార్చినాడు.

ఋషులచే నొసగబడిన చూడామణిని సీతకు, అంగుళీయకమును రామునకు లక్ష్మణుడిచ్చెను. భరతునకు సహాయము చేయు మిషతో మాయా రాముని రూపమున వచ్చిన రావణుడు, లక్ష్మణ రూపములో రథమును సిద్ధముచేసిన సూతుడు, సీతను రథమును అధిరోహింపు మనగా ఆమె రథము నెక్కినది. అది వియన్మార్గమున పయనించునపుడు రావణుడు తన కామాంధతను వెల్లడించుటకు సీతను సమీపించెను. చూడామణి సహాయముతో ఆమె నిజస్థితిని అవగతం చేసికొనినది. సీత రూపములో నున్న శూర్పణఖ రాముని వంచింప యత్నించినది. రాముని వేషములో మారీచుడు లక్ష్మణుని మోసగించ యత్నించినాడు. అంగుళీయం ప్రభావముతో వారి యత్నములు భగ్నమైనవి. ఈ కల్పనలు ఆశ్చర్యచూడామణిలో గలవు. కవి శక్తిభద్రుడు.

ప్రసన్నరాఘవ కావ్యకర్త జయదేవుడు. సీతను రాముడు అన్వేషించుచు; ఆమె జాడను గురించి చెట్టు, పుట్టను అడుగు సమయమున లంకలోని సీత వృత్తాంతమును మాయావియగు రత్నశేఖరుడు ప్రదర్శించగా రాముడు చూచెను. రావణుని తిరస్కరించు సీత నాతడు చంప యత్నించినట్లు, రక్తము పట్టుటకు కపాలమును తేబోయినపుడు ఆయన చేతిలో ఎవరో అక్షయకుమారుని శిరము నుంచినట్లు, లంకలో ప్రవేశించిన హనుమంతుని దుశ్చర్యయే యిది యని భావించి రావణుడు ఆతని జంపు ప్రయత్నములో అశోకవనమును విడచి వచ్చినట్లుండినది యా ప్రదర్శన.

సీత రాముని మిథిలాపురవీథులలోచూచుటవలన, అంతఃపుర పైభాగముననున్న సీతను రాముడు తిలకించుటవలన, వివాహాత్పూర్వమే వారి మనసులు సంగమించినవి. శివధనుర్భంగానంతరము వివాహం

మాత్రమే జరిగినది. వాలి చనిపోయిన పిదప తార నియమబద్ధ జీవితము గడపినది. సుగ్రీవునకుమాతృమూర్తిగమాత్రమే యుండినది. నలకూబర శాపగ్రస్తుడగు రావణుడు సీతనుస్పృశించలేదు. శూర్పణఖ పేరిందులో కామవల్లి. వికృతాకారిణియగు శూర్పణఖ మాయచే అందాల రాశిగ మారి రామునివశంవదునిగావించుకొనయత్నించి విఫలమనోరథయైనది. కుంభకర్ణుని జంపి ప్రయోజనము లేదనినాడు రాముడు. రామునాజ్ఞచేవిభీషణుడుఅగ్రజునకెదురేగిసాష్టాంగ దండప్రణామము లాచరించి, తనతో గూడ వచ్చి రాము నాశ్రయము పొందుమని నాడు. రాజనీతిని బోధించి, ధర్మప్రబోధము గావించి, రణోద్యోగాను రక్తియే తన కర్తవ్యమని తెలిపి, అశ్రుపూరిత నయనాలతో తమ్ముని ఆశీర్వదించి పంపినాడు కుంభకర్ణుడు. ఈ శిల్పచాతురీ కల్పనలు తమిళములోగల కంబరామాయణములోనివి.

కన్నడములో గుణభద్రుని ఉత్తరపురాణమునకు సంబంధించిన చౌందరామాయణములో మండోదరి కూతురే సీతయని, మాయలేడిని రాముడు వెంబడించిన పిదప రావణుడు రాముని వేషములో వచ్చి సీతను అపహరించినాడని, లక్ష్మణునిచక్రాయుధముతో రావణుడు చంపబడెనని కలవు.

పంపరామాయణ కల్పన ప్రకారము వానరులు సేతువు మీదినుండిగాక ఆకాశ మార్గమున లంకనుచేరిరి. రావణుడు పుట్టుకతో ఏకకంఠుడే, కాని జన్మించిన మందిరములోగల దశముఖ వజ్ర దర్పణములో ఆ ముఖమే పది ముఖములుగ ప్రతిబింబితమైనది. అందుచేతనే దశముఖుడైనాడు. లక్ష్మణుడు రావణుని చక్రాయుధముతో చంపెను. రాముని తల్లిపేరు అపరాజిత. రావణుడొకనాడు పుష్పకముపై నుండి చూచి సీత సౌందర్యమునకు ముగ్ధుడై చివరకు ఆహుతి యయ్యెను.

పుట్టప్ప రామాయణదర్శనంలో వాలి అనంతరము తార సహగమనము చేసినట్లు హనుమంతుడు లంకాదహనము చేయనట్లు, రావణుడు రాక్షసుడు కానట్లు, పాతివ్రత్య నిరూపణకు సీత అగ్నిప్రవేశం చేయగా, ఏకపత్నీవ్రతా ధర్మ నిరూపణకు రాముడు అగ్నిప్రవేశము చేసినట్లును గలవు.

విశ్వామిత్రుని వెంట మిథిలకు వచ్చిన రామలక్ష్మణులు పూజా కుసుమముల కొరకు వనమునకు వెళ్ళుట, అదే సమయమునకు గౌరీపూజకై సీత యటకు వచ్చుట, రామలక్ష్మణులను చెలికత్తెలు వర్ణించుట, ఆమెను రామునకు సన్నిహితము చేసినవి. పరస్పరం మానసిక సామీప్యం యేర్పడినది. రామ పట్టాభిషేకము రావణవధకు ఆటంకమని భావించి, దేవతలు శారదాదేవిని వేడ నామె మంథర బుద్ధిని మార్చి కైక ద్వారా రాముని కానలకంపునట్లు చేయును. శూర్పణఖా పరాభవము కంటెను, ఖరదూషణాదుల సంహారమే రావణుని కలచి వేసినది. వారి సంహర్త మహత్తర పురుషుడు, సాక్షాద్భగవత్స్వరూపుడేయని రావణుడు భావించెను. ఇవి తులసీదాస కృత రామచరిత మానస లోని కల్పనాంశములు.


కృత్తివాస పండితుని కృత్తివాస రామాయణము (బెంగాలీ) లోని కల్పనలు: వసిష్ఠ విశ్వామిత్రాదులు నిర్ణయించిన ముహూర్తమునకే కల్యాణము జరుగుచో, రావణవధయసంభవమని తలచినఇంద్రుడు, చంద్రుని ప్రేరేపించ నాతడప్సరోంగనయై కల్యాణ మంటపము నందలి వారలను నాట్య, గాన సమ్మోహితముజేయ, అంతలో ముహూర్త పుష్కరాంశ దాటినది. తత్పర్యవసానమే రామ కాననవాసము. నిద్రాహార వర్జితయైన సీతకు ఇంద్రుడు నిత్యము ఒకఫలము చొప్పున ఇచ్చెను. సుగ్రీవుని భార్య నపహరించిన వాలిని వధించ రాముడు ప్రతిన బూనెను. భ్రాతృహంతకుడనుపేరు తనకు వచ్చునని సుగ్రీవు డిందులకు సమ్మతింపడు. రాజధర్మానువర్తిగా రాముడు వాలిని చంపెను. రాముని అంగుళీయకమును సీత కన్నుల కద్దుకొని "దీనిని చూచినచో రాక్షసస్త్రీలు దొంగిలించెదరు. హృదయమున దాచుకొందునేని ఎల్లప్పుడును రాముని చూడ వీలుపడలేదే?" యని చింతించునంతలో, చంద్రదర్శన స్పర్శనలచే అంగుళీయకములోని చంద్రకాంతశిలలు ద్రవించినట్లగుపించెను. సీత, "ఓ యంగుళీయకమా! నీవును దుఃఖించుచుంటివా? రాముడు చేపట్టిన వారికి కష్టపరంపరతీరునా? ఇన్ని కష్టాలకు సీతయను పేరే కారణము ఇక మీద ఏ స్త్రీకీ సీతయను పేరుండరా"దనెను

పరిత్యక్తయగు సీతను భూదేవి పాతాళమునకు తీసుకు వెళ్ళినట్లు; ఆమె కోరిక ననుసరించి వాసుకి లవకుశవులను మాయారూపుడై తెచ్చి చూపినట్లు, హనుమంతుడు వాసుకిని నిర్జించి కుమారులను, సీతను రామున కప్పగించినట్లు; అయోధ్య యందుండ నొల్లని సీత దినమున కొక పర్యాయము వచ్చి భర్తను, కుమారులను, హనుమంతుని చూచి పోవుచుందుననిచెప్పి అంతర్థానమైనట్లు "శత్రుంజయము" అను అస్సామీ కావ్యమునగలదు. దీని కృతికర్త రఘునాథ మహంత్.

పూర్వ జన్మలో అప్సరసయైన మండోదరి దేవతల విన్నపము నాలించి, ఈ జన్మలో రావణుని భార్యయగుటకు అంగీకరించినది. ఆయన దేవతలపై దండయాత్ర చేయబోవు నాటికి గర్భిణిగనున్న మండోదరి ఆయన తిరిగివచ్చు లోపలనే ప్రసవించుట, ప్రసవకాలము దోషాస్పదమైనదని, లంకా వినాశకారియని జ్యోతిష్కులు చెప్పగావిని యా పసికందును పేటిక యందుంచి నదిలో విడిచెను. ఆ పేటిక నుండి జనకునకు లభించిన పాపయే సీత. రావణుని అవసాన దశలో సీత జన్మ వృత్తాంతమును మండోదరి వెల్లడించగా నీరు గార్చిన నయనాలు నిలిచిపోయినవి. శూర్పణఖ నిద్రించువేళ రాముడు బలాత్కరించినట్లు, తాను ప్రతిఘటించినట్లు రావణునకు విన్నవించినది. వినిన రావణుడు సీతనుగూడ బలాత్కరించెదనని శపథము జేసెను. ఈ కల్పనలన్నియు కాశ్మీరపు రాజు సుఖజీవన సింహుని ఆస్థానకవి దివాకర పరాశరభట్టు వ్రాసిన రామాయణములో గలవు.

ఎప్పుడైతే ధర్మానికి విఘాతము శంకింపబడునో, అప్పుడు ప్రతియుగములోను, ధర్మరక్షణ కొరకు తనను తానే సృష్టించుకొనెదనని, శ్రీకృష్ణపరమాత్మ గీతలో ప్రవచించియున్నాడు. ఆ మేరకు త్రేతాయుగములో ఏర్పడిన అధర్మమును రూపుమాపి, ధర్మమును పునరుత్థానము చేయుటకే భగవంతుడు రామావతారమును ఎత్తియున్నాడు. దైవము మనుష్యరూపమున జనించి, మానవ సహజమైన కష్టనష్టాలను ధర్మబద్ధముగ అనుభవించి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, గావించి మానవ నైతికోన్నతిని, భక్తితత్త్వమునుద్విగుణీకృతము చేసెను. ఆయా కావ్యములలో దొర్లిన కల్పనలు మూలమునకు వన్నెదెచ్చినవేగాని, అది కావ్యముతో భేదించలేదనుట సత్యదూరము కాదు.

మథనం



గుడినుంచి బైటకి వస్తున్నా. నెత్తిమీద ఏదో టప్పున పడినట్లనిపించి తలపైకెత్తి చూశా. ఆ వడిందేదో కంట్లోకూడా పడింది. కళ్లు నులుముకోవాల్సి వచ్చింది.

"అయింది! బాగా అయింది! లేకపోతే ఏవిటాచూపులూ! అదేమన్న పుణ్యమా పురుషార్థమా? ఆ బొమ్మల వేపు అలా చూడకపోతే యేం, అట్లా కళ్లు కుట్టుకోక పోతేయేం! ఏళ్లొస్తే సరా!"........ఇలా సాగుతూ వుంది ఒక గొంతుక.

ఎవరా, ఇంతసిసలైన తెలుగులో తిడ్తున్నారని అటుచూశా! మా అప్పారావు! వాళ్ళావిడా, ఇద్దరు పిల్లలు. తిట్లు అయిపోయినట్లుంది. ఆపేశాడు, పకపక నవ్వుతూన్నాడు. పాపం వాళ్ళావిడ సంగతి చెప్పతరంగాదు. పొరబాటున వచ్చాననుకొని ఉంటుంది వీడి ధోరణికి. తిట్టున్నది మాత్రం నన్నే అని ఆవిడకీ తెలిసిపోయింది.

వాడు నాకు కొత్తకాదుకాని, నిమ్మకాయ వైద్యందాటి పెద్దాసుపత్రి కెళ్ళిన అప్పారావు ఇప్పుడిలా ప్రత్యక్షమై విరుచుకు పడటమే నా బుర్రకు అర్థంకాని విషయం! ఎప్పుడు వచ్చార్రా అని అడుగుదామనుకొంటున్నా. "ఉరే ఉరే! మేమున్నచోట ముఖ్యమైంది మర్చిపోయివచ్చాం! ఇక్కడే....ఇప్పుడే వచ్చేస్తా! కాస్త వీళ్ళిద్దర్నీ చూస్తుండు. రా! రా! త్వరగా వెళ్దాం. ఆ అన్నట్లు ఆ బొమ్మలకేసి చూస్తూ కూచోకు పిల్లలు జాగ్రత్త" అని, తన భామామణితో కూడా రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడు. అప్పుడర్థమైంది వీడు ఇక్కడ కాదు ఎక్కడో దిగి వుంటాడని. ఏం చేద్దాం పిల్లలిద్దరేగాదు చిన్న చెంబుకూడా వుందాయె. మర్యాదకోసం, కాఫీ పట్టించి మెట్లమీద చతికిలబడ్డాం.

అసలు వీడికింత కోపం కల్గించిన విషయం ఏమిటాని గోపురమంతా పరీక్షగా చూచాను. గోపురమంతా దైవికమైన సింగారంతోపాటు పామర శృంగార చిత్రాలు కలబోతగా కన్పిస్తున్నాయి. అప్పుడర్థమైంది, వీడు, వీడిలాంటి వాళ్ళు ఎందుకిలా పొగలు, సెగలు కక్కుతున్నారో. ఇవి సమాజాన్ని పాడుచేశాయని, కనుక వాటిని పొడిచెయ్యాలని వీళ్ళవాదం. నాకూ అనిపించింది.

ఏకాంతంలో కూడా ఎబ్బెట్టుగావుండే విషయాలు ఇలా గోపురాలెక్కి గోల చేయటం ఏమిటా అని.

కాని తీరుబడి, వేరుశెనక్కాయలుకూడా తెచ్చుకూర్చున్నామేమో, మామూలుగా మథనం మొదలైంది............

* * *

ఇలా గుట్టురట్టు కెక్కడం ఈ గుడిలోనే ప్రారంభం కాలేదు. ఈ దేశంలో ప్రతి దేవాలయంకూడా ఈ అవస్థకు గురైందే. కొన్ని కొన్ని దేవాలయాల మీద కొత్త కొత్త గ్రంథాలు కూడా వస్తున్నాయి.

పోనీ ఇవన్నీ ఒకతరం దేవాలయాలా అంటే అవీకావు. కనీసం గుడి కట్టడం తెలిసినప్పటి నుండి గూడు కట్టుకొన్నవే కదా!

ఈ ఆలయాలన్నిటికిదాతలు, పోషకులు, ఆర్షధర్మ రక్షైక దీక్షా పరతంత్రులుగా పేరు పొందిన రాజన్య వరేణ్యులకు, ధర్మాచార్య పురుషులకు, ఇలాంటి చర్యలవల్ల సమాజంలో విచ్చలవిడితనం పెచ్చుపెరుగుతుందనీ, సమాజ వ్యవస్థకే సమాధి అవుతుందనీ తెలియలేదా మరి! లేక తెలిసే ఆమోదించటం జరిగిందా! చిన్నచిన్న నేరాలకు కూడా కొరతవేయండి, తలతరగండి అనే రాచరికం, శిల్పాచార్యుల 'తులువతనాన్ని' ఎందుకు, ఎలా సహించినట్లు?

పోనీ, 'మనిషికొక తిక్కమహిలో' అన్నట్లు వైయక్తిక రసపైత్యప్రకోప ఫలితమని అనుకొందామా అంటే అదికూడా పొసగటం లేదు. రట్టుకెక్కిన రసలీలలన్నీ పరమశివపదపీఠవర్తి నందికేశ్వరుడు మొదలు ఔద్దాలకి శ్వేతకేతు బాభ్రవ్య, మల్లనాగ వాత్స్యాయన, గోణార్ద్య, పద్మశ్రీ, యశోధర, జ్యోతీశ్వర, జయదేవ, ప్రౌఢదేవరాజ, కల్యాణమల్ల, వేమూల వీరభద్ర, నాగార్జునాది మడిగట్టుకొన్న మహనీయులు, రసరాజులు కలివిడిగా తమ కలాలను కదను త్రొక్కించి నిగ్గుతేల్చి నిరూపించిన ఒక శృంగార శాస్త్రగ్రంథా

[41 వ పేజీలో]

గ్రంథసమీక్ష

శ్రీ రాఘవేంద్ర కల్పవృక్షము

రచయిత : శ్రీ మట్టుపల్లి శివసుబ్బరాయగుప్త
పేజీలు : 216
ప్రాప్తిస్థానము : శ్రీ మట్టుపల్లి శివసుబ్బరాయగుప్త
మట్టుపల్లివారివీధి, కొత్తపేట, గుంటూరు 1.
వెల : రు. 15/–

ఈ గ్రంథానికి శ్రీ రాఘవేంద్ర కల్పవృక్షమని పేరుపెట్టారు. ముఖపత్రంలో వీణపట్టుకొని కూర్చున్న శ్రీ రాఘవేంద్రస్వామివారు; వారి వెనుక బృందావనం, కామధేనువు, ధర్మార్థ కామ మోక్షాలు, శ్రీహరి ధామం అనే ఫలాలున్న కల్పవృక్షముగల త్రివర్ణచిత్రం చాలా అందంగా ఉంది. పూజ్యాయ రాఘవేంద్రాయ, సత్యధర్మ రతాయచ, భజతాంకల్పవృక్షాయ, నమతాం కామధేనవే అనే శ్లోకం ఈ వర్ణచిత్రానికి ఊపిరి.

ఈ గ్రంథంలో మరి మూడు వర్ణచిత్రాలున్నాయి. ఈ గ్రంథాన్ని శ్రీ గుప్తగారు శ్రీ ఆంజనేయస్వామివారికి అంకితమిచ్చారు. ఆ కారణంగా కృతిభర్త (మంత్రాలయ సమీపంలోని) శ్రీ పంచముఖాంజనేయస్వామివారి చిత్రాన్ని ప్రచురించారు. పూర్వజన్మలో శ్రీ రాఘవేంద్రస్వామివారు ప్రహ్లాదుడు, విష్ణుపార్షదుడైన శంఖుకర్ణుడే బ్రహ్మశాపంచేత ప్రహ్లాదుడై జన్మించాడు. ఇదంతా శ్రీహరి భక్తిని ప్రచారం చేయడానికి, భూభారం తగ్గించడానికిన్నీ, కథలోని ఈ అంశాన్ని పురస్కరించుకొని ప్రహ్లాదసహిత శ్రీ లక్ష్మీనృసింహస్వామి వర్ణచిత్రాన్ని ఈ గ్రంథంలో చేర్చారు. చివరగా ఈ జీవిత చరిత్రకు నాయకుడైన శ్రీరాఘవేంద్రస్వామివారి చిత్రం నిల్చున్న భంగిమ ప్రచురించారు. ఈ మూడు చిత్రాలు ఈ గ్రంథానికి వెలలేని భూషణాలు.

ఈ గ్రంథం జీవితచరిత్రల కోవకు చెందింది. కల్పనైతే ఏమివ్రాసినా చెల్లుతుంది. చరిత్ర అట్లాకాదు. ఉన్నది ఉన్నట్లు వ్రాయాలి. దానికి ఆధారాలుండాలి. శ్రీ గుప్తాగారు చాల శ్రమించి శ్రీ రాఘవేంద్రస్వామివారి జీవితానికి సంబంధించిన అనేకాంశాలను గ్రంథాలను చదివి పెద్దలవలన విని సమకూర్చుకొన్నారు. ఆ కృషిఫలితమే ఈ గ్రంథం.

శ్రీవారి సన్న్యాసాశ్రమ స్వీకార మహోత్సవం చరిత్రప్రకారం తంజావూరు రాజాస్థానంలోనే రచయిత దానిని రాజులే చూడవచ్చినట్లు మార్చటం ఔచిత్య శోభితమే. ఐనా శ్రీవారి మహత్తు దీనివలన ఏమీ పెరగదు. కాగా ఈలాగున ఇంకా ఏమి కల్పించారో అనే అనుమానానికితావిస్తుంది.

మన సనాతన ధర్మానికి ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత మూలాలు. శ్రీ కృష్ణద్వైపాయనులవారు వేద విభాగం చేశారు. ఆ వేదాలలో ఉపనిషత్తులలో పరస్పరవిరోధంగా కనిపించేవాని అన్వయంకోసం బ్రహ్మసూత్రాలు చేశారు. భారతాన్ని పంచమ వేదంగా తీర్చి అందులో శ్రీ కృష్ణుడు అర్జునునకు కర్తవ్యబోధగా ఉపదేశించిన భగవద్గీతను నిక్షేపించారు. ఇంతవరకు ఒకటిగా సాగిన మన ధర్మం ఆది శంకరులు, రామానుజులు, మధ్వాచార్యుల పల్ల మూడుశాఖలుగా చీలింది. (త్రోవలు తొక్కింది)

శ్రీ మధ్వాచార్యులు ప్రతిపాదించిన ద్వైత సిద్ధాంతాన్ని మూడు పూవులు ఆరు కాయలుగా ప్రచారం చేసినవారు శ్రీ రాఘవేంద్రస్వామివారు, శ్రీవారి జీవిత చరిత్రే ఇది. ద్వైత సిద్ధాంత ప్రచారానికి శ్రీవారు వ్రాసిన గ్రంథాలు వ్యాఖ్యానాలు టిప్పణులు అమూల్యాలు. ఈ గ్రంథంలో శ్రీవారి రచనలు గురించి సూచించారేగాని వివరిస్తే ఇంకా బృహద్గ్రంథం అయ్యేది.

శ్రీవారి పూర్వ పూర్వ జన్మల గూర్చి వ్రాయటం శ్రీవారి హరి భక్తి హరాజ్జనితం కాదన డానికే, ప్రహ్లాదుడై తండ్రిని, విభీషణుడై అన్నను చంపించినవాడు, బాహ్లికుడై ఏంచేశాడో అంత వివరంగాలేదు. కాని వ్యాసరాయలుగా జన్మించి నాటి రాజైన శ్రీ కృష్ణదేవరాయల్ని కుహూయోగ సంధికాలంలో రక్షించారు. ఇది చారిత్రకాంశం.

శ్రీ వ్యాసరాయలువారు తిరుమలలో 12 సం॥లు ఉండి స్వామివారి నిత్యారాధనలను క్రమబద్ధం చేశారు, దక్షిణభారతంలో 734 ఆంజనేయ ప్రతిష్ఠలు జరిపించారట.

చివరగా శ్రీ రాఘవేంద్ర స్వామిగా జన్మించి శ్రీవారు చదివిన చదువులు రచించిన గ్రంథాలు, భక్తులను రక్షించిన అద్భుత సందర్భాలు ఈ గ్రంథంలో చాలా చక్కగా వర్ణించారు.

దివినుండి భువికి, భక్తునిపాట భగవంతుని ఆట, మూకం కరోతి వాచాలం, రెండు రెండు రెండు అనే శీర్షికలు బాగున్నాయి.

ఈ గ్రంథానికి కిరీటం లాంటిది సర్ థామస్ మన్రో వృత్తాంతం. ఆరోజుల్లో దేశం ఈస్టిండియా వారి చేతుల్లో పడింది. వారి దృష్టి దేవళాల మఠాల ఆస్తులమీదపడింది. దేవాలయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన ఆస్తులన్నీ ప్రభుత్వానికి సంక్రమించేలాగు ఒక కఠోర శాసనంచేశారు. ఈనాముగ పొందిన వ్యక్తి సజీవుడై ఉన్న అవి ప్రభుత్వానికి చెందజాలవు.

ఈ శాసనంవల్ల మంత్రాలయం (నాటి మంచాల) లోని శ్రీవారి జాగీరు ప్రభుత్వవశం కావాలి. నాటి బళ్లారి కలెక్టరు మన్రో స్వయంగా బయలుదేరాడు. సిరస్తాదారు శ్రీరాఘవేంద్ర స్వామివారు బృందావనమందు సజీవులై యున్నారని మన్రోకు నివేదించాడు. మన్రో మంచాలలోని బృందావనం ఎదుట పాదరక్షలు వదలి 'ఇదేనా శ్రీ రాఘవేంద్రుల జీవసమాధి?' అని అడిగాడు. ఆ క్షణంలో శ్రీ స్వామివారు స్వయంగా బృందావనం నుండి బయలువెడలి మన్రోతో ఇంగ్లీషులో సంభాషించారు. మన్రో ఆయనకు నమస్కారం చేశాడు.

శ్రీవారు మంచాలగ్రామం తనదని పలికి మాయమయ్యారు.

చిత్రమేమంటే ఇదంతా మన్రోకే పరిమితం, చుట్టూ ఉన్న వేల భక్తులకు వినిపించలేదు. కనిపించలేదు. మన్రో శ్రీ రాఘవేంద్రస్వామివారు సజీవులేకావున మంచాల జాగీరు వారికే చెందాలని నివేదిక తయారు చేసి గవర్నరుకు పంపాడు.

కథ ఎక్కడ మలుపు తిరిగిందంటే ఆ గవర్నరు భార్య గర్భవతికాగా, సెలవుపెట్టి భార్యతో ఆయన స్వదేశం వెళ్లాడు. ఆ పదవి బళ్లారి కలెక్టరుగా ఉన్న మన్రోను వరించింది. ఆయన గవర్నరుగా వేసిన మొదటి ఆర్డరు తాను కలెక్టరుగా పంపిన నివేదిక మీదే. ఆ విషయం నాటి రాజపత్రంలో ముద్రితమైంది. దాని అనువాదం పాఠకుల సౌకర్యం కోసం రచయిత అందించారు. ఆ అనువాదం చివరన గల షరాలో తిరుపతి వేంకటేశ్వర స్వామికి మన్రో భూదానం గురించి ఉన్నది. మంత్రాలయ వృత్తాంతానికి సంబంధంలేని దీనిని రాజపత్రం చివర ఎందుకు చేర్చారో?

ఇది నవలల కాలం 300 పేజీల నవలకు రు. 15 వెల ఎక్కువకాదు. కాని ధర్మప్రచారం కోసం ఏర్పడిన నిధి నుండి ధనసాయం పొందికూడా రు. 15 వెల నిర్ణయించటం ఎక్కువేమో అనిపిస్తుంది.

ఇంత పెద్దగ్రంథానికి తప్పులే లేవన్నట్లు తప్పొప్పుల పట్టిక చేర్చకపోవటం నిర్లక్ష్యం అనక తప్పదు.

శ్రీవారి జన్మలకు మూలమైన మూల రామచరిత్రలో విభీషణుని కోసం రాముడే 'ఆత్మశక్తిచే తననుండి శ్రీ మూల రామ విగ్రహమును ప్రాదుర్భవింపజేసెను' అని ఉంది. కాని బ్రహ్మ తాను పూజించే మూల రామ విగ్రహాన్ని విభీషణున కిచ్చినట్లు ప్రసిద్ధం.

కొంచెం చేదైనా దోషపరిహరణం తప్పనిసరి. గౌరవవాచకమైన బహువచనం కర్తకే కాదు. క్రియకున్నూ తగిలించాలి. కాని రచయిత ఈ అల్పనియమాన్ని పాటించనే లేదని చెప్పాలి. 279 వ పేజి చివరి రెండు వాక్యాలు చూడండి "కలెక్టరుతో నీ మంచాల గ్రామము తనదని పల్కి శ్రీ రాఘవేంద్ర స్వామి అంతర్థాన మొందిరి. శ్రీవారు ఒక్క మన్రోకే దర్శనమును ప్రసాదించెను.' అక్షరదోషాలు, శ్లోకాలలో గణభంగాలైన తావులు సరేసరి. సరిగా వ్యతిరేకభావం వచ్చిన చోటు 208 పుట చివరి పేరాలోని స్థాపింపబడని బృందావనము, ఉపోద్ఘాతం 10 వ పేజీలో ముఖ్యముగా చిదరహళ్లి శ్రీనివాసతీర్థులు. శ్రీ రాఘవేంద్రస్వామి పూజారులు "మొదలగునవి" అనేది మరొకచోటు.

— చిట్టా దామోదరశాస్త్రి

శ్రీ వేంకటేశ్వర చిత్రరత్నాకరము

రచయిత : శ్రీ విక్రాల శేషాచార్యులు
పేజీలు : 83
ప్రాప్తిస్థానము : శ్రీ రావిపాటి లక్ష్మీనారాయణ, (సబ్‌కోర్టు శిరస్తదారు) నరసరావుపేట.
వెల : తెలియదు.

ధూర్జటి మహాకవి

"ఏ లీలన్ నుతియింపవచ్చు నుపమో
త్ప్రేక్షాధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేషభాషల కలభ్యంబైన
నీరూపమున్
జాలుంజాలు కవిత్వమున్నిలుచునే
సత్యంబు వర్ణించుచో
ఛీ లజ్జింపరుగాక మాదృశకవుల్
శ్రీకాళహస్తీశ్వరా!"

అని అంటాడు. దీనినిబట్టి హృదయనిష్ఠమైన భక్తి వాగ్రూపమునందు కొనజాలదని, ద్వైతీయసత్యము కవిత్వమున కతీతమని తెలియుచున్నది. కాగా భక్తిసాహిత్యము కీర్తన శ్రవణముల నాధారముగా, చింతన మాధేయముగా నిర్మింపబడినచో అది మెండుగా గుబాళించుననుటకు పోతన భాగవతము ప్రత్యక్ష సాక్ష్యము. ఏమైనను భక్తిగ్రంథరూపమెత్తి లోకుల ప్రశంస నందుకొనును. అసలు భక్తిదైవమెరుగును.

శ్రీ విక్రాలశేషాచార్య సాహితీజగత్తున ఉభయ భాషాపోశనము పట్టిన అగస్త్యులుగా ప్రసిద్ధిగన్నవారు. అద్యతనకాలమున చిత్రగర్భబంధ కవిత్వాదుల నాదరించువారు లేరని తెలిసియు 'కవితా యద్యస్తి రాజ్యేన కిమ్' అను పవిత్ర తృప్తితో శ్రీ వేంకటేశ్వర చిత్రరత్నాకరము రచించినారు.

మడికిసింగన

"పలుకుల తీపును, సరసము
చెలువగు నడబెడగు బంధ చిత్రము
సొబగున్
గలకలన చూపవలదే
కలకంఠియు బోలె కవిత కందన
మంత్రీ"

అని అన్నాడు. కవితా సల్లక్షణములలో బంధచిత్రముకూడ ఒకటైనట్లు దీనినిబట్టి తెలియుచున్నది. ఇట్టి కవిత్వము బుద్ధి కుశలతతో నెరవేర్పదగినదగుటచే, ఇందలి నిబంధనలమధ్య భావము మరుగువడునని కొందరు చిత్రకవితను నిరసింతురు. ఏమైనను పూర్వకాలపు శిల్పసైపుణ్యాది నిర్మాణములను మిక్కిలి జాగరూకతతో కాపాడుచు, ఓపికతో పరిశీలించుచున్నట్లే ఇట్టి కవితలను కూడ ఆదరించుట సాహితీమర్మజ్ఞుల కర్తవ్యము.

ఈనాడు తెలుగు పొలముపై చిత్రకవితా కృషీవలురై సఫలీకృతులైన అల్పసంఖ్యాకులలో శ్రీ విక్రాల శేషాచార్య, రాప్తాటి ఓబిరెడ్డి ప్రభుతులనెన్నవచ్చును. శ్రీ శేషాచార్యులవారు, నన్నెచోడ, ముక్కుతిమ్మన, కంకంటి పాపరాజు, కనుపర్తి అబ్బయామాత్యుడు, గణపవరపు వేంకటకవి, వేంకటాధ్వరి- మున్నగు ప్రాచీన చిత్రకవుల రీతులెల్ల తనవిగా చేసికొనుటేగాక, వారికంటె అభినందనీయమైన మెలకువలను ప్రదర్శించినారు.

వీరి కృతిలో ప్రథమ ప్రకరణము గర్భకవిత్వము. ఇందలి పద్యాలు ప్రధానముగా పదిమాత్రమే అయినా, ప్రతిపద్యమునందు

మూడు, నాలుగు పద్యాల నిమిడించినారు. ద్వితీయ ప్రకరణములో చిత్రకవిత్వ మున్నది. ఏబదికిపైగా కవితాచిత్రాలు ప్రదర్శించారు. పూర్వులు పరిహరించిన ఋకారాన్ని గ్రైకొని 'కొమ్ములపద్యా'న్ని వ్రాశారు. అవధానాలలో నిషేధాక్షరి పృచ్ఛకుని బారినుండి తప్పించుకొని, అర్థవంతంగా అల్లిన పద్యమువలె 'అపశబ్దాభాస'మున్నది. 'కుమారాభ్యుదయుము,' 'సీతారామాంజనేయ సంవాదము'లలోని ఏకాక్షరి పద్యాలకంటెకూడ, ఇందు 'ఏకాక్షరి' సులభగమ్యంగా వ్రాశారు. కాగా ఒక్కొక్క పాదము ఒక్కొక్క అక్షరంతోనే అల్లిన ఆటవెలది పద్యంలో తృతీయ పాదం 'రార రార రురురు రారురారేరురో' అని మరీ జటిలం చేశారు. గుణితక్రమాన్ని గూర్చి లక్షణసారసంగ్రహములో

'తలకట్టు గుడుసు కొమ్మును
అలదీర్ఘములేత్వమైత్వమలనోత్వౌత్వం
బులు బొట్టుగిలుకయిన్నియు
వలనుగ పంద్రెండు పద్యగుణితం
బయ్యెన్'

అని చెప్పగా ఇందలి వలపలగిలుక పరిహరించి, చెప్పబడని 'ఋ, ౠ'లు వాడారు. అట్లే 'పాదగోపనము'లో సాధారణముగా కనిపించే లాక్షణిక నిర్ణీతక్రమత పాటించలేదు. ఇట్లు శ్రీ విక్రాల కవి నిరంకుశత్వాన్ని నిరూపించుకొన్నారు. తృతీయ ప్రకరణములో దాదాపు పదునైదు బంధ కవిత్వ పద్యాలున్నాయి. వీనిలో కొన్నింటికి చిత్రములు గీయబడలేదు. అందువలన వాని నిర్మాణములోని క్లిష్టత, దాని నధిగమించుటలో కవిచూపిన నైనము పఠిత గుర్తించుటకు వీలులేకపోయినది. సీస పద్యము రథబంధమున నిముడునని వినుటయేగాని చూడవీల్పడలేదు. వీరి సాహస కార్యమును అతిచతురతతో నెరవేర్చినారు. నడిగడులలో 'కవిచతురాననశేషశర్మ'అని, చక్రములలో గడులప్రక్కన 'విద్యారణ్య పంచానన కవి రామచంద్రాచార్య' అని, వాని నడుమనిలువుగీరలలో 'సూను' అని ఇమిడించుటయే దీనికి తార్కాణము.

ఒకవైపు నామరూప గుణాత్మకమైన దైవభక్తిని నెలకొల్పుటేగాక, మరొకవైపు రచనల నచ్చొత్తించుకొనుటకు భాషాజీవులకు ధనసహాయము చేయుచు అక్షర పరబ్రహ్మము నారాధించు మహాశయమునకు కూడ కంకణము గట్టుకొనుచున్నది- తిరుమల తిరుపతి దేవస్థానము. ఈ గ్రంథ మాత్రికియారూప ఫలము. ఆంధ్రదేశమున అతివేలముగా తయారగుచున్న అవధానులకిది అధ్యయన గ్రంథముగానే గాక, ఆపత్కాలరక్షగా కూడ ఉపయుక్తమగు ననుట అత్యుక్తికాదు.

— ఆశావాది ప్రకాశరావు

శ్రీ వేంకటేశ్వరస్వామి

[రచయితలు: శ్రీమతి పి. రమాదేవి సీతాపతి, శ్రీ పి. సీతాపతి, ఐ. ఎ. యస్. క్రౌన్ 219 పుటలు మొదటి కూర్పు 1982: వెల 8; రూ. ప్రకాశకులు : వ్యాస ప్రచు(ర)ణాలయం. హైదరాబాదు-500044]

శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించడానికి తిరుపతి-తిరుమలకు పోయే జిజ్ఞాసువైన ప్రతి ఆస్తికుని చేతిలో తప్పక ఉండవలసిన "హస్తభూషణం" మంచి పుస్తకం, పుణ్యదంపతులయిన శ్రీమతి పి. రమాదేవి సీతాపతి, శ్రీ పి. సీతాపతి, ఐ. ఎ. యస్. గారలు రచించిన "శ్రీ వేంకటేశ్వరస్వామి'. ఈ పుస్తక పఠనం వలన ఇంతకుముందు చాలమంది ఎరుకలో లేని, సామాన్యంగా తిరుపతి వెళ్ళే భక్తుల దృష్టికి రాని, శ్రీ బాలాజీ శ్రీనివాస - వేంకటేశ్వరుని యథార్థ స్వరూపం సాక్షాత్కరిస్తుంది. సీతాపతి దంపతులు చరిత్రజ్ఞానము, భక్తి సంపద, కళాభిరుచి మేళవించి త్రివేణీ సంగమంగా ఈ గ్రంథాన్ని రూపొందించారు.

మొదట ఈ పుస్తకాన్ని ఇంగ్లీషులో శ్రీ సీతాపతి వ్రాసినారనిన్నీ, అది ఇప్పుడు సీతాపతి, వారి సతీమణి తెలుగుచేసినారని 'తొలిపలుకు'లో చెప్పివున్నారు. తెలుగులో వ్రాసేటప్పుడు ఇంగ్లీషు పుస్తకంలో ఇవ్వని శాసనాలు, శ్లోకాలు, ఇతర మౌలిక వాఙ్మయ ఆధారాలు ఉటంకించడం జరిగి, తెలుగు పుస్తకం, ఇంగ్లీషు గ్రంథానికన్నా మెరుగులు దిద్దుకొని, ఇతోధిక ఉపయోగాన్ని సమకూరుస్తున్నది.

ఈ గ్రంథంలో పదకొండు అధ్యాయాలు ఉన్నాయి; ఒక అనుబంధం ఉంది. అనుబంధంలో మట్ల కుమార అనంతరాజు, క్రీ.శ. 1628 ప్రాంతంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి చేయించిన కైంకర్యాలు తెలిపే శాసన మొకటి శ్రీ కృష్ణదేవరాయలు వేంకటేశ్వర స్వామికి సమర్పించిన తిరు ఆభరణాల, చేసిన కైంకర్యాల వివరాలను తెలిపే రెండు శాసనాలు ఇవ్వబడినాయి. విషయ సూచికలో 'అనుబంధము' క్రింద "ఆర్జితాల షెడ్యూలు - పుట 220" అని చూపివున్నారు. కాని పుట 220 లేదు, ఆర్జితాల షెడ్యూలు లేదు. అనుబంధం తర్వాత పుస్తకంలో చేర్చిన వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్లాను చక్కగా ఉండి, పుస్తకంలో వర్ణింపబడిన దేవాలయ ప్రాకార మంటపాది కట్టడాలను సులభంగా గుర్తించడానికి సహాయపడుతుంది.

మొదట అధ్యాయం'తిరుపతి-తిరుమల.' దీనిలో తిరుపతి-తిరుమల ఉనికి, ప్రాచీన తమిళ సాహిత్య గ్రంథాలలో దాని ప్రసక్తి, క్రీ. శ. 1628 ప్రాంతంలో స్వామివారిని చేరుటకు సోపానమార్గం కట్టించిన మట్ల అనంతకుమారరాజు ప్రశస్తి, తిరుమలకు ఈ సోపాన పంక్తి ననుసరించి పోయే నడకదారిలోని మంటప, విగ్రహ ప్రతిష్ఠాది విశేషాలు వివరంగా, ఆసక్తికరంగా తెలుపుతూ, ఈ గ్రంథకర్తలు యాత్రికుల అలసటను మరపించి, ఏడు కొండలు దాటించి శ్రీనివాసుని సాన్నిధ్యానికి చేరుస్తారు.

రెండవ అధ్యాయం 'ఆలయంలో శ్రీస్వామివారు' - ఈ అధ్యాయంలో ఆగమ శాస్త్రాలలో, శిల్ప శాస్త్రాలలో గల విష్ణు మూర్తి ప్రతిమా లక్షణాలను కొంత విపులంగా చర్చించారు. ఈ చర్చ అంతా

వేంకటేశ్వరస్వామిని దర్శింపబోయే సామాన్య యాత్రికునికి అనవసరమైనది, అతని అవగాహనకు అందుబాటులో లేనిది. శ్రీ వేంకటేశ్వర విగ్రహశిల్ప సౌందర్యాన్ని భారతదేశంలోని కొన్ని ప్రసిద్ధ విష్ణు మూర్తి శిల్పాల సౌందర్యంతో పోల్చి, 'నిజానికి ఈ మూర్తి భారతదేశంలోని అతి సుందరమైన విష్ణుమూర్తి అని నొక్కి చెప్పవచ్చును'' అన్నారు. స్వామివారి సౌందర్యాన్ని అలతి అలతి మాటలలో చక్కగా వర్ణించారు, వారి ప్రత్యంగ సౌందర్యాన్ని అన్నమాచార్యుల వారి కీర్తనలు, తరిగొండ వెంగమాంబ శ్రీ రమాపరిణయం మొదలగు గ్రంథాల నుండి పాటలు, పద్యాలు సందర్భోచితంగా ఉటంకిస్తూ వర్ణించారు. స్వామివారు విశ్వరూప దర్శనం వేళలో ఎలా కనబడుతారో, ఈ అధ్యాయంలోనే చూచాయగా తెలిపి, తరువాతి అధ్యాయంలో చర్చించే విషయానికి ప్రాతిపదిక ఏర్పరచారు.

మూడవ అధ్యాయం 'శ్రీస్వామివారి ప్రతిమను గురించి వాదోపవాదములు'. దీనిలో, శ్రీస్వామివారు మహావిష్ణు స్వరూపులా, లేక ఈశ్వరులా లేక మాతా స్వరూపమైన "బాలా' మూర్తియా అనే విషయాన్ని విపులంగా, సందర్భ సహితమైన ఆధారాలతో, మిక్కిలి నిష్పక్షపాత చారిత్రక దృష్టితో చర్చించారు. మతచరిత్రలో, మన దేవతా మూర్తుల వివిధ దశా పరిణామంలో ఆసక్తిగల ప్రతి వ్యక్తి తెలుసుకో దగ్గ విషయాలతో కూడింది ఈ అధ్యాయం. ఈ చర్చలో సీతాపతులు మిక్కిలి హేతువాద దృష్టిని కనపరచారు.

గర్భాలయంలోని ధ్రువబేరం (మూల విరాట్టు) గాక, శ్రీస్వామివారి వివిధ సేవలకు సంబంధించి ధ్రువబేరానికి ప్రత్యామ్నాయంగా పూజోత్సవాలందుకొనే వివిధ ఉత్సవమూర్తులనుగూర్చి, వాని ఏర్పాటును గూర్చి, శాసనాధారమైన కాల నిర్ణయంలో, 'గర్భాలయంలోని దేవతా మూర్తు'లనే నాల్గవ అధ్యాయంలో మనకు చక్కగా తెలియపరచారు.

అయిదవ అధ్యాయం, 'దెవాలయము, దేవాలయములోని శిల్పములు' అత్యంత ఆసక్తికరమైనది. దేవాలయ ప్రాకార కుడ్యాల లోపలగల గోపురాలు, మంటపాలు, ప్రదక్షిణా పథాలు, వివిధ దేవతా మూర్తుల దేవళాలు, కుడ్యశిల్పాలు, స్వామివారికి మనసు కరగిన మరోభక్తులైన శ్రీ కృష్ణదేవరాయాది విజయనగర చక్రవర్తుల ప్రతిబింబ శిల్పాల వివరాలు-వీటన్నిటినీ, దేవాలయ ముఖద్వార గోపురంనుండి మనలను చేయిపట్టి నడపించుకొనిపోయి 'టూరిస్టు గైడ్లు' అయి, తెలియచేశారు.

ఆరవ అధ్యాయం, 'వేంగడము - శ్రీస్వామివారి ఆలయము' లో 'వేంకట' శబ్దార్థ విచారం చేశారు. వెంకట శబ్దానికి ఒక కొత్త అర్థం, సంస్కృతంలో, ఇటీవలి పండితులు కల్పించారు. 'వేం: కటతీతి' అని 'వేం' అంటే పాపాలట ఎక్కడి ధాతువో, ఏమో. కాని వేంకట శబ్దము సంస్కృత శబ్దం కాదు. ఇది 'వెంగడం' అనే అరవపదం నుండి ఏర్పడింది. ఈ వెంగడానికి 'వెంగళ' పర్యాయపదం. ఈ అధ్యాయంలోనే, శ్రీస్వామిని వస్తువుగా తీసుకొని, వివిధ భాషలలో భక్తకవులు ప్రాచీనకాలం నుండి నేటివరకు వెలయించిన వాఙ్మయ విశేషాలు వివరించారు.

'ఆనందనిలయ విమాన' మనే ఏడవ అధ్యాయంలో, ఈ ఆనందనిలయ విమాన నిర్మాణము, ఎడనెడదానికి జీర్ణోద్ధరణము, పసిడిపూత చేయించినవారి వివరాలు, వీని కాలనిర్ణయము, శాసనాధారాలతో ఎరుకపరచారు. ఆనందనిలయ విమానంమీద కనిపించే విగ్రహాదులను వివరించారు.

'శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము' అనే ఎనిమిదవ అధ్యాయంలో, ఈ సుప్రభాత స్తోత్రానికి విమర్శనాత్మకమైన వివరణ, 'అందరికినచ్చే సహజ సామాన్యపు అర్థాన్ననుసరించి తాత్పర్యం ఇవ్వడం జరిగింది'. ఈ సుప్రభాత శ్లోకాలను రచయితలు చక్కగా ఇట్లా విమర్శించారు. "కొన్ని శ్లోకాలలో శివుని గురించి తదితర దెవతల గురించి ఉన్న వర్ణనలను బట్టి, ఈ శ్లోకాల రచయితకు వైష్ణవేతర దైవముల మీద ఉన్న విలువలతో సహా, ఆ కాలంలో వైష్ణవ శైవమతాల కున్న విరోధము మనకు సూచనామాత్రంగా తెలుస్తుంది." సుప్రభాత రచనా కాలాన్ని, చారిత్రక విమర్శనా దృష్టితో, పదునాల్గవ శతాబ్దంగా ఊహించారు.

'శ్రీ వేంకటేశ్వరస్వామి-పురాణగాథలు' అనే తొమ్మిదో అధ్యాయంలో, శ్రీ స్వామి వారి చరిత్రను, మాహాత్మ్యాన్ని తెలిపే పురాణ కథలను సంగ్రహంగా క్రోడీకరించారు.

పదవ అధ్యాయం, 'దేవాలయములోని ఉత్సవములు, నిత్యపూజా కార్యక్రమములు.' దీనిలో స్వామివారికి జరిగే బ్రహ్మోత్సవము, పవిత్రోత్సవము మొదలైన ఉత్సవాల పుట్టు పూర్వోత్తరాల వివరాలను, శాసనాధారాలతో అవి ఎప్పుడు మొదలయింది తెలిపారు. దేవాలయంలో కొన్ని ఆచారాలను, నిత్యపూజాకార్యక్రమాన్ని చక్కని క్రమంలో చెప్పారు.

క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్దంలో పల్లవుల పరిపాలన మొదలు పందొమ్మిదివందల అరవై ఆరులో ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ అండ్ హిందూరెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టము వరకుగల దేవాలయ పరిపాలనను గరుడదృష్టితో వీక్షించి, దానిలోని మార్పులను, చేర్పులను, శాసన, వాఙ్మయాధారలతో నిరూపించారు. నిధుల వినియోగాన్ని, దేవాలయ పాలకుల విధులను, పరిపాలనలో సాధించిన అభివృద్ధిని వరుసక్రమంలో అందించారు. ఈ అధ్యాయంలో దేవస్థానమువారి ఆదర్శములు అనే ఉపశీర్షిక క్రింద దేవస్థానమువారు శ్రీస్వామివారి భక్తులకు తృప్తికరమైన సేవచేయుటకు, ఇతోధికమైన సేవచేయుటకు కొన్ని చక్కని సూచనలను అందించారు. దేవస్థానంవారు వీనిలో కొన్నిటిని అమలు పరచినట్లున్నారు.

మిగిలిన వాటినికూడ యథోచితంగా స్వీక రిస్తారని ఆశిద్దాం.

అందరికీ అర్థమయ్యే సరళమైన, అక్లిష్టమైన శిష్టమైన భాషలో, ఎట్టి అన్వయకాఠిన్యం లేక, రచన సాగింది. అచ్చు తప్పులు లేవనే చెప్పాలి. తెలుగు పుస్తకంలో ఇది ఆశ్చర్యకరమయిన విషయం.

శ్రీ దివాకర్ల వేంకటావధానిగారి 'పరిచయము' గ్రంథంలోని విషయాలను చక్కగా సమీక్షించి గ్రంథంయొక్క వాసిని, రాసిని విలువకట్టింది. అవధానిగారు అన్నట్లు, ఈ గ్రంథము 'శ్రీ వేంకటశైల శ్రీ వేంకటేశ్వర స్వాములకు సంబంధించిన సమగ్ర విజ్ఞాన కోశ'మని చెప్పదగియున్నది.

పుస్తకంలోని ఆలయమంటపాదుల, విజయనగర చక్రవర్తుల ఫోటోలు స్పష్టంగా సందర్భోచితంగా ఉన్నాయి.

భక్తిసంపదను, చారిత్రక దృష్టిని, కళాభిరుచిని సమన్వయించి, మన దేవాలయాలను గూర్చి చెప్పిన పుస్తకాలు చాలా అరుదు; అట్టివాటిలో 'శ్రీ వేంకటేశ్వరస్వామి' అగ్రస్థానమాక్రమిస్తుంది. అందరి అందుబాటులోని వెలగల, ఈ వెల లేని పుస్తకాన్ని శ్రీస్వామివారి భక్తులందరు చదివి, స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆకాంక్ష.

—డా॥ సి. వి. రామచంద్రరావు

కృష్ణలహరి

రచయిత: డాక్టర్ ధారా రామనాథశాస్త్రి. క్రౌన్‌ఫుల్‌స్కేప్ సైజులో 20 పుటలు. వెల: 2-00. ప్రతులకు: మధుమతి పబ్లికేషన్స్, లాయర్‌పేట, ఒంగోలు - 523002.

'కృష్ణలహరి' పేరుతో శ్రీకృష్ణుడి లీలా విలాసాలను బాలకృష్ణ, శృంగారకృష్ణ, క్షాత్రకృష్ణ, దయాకృష్ణ, గీతాకృష్ణ అని ఐదు విభాగాలుచేసి వాటిని కొంత వచనంగా, కొంత గేయంగా వ్రాయసంకల్పించారు డాక్టరు ధారా రామనాథశాస్త్రిగారు. ఆ ప్రయత్నంలో వారిప్పుడు బాలకృష్ణను వెలువరించారు.

ఇందులో వున్నట్లుగానే కడమ భాగాలలో కూడ కథకుని కథాకథనం, మధ్యమధ్య పాత్రల గేయాలాపనం వుంటుంది.

ద్వాపరయుగంలో భూదేవి, దేవబృందం బ్రహ్మదేవుణ్ణి దర్శించి ధర్మభ్రష్టులైన రాజుల దుశ్చర్యలు విన్నవించుకుంటారు. బ్రహ్మ మనసు ద్రవిస్తుంది. ఆయన వీరినంతా వెంటబెట్టుకొని క్షీరసాగరం చేరుతాడు. అక్కడ అందరూ శ్రీమన్నారాయణుని స్తుతిస్తారు. స్వామి కరుణిస్తాడు.

అశరీరవాణి పలుకులునమ్మి కంసుడు కల్యాణదంపతులైన దేవకీవసుదేవులను చెరలోనుంచడం, వారక్కడ ఆరుమంది పిల్లలను కనడం, నారదప్రేరణతో కంసుడు వారిని చంపడం - భగవంతుని ఆదేశంతో దేవకి సప్తమ గర్భాన్ని యోగమాయ రోహిణీదేవి గర్భంలో ప్రవేశపెట్టడం, శ్రావణ బహుళాష్టమినాడు దేవకికి ఎనిమిదవ చూలుగా విష్ణువవతరించి తన్ను యశోద పొత్తిళ్ళలోనుంచి ఆమెకు జన్మించిన యోగమాయను కంసుని కత్తికి ఎరవేయమని వసుదేవునికి కర్తవ్యం బోధించడం, ప్రసూతివార్త తెలియగనే కంసభూపతి కారాగారానికి వచ్చి శిశువును బలాత్కారంగా ఎగురవేసి చంపబోగా ఆమె శైలపుత్రిగా దర్శనమిచ్చి తనతోపాటు పుట్టిపెరుగుతున్న వీరుడు నీ పాలిటికి మృత్యువని చెప్పి అదృశ్యం కావడం, బాలకృష్ణుని లీలలు- కంసవధ- ఉపనీతులై గురుసేవార్థం వెళుతున్న వేళలో రామకృష్ణులకు మధురానగర ప్రజల వీడ్కోలు- ఈ ఇరవై పొరటల చిరు పొత్తంలో సంగ్రహంగా సరసంగా వర్ణించడం జరిగింది. ఇది ఒక చిన్న గోష్ఠి రూపకం.

తనకు జన్మించిన ఆ విశ్వమోహన బాలకుని హృదయానికి హత్తుకొని దేవకి విలపించిన తీరు ఎంతో హృద్యంగా శాస్త్రిగారు రచించారు.

'ఎన్ని జన్మల నోములో ఫలియించి
నిన్ను కన్నాను తండ్రీ
నిన్ను మాత్రము కంసుడూ నాకెట్లు
దక్కనిచ్చును నాయనా
ఏడుమారులు వరుసగా నాతండ్రి
ఏడుపునె కంటిరన్నా
కడుపు పండిన గడియలే దేవకికి
కడుపు మండిన గడియలూ'

చివరి రెండు బంతులలో కవిత్వం గుప్పుమని గుబాళిస్తున్నది. మాతృసహజ వాత్సల్యంతో కుమారుణ్ణి దేవకి లాలించిన వైనం శ్రీరామనాథశాస్త్రి చక్కగా వర్ణించారు.

'ఎల్లలోకాలనేలే నాస్వామి
పొత్తిళ్ల పాపవైతీ
ఎల్లకాలము నిట్టులే నాయింట
ఆడిపాడంగవలయూ
లాలపోసేను తండ్రీ నీకిపుడు
పాలుపోసేను తండ్రీ
కురులు దువ్వేను తండ్రీ నీ నుదుట
తిలకమద్దేను తండ్రీ
రార దేవకి నందనా రావయ్య
వసుదేవరాజతనయా'

పదిమంది పాడుకోడానికి అనువుగా అంత సహజమైన, సుందరమైన జానపదశైలిలో నడిచింది పుస్తకమంతా. వెల సులభం కాకపోయినా ఫల మధికం.

— శ్రీవత్స

శ్రీహరినామ మహిమశతకం

రచయిత: శ్రీ బండినాగరాజు

ప్రాప్తిస్థానము: లెక్చరరు, గవర్నమెంటు జూనియర్ కాలేజి, విడవలూరు (నెల్లూరుజిల్లా)

వెల: తెలియదు.

ఆధ్యాత్మికసాధనలో భక్తిమార్గానికున్న ప్రాముఖ్యం సాటిలేనిది. గీతలో భగవానుడు అనన్యభక్తికిగల ప్రాధాన్యాన్ని వర్ణిస్తూ-

భక్త్యా త్వనన్యయా శక్య
అహమేవం విధోఽర్జున!
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన
ప్రవేష్టుం చ పరంతప!

అని చెప్పాడు. భగవత్ప్రాప్తికి అనన్యభక్తి ఒక్కటే తగిన సాధనమని దీని భావం.

శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అని నవవిధ భక్తి మార్గాలను శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి. కలికాలంలో భగవన్నామ సంకీర్తన సులభాతిసులభమైన తరణోపాయంగా పేర్కొనబడింది.

నారదుడు ద్వాపరయుగాంతంలో బ్రహ్మ చెంతకువెళ్లి కలిని తరించే ఉపాయం బోధించమని ప్రార్థించాడు. అప్పుడు చతుర్ముఖుడు నారాయణుని నామోచ్చారణమే కలిసంతరణానికి తగిన ఉపాయమని చెప్పాడు. ఆ నామమేదో సెలవిండని మళ్లీ నారదుడు ప్రశ్నిస్తే- బ్రహ్మదేవుడు-

హరే! రామ! హరే! రామ!
రామ! రామ! హరే! హరే!
హరే! కృష్ణ! హరే! కృష్ణ!
కృష్ణ! కృష్ణ! హరే! హరే!

ఇతి షోడశకం నామ్నాం
కలికల్మషనాశనమ్।
నాతః పరతరోపాయః
సర్వవేదేషు దృశ్యతే॥

అని చెప్పాడు. హరినామ సంకీర్తనం కంటె మేలైన కలికల్మషాన్ని తొలగించే ఉపాయం వేదాలన్నిటా ఎక్కడాలేదని బ్రహ్మ అభిప్రాయం. ఈ సంగతి అష్టోత్తర శతోపనిషత్తులలో ఒక్కటైన కలిసంతరణోపనిషత్తులో ఉంది.

'ఏతావతాఽల మఘనిర్హరణాయపుంసాం
యత్కీర్తనం భగవతో గుణకర్మ
నామ్నామ్।'

అని భాగవతంలో వ్యాసుని మాట. అంటే భగవంతుని గుణకర్మనామాలను కీర్తించడం వల్ల పాపాలన్నీ పటాపంచలవుతాయని తాత్పర్యం.

ఈ విధంగా శ్రుతులూ, స్మృతులూ, పురాణాలూ ముక్తకంఠంతో నామసంకీర్తన మహిమను వర్ణిస్తున్నాయి.

క్రీ. శ. 16వ శతాబ్దిలో అవతరించిన శ్రీకృష్ణచైతన్యస్వామీజీ నామసంకీర్తనాత్మకమైన ఈ భక్తిమార్గానికి అనన్యసామాన్యమైన ప్రచారం కలిగించారు. అందుకే ప్రకృతశతకంలో-

శ్రీచైతన్యః కృపాసింధు
ర్భగవాన్ భక్తవత్సలః।
కృపయా దత్తవానేత
ద్ధరే ర్నామైవ కేవలమ్॥ (91)

అని శ్రీచైతన్యులు భక్తులకు హరి నామాన్ని దయతో ప్రసాదించినట్లు చెప్పబడింది.

శ్రీచైతన్యుల తర్వాత ఆయన అనుయాయులు ఈ మార్గాన్ని అనుసరిస్తూ వచ్చారు. ఇటీవలి కాలంలో శ్రీ ప్రభుపాద స్వామి స్వదేశంలోనేకాక విదేశాలలోకూడా 'హరేకృష్ణ' ఉద్యమం ద్వారా ఈ మార్గానికి చక్కని వ్యాప్తి కలిగించారు.

శ్రీచైతన్య సంప్రదాయానికి చెందిన శ్రీ నీలకాంత గోస్వామీజీ 100 శ్లోకాలలో హరినామ మహిమను అత్యద్భుతంగా వర్ణించారు. వారి కృతి 'శ్రీ హరినామ మహిమ శతక' మనే పేరుతో ప్రసిద్ధి గాంచింది. చివరిశ్లోకం లోని 'నీలకాంతత మోనుదమ్' అన్న పదంలో రచయిత స్వనామనిర్దేశం చేశారు. ఈ శతకం భక్తి మార్గానుయాయుల్లో బహుళప్రచారం పొందింది.

విద్వత్ప్రముఖులు, విమర్శకాగ్రేసరులు, కవివర్యులు శ్రీ బండినాగరాజు గారు శ్రీ హరినామ మహిమ శతకాన్ని తేటగీతలలో చక్కగా అనువదించారు. విద్యార్థి దశలోనే వీరి శతకానువాదం పూర్తిచేశారు. రచనానంతరం ఇంచుమించు 25 సంవత్సరాల తర్వాత ఈ కృతిని వెలుగులోకి తేవాలన్న సత్సంకల్పం వారికి కలిగింది. పాఠకలోకం తరపున వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇందలి అనువాదమెంత రుచిరంగా సాగిందో ఒకటి రెండు ఉదాహరణలు చూపి విరమిస్తాను.

రంజనం సర్వచిత్తానాం
భంజనం పాపభూభృతామ్।
గంజనం చిత్తభోగానాం
హరేర్నామైవ కేవలమ్॥

చిత్తములనెల్ల రంజింపఁజేయునదియు
పాపభూధరముల భంగపరచునదియు
మదిని భోగవాసనలను మాడ్చునదియు
పావనము హరినామమ్ము కేవలమ్ము.

* * * *

ఆత్మనా వంచితో హ్యాత్మా
తేన పుంసా దురాత్మనా।
న నీతం హేలయా యేన
హరే ర్నామైవ కేవలమ్॥

పుడమిని దురాత్ముడై నట్టి పురుషుఁడరయ
తన్ను వంచించుకొనుచుండు తానె యకట।
హేళనమునకు నైన రానీడు నాల్క
పావనము హరినామమ్ము కేవలమ్ము.

పరమపావనమైన ఈ శతకానికి సరళ సుందరమైన అనువాదం కావించి భక్త జనుల కృతజ్ఞతకు పాత్రులయిన శ్రీ బండి నాగరాజుగారిని మనసారా అభినందిస్తున్నాను.

—సముద్రాల లక్ష్మణయ్య

ఆగ్నేయ ఆసియాలో హైందవీకరణ

ఆగ్నేయ ఆసియా' అనే పదం రెండవ ప్రపంచ సంగ్రామ సమయంలో ఐరోపా వాసులచే మొదటిసారి వాడబడింది. దీన్ని ప్రాచీనకాలంలో సువర్ణభూమి అని (బర్మా థాయిలాండ్, కంపూచియా, లావోస్, మలేషియా, వియత్నామ్) సువర్ణ ద్వీప మని (ఇండోనేషియా) పిలిచారు. భారత ఆగ్నేయఆసియాసంబంధాలు చరిత్రపూర్వ యుగం నుండి ప్రారంభమైనాయి. మొదట భారతీయవ్యాపారులు ఆగ్నేయ ఆసియారేవులో వ్యాపార స్థావరాలను నెలకొల్పారు. అదేవిధంగా ఇండోనేషియా వ్యాపార స్థావరాలలో మలబార్ తీరంలో, ఉన్నట్లు పేర్కొన బడింది. కాబట్టి రెండు ప్రాంతాల్లో వ్యాపార సంబంధాలు ఏర్పడిన పిదప భారతీయ సంస్కృతి విస్తరణ జరిగింది.

ఈ సంస్కృతి విస్తరణను హైందవి కరణ అంటారు. కాని ఆగ్నేయ ఆసియాలో థేరవాద (హీనయాన) బౌద్ధమతం ముఖ్యంగా ప్రభావితం చేసింది. హీనయాన బౌద్ధం బర్మా, థాయిలాండ్, కంపూచియా దేశాలలో ముఖ్యమతం. మధ్యయుగంలో ఇండోనేషియాలో, మలేషియాలో ఇస్లాంమత విజృంభణతో హిందూమతం మరుగున పడింది. కానీ బౌద్ధమతం చిరస్థాయిగా నిలిచి పోయింది. హిందూ మతము నుండి ఆవిర్భవించిన ఉపశాఖయే బౌద్ధమతం అని వక్కాణించినమాక్స్‌ముల్లర్‌తోను, 'యూదు మతము నుండి క్రైస్తవ మతము ఆవిర్భవించింది.' అని చెప్పిన ఆచార్య కీనే అభిప్రాయంతో ఏకీభవించిన భారత సంస్కృతివిస్తరణను హైందవీకరణ అనడంలో తప్పులేదు.

వ్యాపార సంబంధాల కారణంగా సువర్ణ ద్వీపంలోను సువర్ణభూమిలో వెలసిన రాజ్యాలు భారత, మత, ఆచార అలవాట్లను పాటించారు. సంస్కృతాన్ని పవిత్రభాషగా పరిగణించారు. వ్యాపారుల తరువాత మత బోధకులు, అర్చకులు, దేశములకు ప్రవాసం వెళ్ళారు. వీరి రాకతో సంస్కృతి విజృంభణ ప్రారంభ మయింది. ఈ విస్తృతిని కొన్ని అంశాలుగా పరిగణింప వచ్చును. హిందూ, బౌద్ధం పాటించడం సంస్కృతభాష ద్వారా సారస్వతప్రసంగాలు, ఇతిహాసాలు, పురాణాల నుండి కర్మ సిద్ధాంతాన్ని గ్రహించడం పవిత్ర హైందవ న్యాయ శాస్త్రమైన మను ధర్మశాస్త్రాన్ని ఆచరించడం మొదలైనవి. మొదటి సారిగా ఆర్యసంస్కృతి విస్తరింప బడింది. కాని ఈ సంస్కృతికి సువర్ణ ద్వీప భూమి ప్రజలు క్రొత్తవారు కాదు. అందువల్ల వారు త్వరగా హిందూ ఆచారాలకు అలవాటుపడి హైందవ సంస్కృతివ్యాప్తికి కృషి చేసారు.

"ఆగ్నేయ ఆసియా" నాగరికతపై భారతీయ సంస్కృతి ప్రభావాన్ని తెలుసుకోడానికి తగిన ఆధారాలు మనకు లభ్యం కావు. కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం ఈ వ్యాప్తి క్రీస్తు పూర్వము నుండి ప్రారంభమైనదని తెలుసుకొన వచ్చు. క్రీ. పూ. 300 సంllములో మౌర్య చంద్రగుప్తుడు ఉత్తర దేశాన్ని జయించినపుడు అనేకమంది సువర్ణ భూమికి ప్రవాసం వచ్చినారని, వారితో పాటు హైందవమతం కూడా ప్రవాసం వెళ్ళిందని అర్థశాస్త్రంవల్ల తెలుస్తున్నది.

రామాయణంలో సుమిత్ర, జావాదీవులు పేర్కొన బడినాయి. కాని రామాయణ మెప్పుడు, ఎవరిచేత క్రోడీకరించినది మనకు తెలియదు.

చైనీయుల రచనలవల్ల ఆగ్నేయ ఆసియాలోని మొదటి హిందూరాజ్యం ఫ్యూనాన్ అని చెప్పవచ్చు. ఇది క్రీ. శ. మొదటి శతాబ్దంలో హైందవబ్రాహ్మణుడైన కౌండిన్యుని చేత స్థాపించ బడింది. చైనాలోని వోయి రేవుపట్టణం ఆ నాటి ముఖ్య రేవు. ఫ్యూనాన్‌లో లభ్యమైన శాసనాల ద్వారా చైనావారితో కూడ తొలి సంబంధాలు ఉండేవని తెలుస్తున్నది. చైనీయుల రచనల ఆధారంగా మలయాద్వీప కల్పంలో హిందూరాజ్యాలు వెలసినాయని చెప్పవచ్చు. మీనామ్ నదీప్రాంతంలో (థాయిల్యాండ్స్) లభ్యమైన గుప్తశైలిలో ఉన్న బౌద్ధ విగ్రహాలు, క్రీ. శ. 2 నుండి 5వ శతాబ్దానికి చెందినవి.

క్రీ. శ. 5వ శతాబ్దికి పూర్వమే బర్మాకు, భారత దేశానికి సంబంధాలున్నాయి. అశోకుడు, సోన, ఉత్తర అను బౌద్ధమతాచార్యులను సువర్ణభూమికి పంపినట్లు శాసనాల వల్ల తెలుస్తున్నది. సువర్ణ ద్వీపంతో కూడా క్రీ. శ. 5వ శతాబ్దం నాటికి సంబంధాలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో లభ్యమైన ఆధారాలద్వారా తెలుస్తున్నది. వాయు పురాణంలో పేర్కొన్న బరిహిక ద్వీపమే బోర్నియో. బోర్నియో పాలించిన మూలవర్మ వేయించిన మౌరాకామన్ శాసనాల ద్వారా హిందూమత సంప్రదాయాల ప్రభావము విశదమగు చున్నది. కెడై సెలబీన్, ప్యాలమ్‌బాగ్‌లో లభ్యమైన అమరావతి శైలిలో ఉన్న బౌద్ధవిగ్రహాలు, సార్విక్ దీవిలో లభ్యమైన శివలింగాలు, గుప్త శైలిలో ఉన్న బౌద్ధవిగ్రహాల ద్వారా క్రీ. శ. 5 వ శతాబ్ది నాటికి సువర్ణ ద్వీపానికి భారత దేశమునకు సంబంధాలున్నాయని తెలుస్తున్నది.

సంస్కృతి ప్రవాసాన్ని పరిశీలిస్తే ఇది సంస్కృతి సమ్మేళనము అని చెప్పవచ్చు. హైందవసంస్కృతి శాంతియుతంగా ప్రవేశ పెట్టితే, శీఘ్రగతిన స్వీకరించడం జరిగింది. ఇది రాజకీయ వ్యాప్తి చేయ లేదు. పర మత సహనమే హైందవజాతికి ఆణిముత్యం.

ఆగ్నేయ ఆసియాలో జరిగిన హైందవ సంస్కృతి వ్యాప్తికి అనేక జాతక కథలు ఉన్నాయి. విదేహయువరాజు తన తండ్రి పోగొట్టిన రాజ్యాన్ని తిరిగి సాధించడానికి తల్లి అనుమతితో సువర్ణభూమికి వెళ్ళి ధనాన్ని సంపాదించి స్వదేశానికి వచ్చి పూర్వ రాజ్యాన్ని సంపాదించాడని కథనం.

వారణాసికిసమీపంలో నివసిస్తున్న వేయి వడ్రంగి కుటుంబాలు ఒక నావను నిర్మించి అందు సువర్ణభూమికి తరలిపోయి అచ్చట వారు స్థిర పడ్డారట. ఈ విధమైన జాతక కథలు, బౌద్ధమత గ్రంథాలలో ఉన్నాయి. సువర్ణభూమికి హిందూ దేశస్థులు సముద్ర యానం చేసినట్లు చెప్పడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. బెంగాలులోని తామ్రలిప్తి అనే రేవుపట్టణం, ఒరిస్సాలో గంజాం దగ్గర ఉన్న పాలూరా రేవు, ఆంధ్రలో మచిలీపట్టణం రేవులు ఈ ప్రవాసానికి తోడ్పడ్డాయి. సముద్ర మార్గాలే కాక భూ మార్గాలు కూడా ఆనాడు ఉండేవి. తూర్పు బెంగాలు, మణిపూర్, అస్సాం గుండా సువర్ణభూమికి వెళ్ళారు. భారత దేశానికి చైనాకు, బర్మా, టోన్కిన్‌ల మీదుగా వ్యాపారం జరిగెడిది.

యున్నాన్ స్థావరాన్ని గాంధార అని వ్యవహరించారు. ఎగువ బర్మాలో హిందువులు ప్రామ్ శ్రీక్షేత్ర, పెగు మొదలగు రాజ్యాలు స్థాపించబడ్డాయి. ॥ ఉదా ॥ శ్రీ విజయ, శైలేంద్ర, మజాపహిత్, పై రాజ్య స్థాపనలకు సంబంధించిన బౌద్ధ జాతక కథలు అనేకం ఉన్నాయి.

ప్రపంచ దేశాలలో ప్రాచీన నాగరికత కల్గిన దేశాలలో భారతదేశం ఒకటి. అదే విధంగా మొదటిగా విదేశాల్లో స్థావర మేర్పరచు కొన్నది భారతదేశం. కాని మిగతా దేశాల స్థావరాలు వ్యాపారార్థంకాగా భారత దేశ స్థావరం సాంస్కృతిక పరమైంది. ఆగ్నేయ ఆసియాకు హైందవ సంస్కృతి భారతదేశమునుండి ఎట్లువ్యాప్తి చెందిందో, ఇస్లాంమతం కూడా భారతదేశం నుండే వ్యాపించింది. ఇది భారతదేశపు గొప్పతనం. ఇస్లాంమత వ్యాప్తితో ఆగ్నేయ ఆసియాలో హైందవ సంస్కృతి స్థానంలో ఇస్లాం చోటు చేసుకుంది. కాని బౌద్ధమతం తన స్థానాన్ని కాపాడుకొంది. *

— శ్రీ కొమ్మూరి శివప్రసాద్

[32 పెజి తరువాయి]

నికి లక్ష్యభూతాలుగా ఆ సేతుహిమాచలం ఆక్రమించివున్నాయిగదా! ఇవన్నీ ముదిమది తప్పిన చేష్టలనుకోవాలా? మదంకదను త్రొక్కగా తేలిన రూపాలనుకోవాలా?

ఇటువంటి ఆలయశిల్పాలు కేవలం హిందూదేవాలయాలకే పరిమితం కాలేదు. మగ కచ్ఛ బిగ్గ కట్టుకొన్నామనుకున్న జైన బౌద్ధ దేవాలయాలు కూడా దీనికి లోనుగాక తప్పలేదు.

ఇవన్నీ అనుకూల ధర్మాలా? నెగ్గిన ప్రతికూల పవనాలా?

సరే ఇంతవరకు కన్పించినవి లౌకిక తత్త్వాలకు సంబంధించిన సామాజిక పరిణామ విశేషాలనుకొందాం.

దేవాలయాలన్నిటికీ ఆగమాలు ఆధారభూతాలు. సురసుందరుల ప్రతిమల, శృంగారశిల్పాల నిర్మాణం అవశ్యాచరణీయంగా అవి విధించాయిగదా! కనుక ఇటు లౌకికంగాను, అటు పారమార్థిక, పారమాత్మిక ప్రయోజనకరంగాను మహత్తర సందేశాన్ని సమాజానికందిస్తూ ఇలా పొందుపరచారనే అనుకోవాలి............

నిర్గుణుడు, నిరంజనుడు, నిశ్చల జ్యోతిస్వరూపము ఐన పరబ్రహ్మం నుండి స్వసంకల్పంవల్ల సర్వమోహకమైన మాయ వెలువడి సత్త్వరజస్తమో గుణాత్మకమైన ప్రకృతిగా విహరించి, ఆ పరమపురుషుని హృదయాన్ని హరించి, తిరిగి మూలస్వరూపంలో లయమైపోయింది. ఆ లయమప్పుడు కల్గిన ఆనందం త్రిగుణాతీతమైంది. అనిర్వచనీయమైనది. మాయ లయంకాగా మిగిలిందేదీలేదు, కనుక ఆ స్థితినే ప్రళయం అన్నాం. ఆ ప్రళయానంతరం, పారమాత్మిక పునస్సంకల్పంవల్ల ఆ ప్రకృతి రూపమైన సృష్టి యథారూపం జరిగింది.

మరి మానవుడు ఆ పరమపురుషుని స్థూలరూపం. సర్వాంతరాత్మ ఐన ఆ పరమాత్మ ఆడించినట్లు ఆడితేనేగాని ఈ సృష్టి సాగదు. స్త్రీ పురుష సంయోగ సంలీన తాదాత్మ్యం వల్లనే సృష్టి జరుగుతున్నది. అందువల్లనే దీన్ని మహత్తర యజ్ఞంగా పవిత్రకార్యంగా భావించటం జరిగి, దానికి గృహమేధం అనే పేరు కూడా ఏర్పడింది. రఘువు మొదలు రాఘవులదాకా 'ప్రజాయై గృహమేధినాం' సంతానం కోసమే గృహయజ్ఞం చేసినట్లు మహాకవి కాళిదాసు అన్నారు. చతుర్విధ పురుషార్థాలలో 'కామాన్ని' చేర్చి ధర్మబద్ధంగా సేవించవలసిందిగా సెలవిచ్చారు ప్రాజ్ఞులు! ఇవన్నీ ఇలా ఉంచి అటు పది, ఇటు పది తరాలవారు శాశ్వత బ్రహ్మలోకాన్ని చేరేందుకని, కన్యాదాత వరుని మహావిష్ణు స్వరూపంగా భావిస్తూ కన్యాదానం చేయటం మన మెరుగుదుము. అంటే ఆ పూర్వ సృష్టికి ఇది ప్రతిరూపముగా భావిస్తూ పరమపురుషుడని అర్చించుకోవటం అన్నమాట.

సత్సంతానమువల్ల తరతరాలవారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని మన వాఙ్మయం చెపుతుంది.

ఇలా జగన్నాటక రంగంలో అన్ని హంగులు సింగారించుకున్న జీవుడు తనలోని దేవుణ్ణి తానెటూ చూచుకోలేడు కనుక గుడికట్టి తనవన్నవాటిని తనవిగావని సర్వసమర్పణ భావంతో అందరిలో వుంటూ ఆ గర్భగృహంలోవుండే పరమాత్మ పాదాల కర్పిస్తున్నాడు. అహంకార మమకార త్యాగంగా నీలాలు, నిలువుదోపు సమర్పిస్తున్నాడు. శరణాగతుడనని సాగిలబడి మ్రొక్కి సాష్టాంగప్రదక్షిణం చెల్లిస్తున్నాడు. జగన్నాటక రంగంలో తనపాత్ర సింగారానికి గాను నేర్చుకున్న విద్యలన్నీ యథాశక్తి యథాభక్తి సమర్పిస్తున్నాడు. తనకు తెలిసినవనుకొన్నవి తెలియ చెప్పాలన్న తపన కూడా లేకపోలేదు. ఐతే అర్చనకు అర్పణకు అందనిదీ అనాదిగా వస్తూ అతి స్వల్పమే ఐనా, అలౌకికానందాన్ని ప్రసాదించేదీ, శృంగారప్రక్రియ ఒకటి ఉంది.

మానవుడు,'శృంగార ఏవ ఏకోరసః' అని భోజుడు చెప్పినట్లు దానికి సంబంధించిన ఆనంద విధానాలను జీవితానుభవాలకు జోడించి ఆలయ ప్రాంగణాలను అలంకరించాడు.

జాయపసేనాని నృత్తరత్నాకరానికి రామప్పగుడి ఆకరమైందన్నా ధర్మావిరుద్ధ కామకళ కళకళ లాడిందన్నా ఇదే కారణం.

పైగా తంత్రశాస్త్రం ఏకలక్ష్యరూపకమైన స్త్రీ పురుషతాదాత్మ్యం పరతత్త్వావహగాహనకు రాచబాటగాకూడా వర్ధిల్లోంది. సమాజ క్షేమానికి భంగం రాకుండా సుప్రజార్థం గృహమేధంలోని భాగస్వాములు పారమాత్మికానంద బిందుసంసేవనలో పాల్గొనే విధానాలను గుడిగోడలపైన గుర్తుపెట్టారు.

అందులోను తమ ప్రవృత్తుల కనుగుణముగా కాక తరతరాలుగా ఋషితుల్యులనేకులు నిగ్గుదేల్చిన శాస్త్రానికి లక్ష్య భూతాలుగా చెక్కటం, చిత్రించటం ఆసేతుహిమాచలం సాగింది, ఆనాటి సమాజాలు హర్షించటం జరిగింది. సమాజ సంక్షేమానికిది అవరోధం, అనుకొనిఉంటే జైన బౌద్ధారామాల మాదిరిగానే మంగళగీతం పాడేవారు.

అంటే అనాదిగా జీవ,జీవన లోకధర్మాన్ని, అనుష్ఠించిన విధానాన్ని పరిశీలించి, శాస్త్రంగా రూపొందించి దాన్ని రసాస్వాదైక దృక్కులకు రససమంచితంగా అందజేశారని అనుకోవాలి.

అయితే అన్నీ లక్ష్యలక్షణ సంబద్ధంగా వున్నాయనేందుకు వీలులేదు. 'బ్రహ్మకైనను బుట్టురిమ్మతెగులు' అన్నట్లు ఊహావికారభూతాలు కొన్ని వుండవచ్చు. అంతమాత్రాన పరమార్థాన్ని శంకించాల్సిన అవసరంలేదేమో!

సరే, వాటినలా తగలడనీ. మనం పాము కొనేదేమిటి అనేది ప్రశ్న? మన తరతరాల జీవన విధానాన్ని తాత్త్విక ఆదర్శాలను పరిశీలిస్తే పలుకోణాలలో సమాధానాలు మనను పలుకరిస్తూ వస్తై.

అన్నిటికీ మూలం సంగం. దానివలన కామం, క్రోధం, సమ్మోహం, బుద్ధినాశం. ఇదీ- వివేకభ్రష్ట సంపాత పరంపర. విషయ

లోలుపమైన కామం ఎంతో బలీయమైనదనీ, అది అడుగడుగునా అవస్థా, ఆశ్రమ, ఆకార భేదాలు లేకుండా వెన్నాడుతూనేవుంటుందని, ఆధ్యాత్మికంగా పురోగతి సాధించుకోదల్చుకున్నవారు కామజితులు కాకుండా జితకాములయ్యేందుకు ప్రయత్నించాలని, మన ప్రయత్నాలలో మొదటగా ఎదురయ్యేది, కడదాకా వెంటవుండేదీ, మనం కడతేర్చవలసిందీ ఈ కామమేనని తస్మాత్ జాగ్రతః జాగ్రతః అని హెచ్చరిస్తూవుంటాయి ఈ శిల్పాలు.

ఇక దేవాలయాలు సర్వకళానిలయాలు. ఆ యా సమయాల సమాజాల వృత్తులు, ప్రవృత్తులు, అభిరుచులను కంటికి కన్పించింది కన్పించినట్లు పరిపూర్ణ నిష్పాక్షిక దృష్టితో పదిలపరచటం జరిగింది. తరతరాల చరిత్రను సంతరించుకొన్న ఇవి, మనం పదిలపరచుకోవలసిన అక్షరభాండారాలు. ఈ దృష్టితో చూస్తే వివిధాలయాలలో శృంగారశిల్పభావనలోను, బంధనలోను క్రమక్రమాగత వ్యత్యాసాలు వాటి వాటి వికృతులతో సహా మనకు అధ్యయనీయాంశాలౌతాయి.

'ధర్మావిరోధేనకామంసేవేత' అన్నారు పెద్దలు. అంతేకాదు, వ్యాయామనాట్య శాస్త్రాలు కూడా ఇందులో ఇమిడి వున్నాయని మరికొందరంటున్నారు. ఒకనాటి సమాజంలో స్త్రీలు కేవలం పాచన గృహబద్ధ జీవులుగా కాక సర్వకళా విశారదలుగా ఉండాలని, గృహమేధంలో గృహిణీపాత్ర చాలా గొప్పదని 'కార్యేషు దాసీ....షట్కర్మయుక్తా కులధర్మపత్నీ' అనటంలో శృంగార శాస్త్రపరిజ్ఞానం కూడ చేర్చబడిందేమోనని పిస్తుంది. అలాంటి సందర్భంలో ఈ ఆలయ శిల్పాలు సమారాధనకు సింగారించిన సాలభంజికలై రచ్చకెక్కి నిల్చి గుట్టుగా బోధిస్తున్నాయి. వర్తమాన సమాజంలో ఒక ప్రక్క తీసి కావాలంటున్నాం, తెచ్చి పెట్టిన దాన్ని ఇదికాదు పొమ్మంటున్నాం.

ఇవన్నీ ఇలావుంచి, మన ఆలయదేవతా చరిత్రలో ముఖ్యమైనవి రెండు జంటలే. క్షీరసాగరంలో శేషశయనంపై, ప్రపంచాన్ని చిత్తగిస్తున్న లక్ష్మీనారాయణులు, చలిమల కొనలో రసఝరితటిని బిగికౌగిలి లేలే కామేశ్వరీనటరాజులు.

అపార సంసార సాగరంలో సంతతానంత సమస్యానంతశయనుడై మంగళదేవత లాంటి తన అర్ధాంగితో జగన్నాటకంలో తనపాత్రను నిర్వహిస్తూ నరుడు నారాయణుడుకావాలని, తలిస్తే గడగడవణికించి గడ్డకట్టించే భవసానువుల నడుమ నడయాడుతూ, ఇంద్రియోన్మాదహాలాహలాన్ని కంఠగతంచేసుకొనికూడా, అర్ధాంగికి ఆనందానుభూతి కలిగించి పరమశివ పర్యంక ప్రణయినీ పరతత్త్వావగాహనలో అభవత్వం (జన్మరాహిత్యం) పొందాలనికోరే స్త్రీ పురుష రూప జీవుల ఏకాత్మతారాధనా ప్రతిరూపాలే మనకు దర్శనమిచ్చే ఆలయసాలభంజికలు.

ఆ పరతత్త్వాన్ని అందుకోమనే అందరూ చెప్పేది. పురుషరూప పరతత్త్వారాధనకు మంత్రశాస్త్రం, మహామాయారూప పరతత్త్వారాధనకు వివిధ తంత్రాలు ఏర్పడ్డాయి. సమాజానికి ప్రమాదం కల్గించని ఏప్రక్రియ ఐనా ప్రమోదమే ఔతుంది. లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం వ్రాసిన శంకరభగవత్పాదులే ఇలా అంటారు...............

సుధాసిన్ధోర్మధ్యే సురవిటపివాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చిన్తామణిగృహే
శివాకారే మఞ్చే పరమశివ పర్యఙ్క నిలయాం
భజన్తి త్వాం ధన్యాః కతిచన చిదానన్ద
లహరీమ్.

ఇంతటి ఆలోచనను కల్గిస్తున్న వాటిని పనికిమాలినవనటం ఏమంతసమంజసం? మన కిష్టం లేదు కనుక వాటి చావు వాటిని చావనిస్తే మన అభిరుచులకు తగ్గట్టు మనం కట్టుకోవచ్చు. ఎలకలున్నాయని ఇంటికి నిప్పు పెడితే...........

చురుక్కుమంది. ఎప్పుడు వచ్చాడో అప్పారావు, దెప్పిపొడుస్తూన్నాడు, వేలితో పొడుస్తూ. "ఇదా నువుచేసే నిర్వాహకం. పిల్లల్ని చూస్తుండరా అంటే బొమ్మల్ని చూస్తున్నావా? అయినా నిన్నని ఏంలాభం? ఇంకానయం ఎవరన్నా ఎత్తుకు పోయారు కాదు!"- వాళ్ళావిడ రాలేనందిట. తానే ఇద్దరుపిల్లల్ని చెరొకప్రక్క ఎత్తుకొని, వెనక్కి తిరిగి చూడకుండా నడిచి వెళ్తున్నాడు అప్పారావు కాకపోతే కాస్తతూలుతూ. *

"నాగరాజ్"

కీర్తన

కొండంత దేవుడవు కొండపై నీవుండ
అండ కొరకన్యులను అర్థింపనేల ॥కొం॥

దండిగా సంపదల దయచేయు శ్రీమాత
నిండుగా నీహృదిని నివసించియుండ ॥ ॥కొం॥

ఆదిశక్తివి నీవె హరిహరాదులు నీవె
ఆద్యంతములులేక అలరుస్వామివి నీవె
మమ్ములను పాలించు మహితాత్ముడవు నీవె
ఓంకార రూపుడవు ఓ! తిరుమలేశా ॥ ॥కొం॥

— పొన్నలూరి లక్ష్మీనరసింహం

(28వ పేజి తరువాయి)

తరువాత సినీ నేపథ్య గాయకుడు శ్రీ ఆనంద్, కుమారి మండపాక శారద తమ ఆర్కెస్ట్రా సహాయముతో అన్నమయ్య కీర్తనలూ; దిగిరారా; దిగిరారా; రావాలనిఉన్నది కొండకు అన్న పాటలు తన్మయతతో పాడి శ్రోతలను పరవశింప చేశారు.




ముగింపురోజున అనేక వేలమంది ప్రజలు ఉత్సవాలను చూడరావటం ఒక విశేషం.

దేవస్థాన బాలమందిర్ బాలబాలికలచే శ్రీ ముదివర్తి కొండమాచార్య ఆధ్వర్యంలో గీత 15వ అధ్యాయ పఠనం జరిగింది.

పుష్పాలంకరణలలో గెలుపొందిన వారి పేర్లు ఉద్యాన విభాగాధికారి శ్రీ తమ్మణ్ణ చదవగా, శ్రీమతి కుమారస్వామి రెడ్డి బహుమతులు అందజేశారు.

కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య స్వామివారి నుండి వచ్చిన వేదపండితులు ఆశీఃపురస్సర



వస్త్ర బహుమానం శ్రీ కుమారస్వామిరెడ్డికి, ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ సత్యనారాయణరాజుకు అందజేశారు. కార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామిరెడ్డి కామకోటిపీఠ ప్రతినిధులకు శ్రీవారి ప్రసాదం అందజేశారు.


శ్రీ కుమారస్వామిరెడ్డి ప్రసంగిస్తూ ఈ స్వర్ణోత్సవాలు 1984 సంవత్సరాంతం వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లా



లోనూ, ఇతర రాష్ట్రాలలోనూ మూడురోజులపాటు జరుగుతాయని అన్నారు. ప్రత్యేక సంచిక వెల: రు. 50/- నుండి 25/- కు తగ్గిస్తూ ప్రకటించారు.

హిందూధర్మ రక్షణసంస్థ నిర్వహించే పురాణప్రబోధ పరీక్షలను వివరిస్తూ గత నాల్గేళ్ళలో 72 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇక ముందు ఈ పరీక్షలలో సర్వప్రథముడుగావచ్చిన 'విద్యార్థి' విద్యాభ్యాసానికయ్యే పూర్తి ఖర్చును దేవస్థానం భరిస్తుందని ప్రకటించారు.

ఈ స్వర్ణోత్సవ సన్నాహాలను పేర్కొని, 40 వేల ఆహ్వానాలద్వారా, 20 వేల కరపత్రాలద్వారా ఇంటింటిని ఆహ్వానించామని అన్నారు.



శ్రీ విద్యానందగిరిస్వామి (ఏర్పేడు) తమ భాషణంలో బ్రహ్మవిద్య పొందేందుకు తగిన గురువు అవసరమని, సద్గురువుల లక్షణాలను వివరించారు. సద్గురువుల ద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొంది సంసారాన్ని దాటవచ్చని అన్నారు.

శుకబ్రహ్మాశ్రమాధిపతులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి, ఆధ్యాత్మికశక్తి సంపాదించటం కష్టమే ఐనా సాధన ద్వారా సులభతరంచేసుకోవచ్చని అలసత అనర్థహేతువని


అన్నారు. క్రోధవశుడై నందువల్లనే మానవుడు నిషిద్ధకర్మలను చేస్తున్నాడనీ నరుడు కనీసం నరుడుగా వుండాలనీ, లేదా నారాయణుడయ్యేందుకు ప్రయత్నించాలనీ అన్నారు. మోక్ష మనేది ఎక్కడోలేదని గ్రహించ గలిగితే అదిమనలోనే వుందని అన్నారు.

డా॥ దివాకర్ల వేంకటావధాని తమ ప్రసంగంలో, భక్తి అనేది అయిదు విధాలని, అందులో దాస్యభక్తి ఒకటని, భక్తరామదాస్, భక్తశబరి, దీని ద్వారా ముక్తిపొందారని అన్నారు.

డా॥ బిరుదురాజు రామరాజు ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని కాపాడుతుందని వేదమహర్షిప్రోక్తమైన మనధర్మం అనాది అని, అట్టిమతం దురదృష్టవశాత్తు ఆపదల పాలౌతున్న దనీ, ధర్మసంరక్షణ కార్యక్రమంలో దేవస్థానం విశ్వహిందూ పరిషత్తు సహాయాన్ని పొంది, తన నిధులను ధర్మప్రచారానికి వినియోగించాలనికోరారు.

శ్రీమల్లాది చంద్రశేఖరశాస్త్రి మోక్షాన్ని పొందాలంటే ధర్మము, భక్తిచాలా అవసరమని, భక్తిలేని ధర్మంవల్లకూడా ప్రయోజనంలేదని, ధర్మమూ, భక్తివల్లనే సత్ఫలితాలు పొందవచ్చని, ద్రౌపది, విదుర, భీష్ముల చరిత్రలు నిరూపిం చాయని అన్నారు. ధర్మం అంటే ఆయావర్గాల వారికి ఏర్పడ్డకర్తవ్యాలు నిర్వహించటమని, అంటే గృహిణి గృహిణి బాధ్యతలను, శిష్యుడు తన కర్తవ్యాన్ని నిర్వహించాలని అన్నారు. ధర్మం ఉన్నచోట కృష్ణభగవానుడు కూడాఉంటా డని, ఆ మహాపురుషుల బోధలను ప్రచారం చేయటంలో హిందూధర్మరక్షణసంస్థ పాంచజన్యపాత్ర నిర్వహిస్తున్నదని అన్నారు.

దేవస్థాన ప్రజాసంబంధాధికారి శ్రీ రావుల సూర్యనారా యణమూర్తి, ఈ త్రయాహ్నిక క్రతుసమాప్తిగా వందనసమ



ర్పణచేస్తూ, ఈ కార్యక్రమాలకు చేయూతనిచ్చిన సంస్థలకు, వ్యక్తులకు, పేరుపేరునా వందన సమర్పణచేశారు.

శ్రీ దూసి బెనర్జీభాగవతార్ 'పార్వతీ కల్యాణ' హరి కథాకాలక్షేపంతో త్రయాహ్నిక స్వర్ణోత్సవ కార్యక్రమాలు మంగళప్రదంగా పూర్తయ్యాయి.

ఒకప్రక్క భక్తులనాకర్షిస్తూ మరొకచేత భక్తులకు వరదానంచేస్తున్నట్లు శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహంతీరు, మహిమ, ఈ త్రయాహ్నిక స్వర్ణోత్సవం దర్శించిన వేలాది భక్తులకు శాశ్వతసత్య మనిపించింది.

పలువురు పీఠాధిపతుల, మఠాధిపతుల ఆశీర్భాగ్యము, భక్తులనుండి ఉవ్వెత్తుగా వచ్చిన సహకారసంపదతో ఉత్తేజిత మైన తిరుమల తిరుపతి దేవస్థానం, సనాతనధర్మ ప్రబోధన పరిరక్షణలకు మరొకసారి తనను తాను అంకితంచేసుకున్నది ఈ స్వర్ణోత్సవ శుభసందర్భంలో.

'నాగరాజ్'





వైశాఖమాస వైశిష్ట్యము

ద్వాదశమాసములలోను కార్తిక, మాఘ వైశాఖమాసములు మిక్కిలి ప్రశస్తమైనవి.

వైశాఖమాసములో సూర్యుడు మేషరాశి యందుండగా నదికాని, వాపి, కూప తటాకములందుకాని, స్నానమాడి జలదానము చేసిన మిక్కిలి ఫలప్రదమగును. అందుచేత వైశాఖమాసమందు చలివేంద్రములు కట్టించి దాహముగొన్నవారికి మంచినీరు, మజ్జిగయిచ్చుట మొ॥గు కార్యములచే తన కున్న దురితములు తొలగించుకొనుటయే కాక, తనవంశస్థులను కిల్బిషములనుండి కూడ విముక్తిపరచినవాడగును.

వైశాఖమాసమున తృష్ణతీరుటకు జలము కాని, ఎండకుగొడుగు పాదాలకు పాదరక్షలు శరీరతాపము తగ్గుటకు వీవనలిచ్చుటకాని చేసినచో అట్టివారికి సమస్తపాపములు నశించుటయేకాక బ్రహ్మాది ముక్కోటి దేవతలు సంతృప్తిచెంది, సర్వసుఖములతో పాటు జన్మాంతరమున వైకుంఠప్రాప్తి కలుగజేతురు. విసనకఱ్ఱవిలువ బహు స్వల్పమే. ఐననేమి? విసనకఱ్ఱ ఏ మనుజుడు ఇవ్వనిరాకరించునో అట్టివానికి వాయురోగము సంప్రాప్తమగును. విసన కఱ్ఱ నిచ్చుటకు శక్తిలేనివారు మార్గాయాస ముతో అలసిన వారికి కనీసం తనపై నున్న వలువతోనైన విసరి ఆ వ్యక్తి తాపము తీర్చవలెను.

దూది రేణువులు గాలికి యెటుల దూర మగునో అటులనే వైశాఖ మాసంలో శయ్యను, తలగడను దానముచేసిన అతని పాపాలు పటాపంచలగును. శయ్యా దానము చేయుటకశక్తుడైనచో తాటాకుల చాపనైన దానమిచ్చిన శేషశయనుడు స్వయంగావచ్చి ఆసీనుడై శయనించునని ప్రతీతి.

'వైశాఖం- పొయ్యిశాకం ' అన్నారు. వైశాఖమాసమున ఎండ తీక్షణముగావుండి వేడిగాడ్పులు వీచును. కాన తాపోపశమన నిమిత్తం ఫలములు, పానకము, బెల్లంకలిపిన దోసపండు, చెఱకుముక్కలు, చక్కెర కలిపిన మామిడి పండ్లరసము, వడపప్పు, పనసతొనలు దానమిచ్చిన, గొప్ప పుణ్యవంతులై రాజతుల్య భోగము లనుభవించును.

వైశాఖమాసమున నది తదితర జలాశయములలో స్నానం చేయవలెను కాని, యింటివద్ద ఘటములోని నీటితో చేయరాదు. అటుల మొండివైఖరితో చేయువారు మరు జన్మలో కుక్కలై తిరుగుదురు అని శాస్త్రం.

జీవితం బుద్బుదప్రాయం. ఏ నిమిషానికేమి జరుగునో తెలియదు. కాళ్ళు సేతులు సరియైన స్థితిలో వున్నపుడే తీర్థయాత్రలు సేవించి శ్రీహరిని నమస్కరించగలం. నాలుకతో స్తోత్రంచేయగలం. భగవన్మూర్తిని కనులార చూడగలము. వృద్ధాప్యములో చేయవచ్చునులే అని వుపేక్షించినచో హఠాత్తుగా వాత, పిత్త, శ్లేష్మములు అడ్డు పడి నోటమాటరాక కాళ్ళు, కరములాడక పోవచ్చును. కాన ఆరోగ్యవంతునిగా వున్నపుడే వ్రతములాచరించినచో నష్టమేమియు కలుగదు.

ఏ మానవుడు వైశాఖ మాసవ్రతమును నిర్లక్ష్యభావముతో చూచునో, ఎవడు రేపు, మాపుయని కాలయాపన చేయునో, ఏనరుడు లోభత్వముచే దాన ధర్మములకు వెనుకంజవేయునో, అట్టివారు కాకి, కిరి, కుక్క మున్నగు నీచ జన్మలెత్తి నరక కూపములనుండి బయటపడజాలరు.

శ్రీమన్నారాయణుని పూజలు సలుపుటకు ఏయే ఋతువులు, కాలములు మంచివో నిర్ణయింపబడివున్నవి. వర్షాకాలమున వరద, బురదలుండుటచే జనులకు పూజాపునస్కారములు సల్పుటకు ఆటంకములు కల్గును. దానితర్వాతిది చలికాలము. చన్నీటిస్నానమన్న ప్రజలు ఉత్సాహము చూపరు. స్నాన దానములుచేయరు. ఇక ఎండాకాలము అనగా వైశాఖమాసము. ఈనెల అన్ని విధాల శ్రేయస్కరమైనది. కనుక వైశాఖ మాసమన్న శ్రీహరికి ప్రీతి పాత్రమైనది. ఈ మాసములో సమస్తఫలములు, వస్తువులు లభించును. దానధర్మములకు అనువైనకాలము.

వైశాఖ మాసమున సూర్యుడు మేషరాశి యందు చేరినతోడనే పుణ్యకాలమారంభమగును. అత్తఱి శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవితోడను, దేవగణంతోడను దివినుండి భువికి దిగి ప్రతియిల్లు శోధించును. ఎవడు వైశాఖమాసములో స్నానసంధ్యాదికములు చేసి పండ్లు, భోజనము, ఛత్రము, పాదరక్షలు, శయ్య, తలగడ, విసనకఱ్ఱ, జలపానము, గుడము, పరిమళ ద్రవ్యము మొ॥ నవి దానముచేయునో వానికి పరంధాముడు సకలైశ్వర్యములు, వంశాభివృద్ధి కలుగజేసి జన్మాంతరమున తన సన్నిధిని చేర్చుకొనును.

ఎవరైతే వైశాఖమాసములో విష్ణుమూర్తికి దధ్యోజనము నైవేద్యముగా పెట్టుటకాని, బ్రాహ్మణునకు అన్నదానము కాని చేయడో అతడు పిశాచ రూపమున పీడింపబడును.

వైశాఖ శుద్ధతదియను అక్షయతదియ అందురు. ఆనాడు చేసిన పితృదేవతల శ్రాద్ధ కర్మలకు విష్ణుమూర్తి సంతసించి విశేషఫలము నిచ్చును. అంతేకాక ఆనాటి దానములకు అనంతఫలములు కల్గును.

వైశాఖమాసములో అనుదినము ఉదయముననే లేచి, నదీస్నానముచేసి, హరిహరాదులను ధ్యానించి, శక్తికొలది ఐదు తమలపాకులు ఒక పోకచెక్క, లవంగపట్ట, పూలతో సద్బ్రాహ్మణునకు యిచ్చి నమస్కరించినచో నిస్సంతులకు సంతానమూ, దీర్ఘాయురారోగ్యములు చేకూరును. అంతియకాక సకల సౌభాగ్యములు కల్గి సంతానవృద్ధి గోసంపద, భూసంపద లున్ను కల్గును. అవివాహితులు నిత్యం తాంబూలం దానం చేసినచో సుగుణవతి

సౌభాగ్యవతియగు స్త్రీ భార్యగా లభించును. ఆస్తిని వ్యాజ్యములో కోల్పోయినవారు తాంబూలదానము చేసినచో నష్టపోయిన ధనము తిరిగి పొందుదురు.

వైశాఖ, కార్తిక, మాఘ, ఏ మాసమందైనను నూలువస్త్రము, పట్టువస్త్రము, ఉన్ని, శాలువ మొ॥ నవి దానమిచ్చినచో ఆ జన్మమందేకాక, జన్మజన్మలకు ఆ దాన ఫలము వలన శుభములుకల్గి అన్నవస్త్రములకు లోటుండదు. వెనుక జన్మలో ద్రౌపది వస్త్రదానము చేసిన ఫలితంగా వస్త్రాపహరణ సమయమున శ్రీకృష్ణుడు వలువలనిచ్చి తులువల బారినుండి పాంచాలిని కాపాడినాడు.

కలియుగ వైకుంఠమని వాసిగాంచిన శ్రీ తిరుమల తిరుపతి క్షేత్రమందు శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధి యందును, శ్రీ జగన్నాథమందును వైశాఖమంతయు భక్తితో విష్ణుమూర్తిని సేవించి విధివిధాయకముగా వ్రతమాచరించి సద్బ్రాహ్మణునకు గో, భూ, హిరణ్య, సాలగ్రామ, ఫల, పుష్ప, అన్న, వస్త్ర తాంబూలాది దానధర్మములు చేసినచో సకల కామితార్థ మనోవాంఛలు యీడేరును.

వైశాఖమాసము యొక్క 30 రోజులలో యే ఒక్కదినము నైనను నదీ స్నానము చేసి, విష్ణుమూర్తిని తులసీ దళములతో పూజించి, విష్ణుపురాణము ఆలకించినయెడల బ్రహ్మహత్య, గోహత్య, శిశుహత్య, పరధనాపహరణ, మాంసభక్షణ, సురాపానము మొ॥లగు అత్యాచారము లన్నియు నశించును.

మాఘమాసమువలె వైశాఖమాసములోను వివాహములు ముమ్మరముగా జరుగును.

వైశాఖమాస శుక్లపక్షమందలి త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమాసి–అను యీమూడు తిథులు అతి ప్రధానమైన పుణ్యదినములు. మానవునికున్న సమస్త దుష్కృతములు నశింపజేయుటలో యీ మూడు తిథులకు ప్రత్యేకత కలదు వైశాఖశుద్ధ పౌర్ణమినాడు స్నానం చేయుటకు సామర్థ్యం లేని మనుజుడీ మూడు తిథులలో యే తిథి యందైనను నదీస్నానమాచరించిన యెడల సంపూర్ణమాస ఫలము పొందగలరు.

పూర్వము దేవదానవులు పాలసంద్రమును మథించినప్పుడు అందుండి అమృతము వైశాఖశుద్ధ ఏకాదశినాడు వచ్చెనట. దానిని విష్ణుమూర్తి భద్రపరచి వైశాఖ శుద్ధ త్రయోదశినాడు దేవతలచేత త్రాగించెను. జగత్కర్తయైన ఆ మహా విష్ణువు దేవతల విరోధులును, క్రూరులును అగు అసురులను వైశాఖ శుద్ధ చతుర్దశినాడు సంహరించెను. రాక్షసుల సంహారానంతరం దేవతలు తిరిగి వైశాఖ శుద్ధ పూర్ణిమనాడు స్వర్గాధిపత్యమును పొందిరి. దేవతలు యీమూడు తిథులలోనే ఘన విజయములు పొందుటచేత – త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమాసి దినములను గొప్ప ఫలదాయక దినములుగా నిర్ణయించి వున్నారు.

వైశాఖశుద్ధపూర్ణిమనాడు ఒక సద్బ్రాహ్మణునకు పప్పు, పరమాన్నములతో భోజనమిడిన కీర్తివంతుడగు పుత్రుని బడయగలడు. త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమాసి తిథులందు గీతా పారాయణము చేసినచో వేయి అశ్వమేధ యాగములు చేసినంత ఫలముకల్గును. పుణ్యప్రదమైన యీమూడు దినములలోను విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం వలన వచ్చుఫలమును వర్ణింప బ్రహ్మకైనను శక్యముకాదు. *

(వైశాఖపురాణము ఆధారంగా)

— తేల్కర్ శంకర రావ్

(2వ పేజీ తరువాయి)

వారి 5 గంటలకల్లా మద్రాసు చేరేవారు. మరి కరెంటుతో బళ్ళు నడిచే రోజుల్లో ఈ 18 గంటల ప్రయాణం అన్యాయమనే చెప్పాలి. కనుక ఈ బండిప్రయాణకాలాన్ని మార్చటంతప్పనిసరి. పాసింజరు అన్నంత మాత్రాన ప్రతిస్టేషన్‌లోను గంటలకొద్దీ పడి వుండాలనీ నియమం లేదుకదా! అవసరమైతే దీన్ని ఫాస్టు పాసింజరుగా మార్చి ప్రయాణకాలాన్ని 13 గంటలకు పరిమితం చేస్తే మంచిది.

తిరుపతి ఒంగోలు పాసింజరును విజయవాడ వరకు పొడిగిస్తే మంచిదని లోగడ సూచించటం జరిగింది. ఆధికారికంగా ఈ మార్పు జరిగినట్లు కన్పడదు. ఒంగోలులో ఒక గంటకుమించి ఆగని విధంగా సుమారు 5 గంటలలోపల విజయవాడ చేరే విధంగా మారిస్తే ప్రయాణీకులకు పాలుపోసినంత.

ప్రస్తుతం విజయవాడ బిట్రగుంటల నడుమ ఒక పాసింజరు నడుస్తున్నది. దాన్ని గూడూరువరకు పొడిగిస్తే గూడూరు విజయవాడల నడుమ మరొకబండి ఏర్పడినట్లవుతుంది. వేగం పెంచితే మరీ మంచిది.

ఇక మీటరు గేజిలో తిరుపతి రామేశ్వరంల నడుమ ఎక్స్‌ప్రెస్‌గా నడుపగలిగితే చాల ఉత్తమంగా వుంటుంది. శివకేశవ క్షేత్రాలకు ప్రత్యేక సంధానం ఏర్పాటు చేసినట్లౌతుంది.

పూరీ ఎక్స్‌ప్రెస్‌గా రాకముందు తిరుపతి మచిలీపట్నంల మధ్య ఒక పాసింజర్ ఉండేది. ఇప్పుడు ఇన్నిరైళ్ళున్నా మచిలీపట్నం వైపు ఇబ్బంది అలాగే వుండిపోయింది. అందువల్ల కాకినాడ తిరుపతి పాసింజర్లకు విజయవాడలో కలిపే విధంగా మచిలీపట్నం నుండి ఒకటి రెండు పెట్టెలు వేయగలిగితే చాలా సౌకర్యంగా వుంటుంది.

ఇప్పుడు తిరుపతి హైదరాబాద్‌ల నడుమ ఉదయం బండి ఒకటున్నది కనుక తిరుపతి నుండి హౌరాకు ఒకపెట్టె తగిలించి విజయవాడలో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు కలిపే ఏర్పాటు జరిగితే తిరుపతినుండి కలకత్తా వరకు నేరుగా ప్రయాణసౌకర్యం ఏర్పడుతుంది.

ఇంతకంఠశోషకు కారణం. అన్నీ పెరుగుతున్న ఈ రోజుల్లో యాత్రికుడు ఎక్కిదిగే ప్రయాణాలు చేయలేడు. కనుక వీలైనంత వరకు సరాసరి సౌకర్యాలు ఏర్పాటు చేయగలిగితే మనుష్యుల తృప్తిలోనే మాధవుణ్ణి చూచుకోవచ్చు. అదీ సంగతి.


నాగరాజ్ — తిరుపతి.

వార్తాలహరి

వసంతోత్సవం

గత ఏప్రిల్ 13, 14, 15 తేదీల్లో తిరుమల శ్రీవారికి వసంతోత్సవాలు ఘనంగా నిర్వహింపబడ్డాయి. ఈ ఉత్సవాలలో చివరిరోజైన చైత్రశుద్ధపౌర్ణమి (ఏప్రిల్ 15) నాడు శ్రీ మలయప్పస్వామిని శ్రీదేవి, భూదేవులతో బంగారు తిరుచ్చిలో వసంత మండపానికి వేంచేపు చేశారు. శ్రీ స్వామితో పాటు శ్రీకృష్ణ, రుక్మిణి సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కూడ వసంతమండపానికి తీసుకొచ్చారు. తదనంతరం స్నపన తిరుమంజనం, విశేష సమర్పణ కార్యక్రమాలు జరిగాయి. ఆ సాయంత్రం పురవీథులలో శ్రీవారిని ఊరేగించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ జి. కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. ఈ మూడు రోజుల ఉత్సవాల్లో వేలాది భక్తులు పాల్గొన్నారు.





డాక్టరేటు బిరుదం

పసిపాపలు చేతులు చాచినట్లుగా కలువలు పూచినట్లుగా కవిత్వం చెప్పగల సహజ కవి శ్రీ కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి, తి. తి. దేవస్థానంలో పోతనభాగవతమును శిష్టవ్యవహారభాషలో ముద్రించుటకుగాను సంపాదకులుగా వుంటున్న వీరికి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంవారు డాక్టరేటు గౌరవ బిరుదాన్నిచ్చి సన్మానించడం ఎంతో ముదావహం!



అన్నమాచార్య వర్ధంతి

కరీంనగరుజిల్లా కాశ్మీరిగడ్డలో మార్చి 29 న "శ్రీ ఘంటసాల సంగీత కళాసమితి" ఆధ్వర్యంలో స్థానిక యంకమ్మ తోటలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో అన్నమాచార్య వర్ధంతి చేశారు. పలువురు వ్యక్తులు ఉపన్యసించారు. గాయనిగాయకులు అన్నమయ్య కీర్తనలు పాడారు. కార్యదర్శి పి. వి. ఎస్. ఎన్. శర్మ వందన సమర్పణతో పై కార్యక్రమాలు జయప్రదంగా ముగిశాయి.



అన్నమాచార్య వర్ధంతి

తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో గత మార్చి 29, 30, 31 తేదీలలో తి. తి. దేవస్థానాల ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వర్ధంత్యుత్సవాలు నిర్వహింపబడ్డాయి. మొదటిరోజు ఉదయం స్థానిక శ్రీ కోదండరామస్వామి ఉత్సవర్లు, రెండవరోజు ఉదయం స్థానిక శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవర్లు సభాస్థలికి వేంచేయడం ఈ ఉత్సవాల్లో ఒక ప్రత్యేకత.

అన్నమాచార్య వాఙ్మయ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ వార్షిక నివేదికను సమర్పించారు. ఈ మూడు రోజులలో ప్రముఖుల ఉపన్యాసాలు, సంగీత కచ్చేరీలు నిర్వహించారు.

(4 వ పేజీ తరువాయి)


చెప్పదలచుకొన్న మాటను ఉత్తరోత్తర ఆలోచనకుపకరించే ధ్వనితో చెప్పటం ఒక విశిష్ట విద్య. అందులో కూడా ఆంజనేయుడు అఖండపండితుడు. లంకంతటా చాటిన– ''దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః'' అన్న శ్లోకం ఒక ఉత్తమ ధ్వనే అని చెప్పాలి. నేను రాముని సేవకుడను అన్నందువల్ల ప్రయోజనం సిద్ధించదు కనుక, రావణుని తోకతో బంధించి నాల్గుసముద్రాలు త్రిప్పిన వాలి (అంతటి బలసంపన్నుడు) తమ్ముడు సుగ్రీవుని మంత్రినైన నేను రాముని సేవకుడను. అంటే నరుడైన రాముడు ఎంతటి బలపరాక్రమసంపన్నుడో ఊహిస్తే అర్థమయ్యే విషయం.

ఇలా ఎంతైనా చెప్పవచ్చు. ఎన్నైనా చెప్పవచ్చు. ఏమి నేర్చుకుంటామన్న ప్రశ్న? రావణాంతఃపుర స్త్రీలను వివిధావస్థలలో చూచినా మనస్సు చలించకపోవటం ఆంజనేయస్వామికే చెల్లింది. మరి మనం వాటినుండి నేటి వరకు రాక్షసత్వమే నేర్చుకున్నాం. కాని రక్షకత్వం నేర్చుకోలేదు. మనలోని రాక్షసులు మాయమయ్యే వరకు మనకిదే శరణ్యం.


మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్।
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి॥

Edited and Published on behalf of the T. T. Devasthanams by K. Subba Rao, M.A., and Printed at T.T.D. Press
by M. Vijayakumar Reddy, L.P.T., Manager, T.T.D. Press, Tirupati.





1993














WELCOME


చెంత దీపమిడక చీకటి తొలగునా


MALA TIRUPATI DEVASTHANAMS GOLDEN JUBILEE CELEBRATIONS 1933-1983


కోపమున ఘనత కొంచెమై పోవును


TTD
GOLDEN
JUBILEE